అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 2-3 -2018

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 4 సంచిక : 63 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | W O W | 12 + 16 పేజీలు ధర: 5.00

కొలువులు అంతంతే..

ఉద్యోగాల భర్తీపై శ్రద్ధేది?

- సర్కారు తీరుపై నిరుద్యోగుల్లో ఆగ్రహం
- 1.07 లక్షల ఖాళీ పోస్టుల భర్తీకి హామీ
- 48,172 నియామకాలకు నోటిఫికేషన్లు
- ఇప్పటి వరకు 24,682 మందికే కొలువులు
- టీఎస్‌పీఎస్సీ ద్వారా 7 వేల ఉద్యోగాలే భర్తీ


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. తెలంగాణ ఆవిర్భవించి మూడున్నరేండ్లు దాటిపోయినా ఉద్యోగాల భర్తీ అంతంత మాత్రంగానే ఉందని నిరుద్యోగులు విమర్శిస్తున్నారు. కొలువుల భర్తీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ లేదని, అందుకే నిర్లక్ష్యం వహిస్తోందని యువతలో ఆందోళన వ్యక్తమవుతున్నది. 1,07,744 ఖాళీ ..9లో

109శాతం పెరిగిన

అదానీ సంపద

- ఏడాదిలోనే రెండురెట్లు.. • రూ.91 వేల కోట్లతో అదానీకి ప్రపంచంలో 98వ స్థానం • రూ.2 లక్షల 88 వేల కోట్లతో ముకేశ్ అంబానీకి 19వ స్థానం : హురున్ ప్రపంచ ధనవంతుల జాబితా-2018లో..
- ఇండియా నుంచి 31మంది కొత్తవారికి చోటు


వివరాలు 9లో

లంచం వేధింపులు

- ఎలుకల మందు తాగిన దళిత రైతుకుటుంబం
- దంపతులిద్దరూ మృతి • ఇద్దరు పిల్లల పరిస్థితి విషమం
- కలెక్టర్ ఆదేశించినా లోను మంజూరు కాలేదని మనస్తాపం
- మంచిర్యాలలో విషాదం

వివరాలు 9లో


తిరుపతి, భూదేవిల (ఫైల్)

ఏబీవీపీ నేతకు మోకరిల్లి...

బూతులు తిడితే.. శిక్ష తగ్గించారు. జరిమానా రద్దు చేశారు



వివరాలు 3లో

- ఫిర్యాదు చేసిన ప్రొఫెసర్ పైనే విచారణ
- అడ్మిషన్స్ టైమ్‌లో స్టూడెంట్ యూనియన్ల హెల్ప్‌డెస్క్ అనుమతి నిరాకరణ : హెచ్‌సీయూ పాలక మండలి వింతనిర్ణయాలు
- వ్యతిరేకిస్తున్న విద్యార్థి సంఘాలు

అహంకారం

పనికి రాదు

- స్థాయికి మించి మాట్లాడారు : కేటీఆర్‌పై జానారెడ్డి ఆగ్రహం వివరాలు 3లో



పార్టీని నమ్ముకున్న ఏ నాయకుడిని వదులుకోం

- రెండోరోజు భేటీలో చంద్రబాబు వివరాలు 3లో
- ప్రతాపరెడ్డికి అండగా ఉంటామని హామీ

హోలీ వేడుకల్లో

దళితులపై దాడి

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఘటన

నవతెలంగాణ-జడ్చర్ల

హోలీ వేడుకల్లో దళితులపై దాడి జరిగింది. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును జీర్ణించుకోలేని కొందరు ఈ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పలువురు దళితులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో గురువారం జరిగింది. బాధితుల వివరాల ప్రకారం..బాదేపల్లి పట్టణంలోని పాతబజారుకు చెందిన దళితులు హోలీ సంబురాలు జరుపుకుంటున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇది జీర్ణించుకోలేని అదే ప్రాంతానికి చెందిన బీసీ సామాజిక తరగతికి చెందిన కొందరు యువకులు దళితులను కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దళిత యువకులైన గిరిధర్, గణేష్, శివ, కృష్ణ, మహేష్‌లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జడ్చర్ల ఏఎస్ఐ శ్రీనివాస్‌రావు సిబ్బందితో అక్కడికి చేరుకోవడంతో గొడవ సద్దుమణిగింది. గాయాలైన వారిని ..9లో



గోవులపై ఉన్న శ్రద్ధ..మనుషులపై ఏదీ..?

- గో సేవక్ ప్యానల్‌కు 16 మంది.. వివరాలు 2లో మానవ హక్కుల కమిషన్‌కు జీరో

హైకోర్టు లాయర్ల ఆందోళనలు

హైదరాబాద్‌లో..రోడ్డుపై బైటాయించి నిరసనలు..



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల హైకోర్టు లాయర్ల సంఘాలు ఏకగ్రీవంగా చేసిన తీర్మానానికి అనుగుణంగా గురువారం లాయర్లు హైకోర్టు విధుల్ని బహిష్కరించారు. ఈ ఆందోళన శుక్రవారం కూడా కొనసాగనున్నది. ఏపీ, టీఎస్ హైకోర్టు లాయర్స్ అసోసియేషన్ల అధ్యక్షులు ధనుంజయ, కనకయ్యల సారథ్యంలో న్యాయవాదులంతా హైకోర్టు ఆవరణలోనే ఉన్న బార్ కౌన్సిల్ భవన్ నుంచి మదీనా బిల్డింగ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. మదీనా చౌరస్తా వద్ద న్యాయవాదులు కొద్దిసేపు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. లాయర్లు కోర్టు విధుల బహిష్కరణ వల్ల కోర్టు హాల్స్ బోసిపోయాయి. కక్షిదారుల తరఫున వాదించేందుకు న్యాయవాదులు గైర్హాజరవ్వటంతో.. వాదనలు జరగలేదు. కొందరు న్యాయమూర్తులు బెంచ్‌పైనే ఉండటంతో న్యాయవాదులు కొందరు వెళ్లి తాము ఆందోళన చేస్తున్నామని సహకరించాలని కోరారు. అత్యవసర కేసులకు మాత్రమే లాయర్లు వాదనలు వినిపించారు. లాయర్లు వస్తే కేసులు వింటామని, లేనట్లయితే కేసుల్ని కొట్టేయకుండా వాయిదా వేస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. దీంతో విచారణ జరగాల్సిన కేసులన్నీ వాయిదా పడ్డాయి.






క్షమాపణ చెబితేనే క్యాంపస్‌కు రండి.. లేదంటే..

రాష్ట్రపతికి నిరసన సెగ

అలీగఢ్ ముస్లిం వర్సిటీ విద్యార్థులు


ఆగ్రా : భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు విద్యార్థుల నిరసన సెగ తాకింది. ఈ నెల 7న అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) స్నాతకోత్సవానికి రాష్ట్రపతి హాజరుకావాల్సి ఉంది. గతంలో ముస్లింలకు, క్రిస్టియన్లకు వ్యతిరేకంగా వ్యాఖ్యలుచేసిన ఆయన ముందుగా క్షమాపణ చెప్పాలనీ, ఆ తర్వాతే తమ వర్సిటీలోకి అడుగుపెట్టాలని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ(ఏఎంయూ) విద్యార్థులు స్పష్టం చేశారు. 'ఇస్లాం, క్రైస్తవ మతం దేశానికి గ్రహాంతరవాసులంటూ వ్యాఖ్యానించిన ఆయన తన తప్పును ఆమోదించాలి. లేదంటే వర్సిటీ స్నాతకోత్సవానికి గైర్హాజరుకావాల్సిందే. మా మాటలు లెక్కచేయకుండా వర్సిటీకి వస్తే.. తర్వాత జరిగే పరిణామాలకు వీసీ, రాష్ట్రపతే బాధ్యత వహించాలి. ఇతర మతాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన రాష్ట్రపతి పట్ల విద్యార్థులు ఆగ్రహంతో ఉన్నారు' అని వర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఉపాధ్యక్షులు సజాద్ సుభాన్ రాథర్ అన్నారు. 'భారత దేశం ముస్లిం, హిందు, సిక్, క్రిస్టియన్ ఇలా అన్ని మతాలకు చెందినదని రాష్ట్రపతి ఒప్పుకోవాలి. లేదంటూ ఆయనను క్యాంపస్‌లోకి ఆహ్వానించేది లేదు. బీజేపీ ప్రభుత్వం శాంతికి నిజంగా కట్టుబడి ఉంటే, కోవింద్ శాంతి, వైవిధ్యానికి కట్టుబడి ఉంటే.. ఆయన 2010లో చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలిందే' అన్నారు. 'ఆయన హాజరుకావడంవల్ల వర్సిటీకి ఒరిగేదేమీలేదు. వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించే వీసీ ఆయనను ఆహ్వానించారు. బీజేపీ ప్రభుత్వాన్ని, దాని సిద్ధాంతాలను ఏఎంయూ ఆమోదించిందన్న సందేశాన్ని పంపాలని వీసీ కోరుకుంటున్నారు' అని సజాద్ ఆరోపించారు. ఇదిలావుండగా, స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను క్యాంపస్‌లోకి రానిచ్చేదిలేదని



ఎఎంయూఎస్‌యూ కార్యదర్శి మహమ్మద్ ఫహద్ చెప్పారు. 'వారిని ఆహ్వానిస్తే.. వీసీ నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘం స్నాతకోత్సవాన్ని బహిష్కరిస్తుంది. తన సొంత, భవిష్యత్ ప్రయోజనాల కోసం మా వర్సిటీని కాషాయీకరణ చేయాలని వీసీ ప్రయత్నిస్తున్నారు' అని ఫహద్ ఆరోపించారు.

2010లో కోవింద్ చేసిన వ్యాఖ్యలేమిటి?

రామ్‌నాథ్ కోవింద్ 2010లో బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన మతాల వారికి, భాషలపరంగా మైనార్టీలుగా ఉన్నవారికి 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని, వారిని ఎస్సీల్లో కలపాలని రంగనాథ్ మిశ్రా కమిషన్ ఆ సమయంలో సూచనలు చేసింది. దీనిపై బీజేపీ తరపున స్పందించిన రామ్‌నాథ్ కోవింద్ ముస్లింలను, క్రిస్టియన్లను ఎస్సీల్లో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. వారంతా భారత్‌కు ఏలియన్స్ లాంటి వారని అన్నారు.



పద్మశ్రీకి భీమాకోరెగావ్ అల్లర్ల నిందితుడు

శంభాజీ భిడే పేరును సిఫారసు చేసిన మహా సర్కార్



ముంబయి: ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన భీమా కోరెగావ్ అల్లర్ల నిందితుల్లో ఒకరైన శంభాజీ భిడే పేరును పద్మశ్రీ అవార్డుకు మహా ప్రభుత్వం 2016లో సిఫారసు చేసింది. 10 మంది మంత్రులతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీ ఆయన పేరున పద్మశ్రీకి సిఫారసు చేసింది. ఈ విషయం సమాచార హక్కు చట్టం ద్వారా తాజాగా వెలుగులోకి వచ్చింది. భిడే గురూజీ గా సుపరిచితుడైన శంభాజీ భిడే(84) ఓ వివాదాస్పద వ్యక్తి. మహర్ సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న దళితుల పై దాడికి ఉసిగొల్పిన కేసుల్లో 44 మంది నిందితులు. వారిలో భిడే కూడా ఒకడు. మహారాష్ట్రలో జరి గిన పలు అల్లర్లలో భిడే పై కేసులు ఉన్నాయి. అతను ఆర్ఎస్ఎస్ సభ్యునిగా కొనసాగుతుండటం వల్ల పద్మశ్రీ అవార్డుకు మహా సర్కారు ప్రతిపాదించినట్టు సమాచారం. అలాంటి వ్యక్తిని పద్మశ్రీ అవార్డుకు సిఫారసు చేయటంపట్ల అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ ఆక్షేపించారు.

హోలీ పేరిట విద్యార్థినులపై వికృత చేష్టలు

న్యూఢిల్లీ : హోలీ వేడుకల పేరుతో విద్యార్థినులపై వికృత చేష్టలకు పాల్పడిన ఘటనలు దేశ రాజధానిలో చోటు చేసుకున్నాయి. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన విద్యార్థినులపై కొందరు ఆగంతకులు వీర్యంతో నింపిన బెలూన్లను విసిరి పరారయ్యారు. కాగా, ఈ వికృత చేష్టలను నిరసిస్తూ విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఢిల్లీ పోలీసు కేంద్ర కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 'విద్యార్థినులపై వీర్యంతో నింపిన బెల్లూన్లు విసిరిన అగంతకులను పట్టుకోవాలి, మహిళలు సురక్షితంగా హోలీని జరుపుకోనివ్వండి' అని రాసి వున్న ప్లకార్డులను వారు ప్రదర్శించారు. ఢిల్లీ యూనివర్సిటీకే చెందిన యువతి హస్టల్ బయట నడుచుకుంటూ వెళుతుండగా...కొందరు వ్యక్తులు బెలూన్లు విసిరారని... ఆపై రంగులు పూస్తూ అసభ్యంగా తాకినట్లు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో యూనివర్సిటీ వద్ద పోలీసులు నిఘాను పటిష్టం చేశారు.

అక్రమ బదిలీలను అరికట్టాలని లేఖరాసిన అసోసియేషన్ ప్రెసిడెంట్‌పైనా బదిలీ వేటు

పీఎంఓకు లేఖ రాసినందుకు కక్షసాధింపులు

న్యూఢిల్లీ: అధికారులను అక్రమంగా బదిలీ చేస్తున్నారంటూ పీఎంఓకు లేఖ రాసిన అసోసియేషన్ అధ్యక్షుడిపైనా వేటు వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐఐఎస్ అధికారుల బదిలీపై ప్రధాన మంత్రి కార్యాలయానికి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్(ఐఐఎస్)గ్రూప్-ఏ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనింధ్య సేన్‌గుప్తా ఇటీవల లేఖ రాశారు. న్యూఢిల్లీలో దూరదర్శన్ న్యూస్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సేన్ గుప్తాను ఐబీ శాఖ పబ్లికేషన్ డివిజన్‌కు తక్షణం బదిలీ చేస్తూ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలు తక్షణం అమలులోకి వస్తాయని పేర్కొంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ లో అధిక సంఖ్యలో ఐఐఎస్ అధికారుల బదిలీలు జరుగుతున్నాయని, గత రెండు నెలల్లో దాదాపు 140 మంది అధికారులు బదిలీ అయ్యారని ఆయన లేఖలో పేర్కొన్నారు. లేఖ రాసిన ఆయననే బదిలీ చేస్తూ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మంత్రి స్మృతి ఇరానీ నుంచి ఆదేశాలు రావడంతో ఆయన ఖంగు తిన్నారు. కాగా, ఈ అక్రమ బదిలీలపై వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

'వసుధైక కుటుంబం భారత్ సిద్ధాంతం'

న్యూఢిల్లీ : వసుధైక కుటుంబం భారత సూత్రమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఇక్కడ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, భారతదేశంలో అనేక మతాలు పుట్టి, పెరిగాయని, శాంతి, ప్రేమ వంటి సందేశాలు ఈ గడ్డపై నుండే ఇతర దేశాలకు వ్యాపించాయని అన్నారు. తమ చర్యలు తమ మతాన్నే దెబ్బతీస్తాయని మతోన్మాదులు గుర్తించలేకపోతున్నారని మోడీ వ్యాఖ్యానించారు. విజ్ఞాన భవన్‌లో ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్ నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన రాజు అబ్దుల్లా 'ఇస్లామిక్ వారసత్వం : అవగాహన, సంయమనాన్ని పాటించడం' అనే అంశంపై ప్రసంగించారు. తీవ్రవాదంపై అంతర్జాతీయంగా యుద్ధం సాగించడమంటే అది ప్రజల మధ్య లేదా మతాల మధ్య సాగే యుద్ధం కాదని జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 వ్యాఖ్యానించారు. మన విశ్వాసాన్ని, మానవతాన్ని హత్య చేసేవారిపై ఈ పోరాటం సల్పాలని కోరారు.

మైనర్‌పై సామూహిక లైంగికదాడి

ముంబయి: సరదాగా బయటకు వెళ్దామని నమ్మించి ఓ బాలిక(15)పై ముగ్గురు వ్యక్తులు లైంగికదాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గత నెల 26న బయటకు వెళ్దామని మన్సూర్(18), రవీంద్ర(24)లతో పాటు మరో మైనర్(15)లు కలిసి.. ద్విచక్రవాహనంపై బాలికను తీసుకెళ్లారు. బద్లాపూర్‌కు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి.. అక్కడ ఆమెపై ముగ్గురు లైంగికదాడికి పాల్పడ్డారు. బయటకు వెళ్లిన కూతురు తిరిగిరాకపోవడంతో కంగారుపడిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకుని విచారించడంతో వారు నేరాన్ని అంగీకరించారు. మైనర్‌ను జువైనల్ హోమ్‌కు పంపించగా ఇద్దరినీ జైలుకు తరలించారు.



ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు వ్యక్తులు హతం

చెన్నై: చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తుల్ని ఎన్‌కౌంటర్‌లో పోలీసులు చంపేశారు. తమిళనాడులో మదురైలోని ఉసిలంపట్టి గ్రామానికి చెందిన చైన్ స్నాచింగ్ నిందితులు కవియరసు అలియాస్ కవియరసన్(30), మురుగన్ అలియాస్ కల్మండయన్ మురుగన్(28)లను పట్టుకునే క్రమంలో ఒక నిందితుడు కాల్పులు జరపడం మొదలు పెట్టడంతో ప్రాణరక్షణకోసం పోలీసులు కాల్పులు జరిపారని పోలీసు అధికారి వెల్లడించారు.

70 ఏండ్లు గడిచినా..

మారని దళితుల బతుకులు

71 శాతం కూలీలుగానే జీవిస్తున్నారు

- భూస్వామ్య ప్రాంతాలకన్నా ఆదివాసీ ప్రాంతాల్లోని దళితుల్లో సాగుదారులు అధికం

నవతెలంగాణ, జనరల్‌డెస్క్



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు గడిచినా దళితుల పరిస్థితిలో సాపేక్షంగా(ఇతర సామాజిక వర్గాలతో పోలిస్తే) ఎలాంటి మార్పూ రాలేదని ఫిబ్రవరిలో విడుదల చేసిన జనగణన నివేదికలో వెల్లడైంది. ఇతర సామాజిక వర్గాల్లోని రైతుల్లో ఎక్కువభాగం తమ సొంత భూమిని సాగు చేసుకునేవారు కాగా, దళితుల్లో అది చాలా తక్కువగా ఉన్నది. ఈ నివేదికలో రైతులను రెండు వర్గాలుగా విభజించారు. తమ సొంత భూమిని సాగు చేసుకునేవారిని సాగుదారులుగా, ఇతరుల వ్యవసాయ క్షేత్రాల్లో పని చేసేవారిని వ్యవసాయ కూలీలుగా వర్గీకరించారు. 2011 జనగణన నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా దళిత రైతుల్లో ఎక్కువ భాగం వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నవారే.

2011 గణాంకాల ప్రకారం దేశం మొత్తంమీద వ్యవసాయంపై ఆధారపడుతున్నవారిలో దళితుల్లో 71 శాతంమంది వ్యవసాయ కూలీలు, 29 శాతం సాగు దారులు కాగా, గిరిజనుల్లో 47.3 శాతం వ్యవసాయ కూలీలు, 52.7 శాతం సాగుదారులు. ఇతరుల్లో 41 శాతం వ్యవసాయ కూలీలు, 59 శాతం సాగుదారులు. అన్ని సామాజిక వర్గాల్లో చూస్తే 47.3 శాతం వ్యవసాయ కార్మికులు, 52.7 శాతం సాగు దారులు. రైతులకు కల్పిస్తున్న రాయితీల్లో అధిక భాగం వ్యవసాయ కూలీలకు చేరడంలేదని ఢిల్లీ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొ॥ అశ్వినీ దేశ్‌పాండే అన్నారు. విధానపర నిర్ణయాల్లో కూలీరేట్ల అంశం ఉండకపోవడమే అందుకు కారణమని ఆయన అన్నారు.

ఆశ్చర్యకరంగా ఆదివాసీలు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో మాత్రం దళితుల్లో ఎక్కువ శాతంమంది సాగుదారులుగా ఉన్నారు. యూపీ మినహా ఉత్తరాది రాష్ట్రాలుసహా, ఈశాన్య రాష్ట్రాల్లో ఆదివాసీలు అధికంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే, రాజస్థాన్‌లోని మొత్తం 33 జిల్లాల్లో 28 జిల్లాల్లో దళితుల్లో ఎక్కువమంది సాగుదారులుగా ఉన్నప్పటికీ మిగతా ఆదివాసీ రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ శాతమేనన్నది గమనార్హం. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల్లో దళితుల్లో సాగుదారులు అధిక శాతం ఉన్నారు. భూస్వామ్య సమాజాలతో పోలిస్తే ఆదివాసీ సమాజాల్లో భూమిపై సమాన హక్కులుంటాయని జేఎన్‌యూ సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ ప్రొ॥హిమాన్షు అన్నారు. భూస్వామ్యవర్గాలు అధికంగా ఉన్న బీహార్, హర్యానా, పంజాబ్, గుజరాత్, తమిళనాడు, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో దళితుల్లో ఎక్కువ శాతం వ్యవసాయ కూలీలుగానే కొనసాగుతున్నారు. దాంతో, ఆహార ధాన్యాలకు ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర వల్ల అధికంగా లబ్ది పొందుతున్నది సాగుదారులేనని, వ్యవసాయ కూలీలు కాదని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

మోడీ డిగ్రీ వివాదం

ఆ వివరాలు బహిర్గతం చేయలేం

- ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన యూనివర్సిటీ



ఢిల్లీ: ప్రధాని మోడీ డిగ్రీని బహిర్గతం చేయలేమని ఢిల్లీ హైకోర్టుకు ఢిల్లీ యూనివర్సిటీ గురువారం తెలిపింది. మోడీ డిగ్రీ వివరాలు తెలపాలని 2016లో సమాచార హక్కు చట్టం ద్వారా నమోదైన పిటిషన్‌కు సమాధానమిస్తూ... తమకున్న పరిమితుల దృష్ట్యా విద్యార్థుల సమాచారాన్ని బహిర్గతం చేయలేమని కోర్టుకు స్పష్టం చేసింది. తమకు విద్యార్థులతో 'విశ్వసనీయ బంధం' ఉందని.. వారి డిగ్రీలకు సంబంధించిన విషయాలను తెలపబోమని చెప్పింది. పిటిషనర్లు స్వార్థ ప్రయోజనాలనాశించి కోరుతున్నారని ఆరోపించింది. సమాచార కార్యకర్తలు అంజలీ భరద్వాజ్, నికిల్ డే, అమృత జోహ్రిలు.. ప్రధాని మోడీ డిగ్రీ వివరాలను తెలపాలని కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ)ను కోరారు. దీంతో వివరాలు అందించాలని ఢిల్లీ యూనివర్సిటీకి సీఐసీ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో మోడీ దాఖలు చేసిన వివరాలు (1978వ బ్యాచ్ బీ.ఏ డిగ్రీ) పరిశీలించడానికి అనుమతినివ్వాలని యూనివర్సిటీని సీఐసీ కోరింది. అయితే దీనికి యూనివర్సిటీ అంగీకరించలేదు. సీఐసీ ఉత్తర్వులను నిలిపివేయాలని కోర్టులో పిటిషన్ వేసింది. దీంతో కోర్టు దీనిపై నిలుపుదల ఉత్తర్వులు జారీ చేసింది. యూనివర్సిటీయే ఆ వివరాలు బయటపెట్టాలని ఈ యేడాది జనవరిలో తెలిపింది. కోర్టు నిర్ణయంపట్ల సమాచార కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ప్రజలకు తెలియాల్సిన విషయమని.. ఇలా చేస్తే సమాచార శాఖను నియంత్రించినట్టే అవుతుందని వాపోయారు.

గోవులపై ఉన్న శ్రద్ధ..మనుషులపై ఏదీ..?

గో సేవక్ ప్యానల్‌కు 16 మంది..


- మానవ హక్కుల కమిషన్‌కు జీరో
- బీజేపీ పాలిత రాష్ట్రం

హర్యానా సర్కారు తీరు ఇది..

న్యూఢిల్లీ : నాలుగున్నరేండ్ల కిందట కాంగ్రెస్ నేతృత్వంలోని భూపేంద్రసింగ్ హుడా హయాంలో హర్యానా మానవ హక్కుల కమిషన్ (హెచ్‌హెచ్‌ఆర్‌సీ) ఏర్పాటు జరిగింది. అయితే.. ఇప్పుడు పేరుకు మాత్రమే కమిషన్ ఉంది తప్ప, పని మాత్రం ఆటకెక్కింది. 19 నెలల కిందట బీజేపీ నేతృత్వంలోని మనోహర్‌లాల్ ఖట్టర్ అధికారంలోకి వచ్చాక ఖాళీగా ఉన్న హెచ్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ పదవిని భర్తీ చేయకుండా నిలిపివేసింది. హెచ్‌హెచ్‌ఆర్‌సీ ప్యానెల్‌లో ఇద్దరు సభ్యులను కూడా గత ఐదు నెలలుగా నింపలేదు. పర్యవసానంగా కేసులన్నీ పెండింగ్‌లో పడిపోయాయి. దాదాపు 2,205 కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద జన్ అభియాన్ మంచ్ సభ్యులు పిపి కపూర్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది.

గో సేవక్ ప్యానెల్‌కు 16 మంది సభ్యులు

'నిజానికి కమిషన్‌లో కీలక సభ్యుల పదవులు ఖాళీగా ఉండగా, రాష్ట్రంలోని గో సేవా ఆయోగ్ కమిషన్‌కు సంబంధించి ఒక పోస్టు కూడా ఖాళీగా లేదు. 'గో' ప్యానెల్‌లో ఉన్న 16 పోస్టులనూ భర్తీ చేసింది. మానవ హక్కుల పట్ల ఖట్టర్ ప్రభుత్వం ఎంతటి నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నదో ఇది



స్పష్టం చేస్తున్నది' అని పిపి కపూర్ చెప్పారు. 'మనుషుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందనడానికి ఇదే చక్కటి ఉదాహరణ' అన్నారు. హెచ్‌హెచ్‌ఆర్‌సీలో పెండింగ్‌లో ఉన్న 2,205 కేసులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఈ 2,205 కేసులో 800 ఫిర్యాదులు గత ఐదు నెలల్లో నమోదైనవే. మానవహక్కుల కమిషన్‌లో కీలకమైన చైర్‌పర్సన్, సభ్యుల పోస్టులు ఖాళీగా ఉండటంతోపాటు, మంజూరైన 83 ఇతర పోస్టుల్లో 34 ఖాళీగా ఉన్నాయి. ఈ 34లో రెండు రిజిస్ట్రార్, జాయింట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, రెండు ప్రత్యేక సెక్రెటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మానవ హక్కుల కమిషన్ పనిచేసేందుకు ఇవన్నీ చాలా ముఖ్యమైన పదవులని కపూర్ తెలిపారు.

బడ్జెట్ పెంచారు... పని జరగడంలేదు..

2012 సెప్టెంబరులో హెచ్‌హెచ్‌ఆర్‌సీ ఏర్పడినప్పుడు దానికి కేటాయించిన వార్షిక బడ్జెట్ రూ. 2.5 కోట్లు. క్రమంగా పెరుగుతూ 2017-18 నాటికి దాని బడ్జెట్ రూ. 6.5 కోట్లకు చేరింది. బడ్జెట్ కేటాయించారు గానీ... నిధులు మాత్రం వృథా అవుతున్నాయి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని.. ప్యానల్ పనిని పునరుద్ధరించే విషయంలో జోక్యం చేసుకోవాల్సిందిగా రాష్ట్రపతి, జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కు సామాజిక కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు.

హక్కులు అణచివేస్తున్నారు

రాష్ట్రంలో దళితులు, మైనారిటీలు, మహిళలు, బలహీన వర్గాలపై తరచుగా హత్యలు సహా తరచుగా అనేక నేరాలు జరుగుతున్నాయనీ, వీరి నుంచి అనేక ఫిర్యాదులు వస్తుంటాయని కపూర్ చెప్పారు. అందుకే ఈ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు. దీంతోపాటు, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక జాట్ రిజర్వేషన్ ఆందోళన సమయంలో జరిగిన అనేక హింసాత్మక సంఘటనలు, డేరా సచ్చా సౌదా ఘటనలు సహా పోలీసులు, ఇతర భద్రతా దళాల దాడుల్లో దాదాపు 90 మంది మృతిచెందారని సామాజిక కార్యకర్తలు తెలిపారు.

మానవహక్కుల ఉల్లంఘన కేసుల్లో అగ్రస్థానం

మానవ హక్కుల ఉల్లంఘన కేసులను ఎదుర్కొంటున్నట్లు రాష్ట్రాల్లో గత మూడేండ్లుగా హర్యానాదే అగ్రభాగం. 'మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా ఫిర్యాదులను సమర్పించటానికి రాష్ట్రంలోని మూడు కోట్ల మందికి ఒక ప్రధాన వేదికగా లేకుండాపోయింది. వారి మనోవేదనలను వినడానికి ఎవరూ లేరు' అని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరుకాలేను

- లోక్‌పాల్ ఎంపిక కమిటీ

సమావేశంపై మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ : లోక్‌పాల్ ఎంపిక కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే గురువారం తిరస్కరించారు. తనను ప్రత్యేక ఆహ్వానితుడుగా ఆహ్వానించడాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు. అవినీతిపై సాగించే పోరాటంలో అత్యంత ముఖ్యమైన లోక్‌పాల్ ఎంపిక క్రమంలో ప్రతిపక్షాల గొంతు వినిపించకుండా చేయాలన్న కుట్రతోనే అధికార పక్షం ఈ విధంగా వ్యవహరిస్తోందని ఖర్గే వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోడీకి లేఖ రాశారు. ప్రతిపక్ష నేతను ప్రత్యేక ఆహ్వానితుని స్థాయికి పరిమితం చేయరాదు. నిర్మాణాత్మకమైన, అర్థవంతమైన భాగస్వామ్యం కన్నా కేవలం లాంఛనప్రాయంగా పిలవడానికి ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. లోక్‌పాల్‌గా ఎంపిక చేయడానికి పరిశీలించే అభ్యర్థుల జాబితాను కూడా తనకు పంపలేదని అన్నారు. తనకు ముందుగా ఆ సమాచారం లేనపుడు ఇక సమావేశానికి తాను వచ్చినా విలువుండదని అన్నారు. లోక్‌పాల్ చట్టాన్ని ప్రభుత్వం సవరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.

'కార్తీ'కి 5 వరకూ సీబీఐ కస్టడీ

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టయిన కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి ఐదు రోజుల సీబీఐ కస్టడీకి ఢిల్లీ పాటియాలా కోర్టు అనుమతినిచ్చింది. ఈ నెల 5 వరకు విచారించాలని సీబీఐకి తెలిపింది. 14 రోజులు కస్టడీకి అనుమతించాలని కోరిన సీబీఐ ప్రతిపాదనను కోర్టు తిరస్కరించింది. కార్తీని ఒక్కరోజు అదుపులోకి తీసుకోవాలన్న కోర్టు గడువు ముగియడంతో సీబీఐ అధికారులు అతడిని పాటియాలా కోర్టులో గురువారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అడిషనల్ సొలిసిటర్ తుషార్‌మెహతా న్యాయస్థానానికి వివరిస్తూ... కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న కార్తీ, ఇతరులను విచారించడానికి.. 14 రోజుల రిమాండ్‌కు అనుమతించాలని కోర్టును కోరారు.

అంబులెన్స్ లేక...

సెలైన్ బాటిల్‌తో 30 కిలోమీటర్లు బైక్‌పైనే..

ఆస్పత్రికి చేరేలోపే బాలిక మృతి

భోపాల్: అంబులెన్స్ అందుబాటులో లేక మధ్యప్రదేశ్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. అంబులెన్స్ సేవలు అందుబాటులో లేకపోవడంతో నిమోనియాతో బాధపడుతున్న నాలుగేండ్ల బాలికను ఆమె చేతికి పెట్టిన సెలైన్ బాటిల్‌ను అలాగే పట్టుకుని తల్లిదండ్రులు బైక్ పై 30 కిలోమీటర్లు ప్రయాణించారు. సమయానికి చేరకపోవడంతో బాలిక అప్పటికే మృతిచెందిందని వైద్యులు ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లో రత్లాం జిల్లాలోని నంద్లేటా గ్రామానికి చెందిన ఘన్‌శ్యాం.. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న తన కూతురు జీజా(4)ను సోమవారం స్థానిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించాడు. అనంతరం ఆ బాలికను జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఆరోగ్య కేంద్ర సిబ్బంది సూచించారు. దీంతో అంబులెన్స్ సౌకర్యాన్ని ఘన్‌శ్యాం కోరగా అందుబాటులో లేదని ఆరోగ్య కేంద్ర సిబ్బంది తెలిపారు. చేసేదేమీ లేక జ్వరంతో బాధపడుతున్న కూతరు జీజాను తీసుకుని తన మిత్రుడు, తాను, తన భార్య, ఒకే ద్విచక్రవాహనంపై 30 కిలోమీటర్ల దూరంలోని ఆస్పత్రికి బుధవారం బయలుదేరారు. కానీ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చేరగానే జీజా అప్పటికే చనిపోయిందని వైద్యులు ప్రకటించారు. ఈ ఘటన వివరాలు స్థానిక మీడియాలో ప్రసారం కాగా రత్లాం జిల్లా కలెక్టర్ సోమేశ్ మిశ్రా స్పందించి, విచారణకు ఆదేశించారు.

డిజిటల్ ప్రొవైడర్లు దిగొచ్చేంత వరకు బంద్

జాక్ చైర్మెన్ డి.సురేష్‌బాబు

న్యూఢిల్లీ : 'డిజిటల్ ప్రొవైడర్ల యాజమాన్యాలు దిగొచ్చేంత వరకు నేటి(శుక్రవారం) నుంచి థియేటర్లలో సినిమాల ప్రదర్శనను నిలిపివేస్తున్నాం' అని దక్షిణాది భారత చలన చిత్ర పరిశ్రమల జాయింట్ యాక్షన్ కమిటీ(జాక్) చైర్మెన్ డి.సురేష్‌బాబు అన్నారు. గురువారం ఈ విషయంపై హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, 'డిజిటల్‌సర్వీస్ ప్రొవైడర్లు ప్రాంతీయ చిత్రాలకు వీపీఎఫ్ తగ్గించడం లేదు. కేవలం వీపీఎఫ్ ధరలు ఎక్కువగా ఉండటమే కాదు, చాలా ఇబ్బందులున్నాయి. కొన్నిసార్లు సినిమా థియేటర్లలో 20 నిమిషాలపాటు ప్రకటనలు వేస్తున్నారు. దీని వల్ల ప్రేక్షకులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. సినిమాకు రావడమే ఇబ్బంది అనుకునే పరిస్థితుల్లో జనాలు ప్రకటనలను ఇష్టపడటం లేదు. సినిమా ట్రైలర్లను వేయడానికి ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఇలా పలు అంశాల విషయమై ఐదు రాష్ట్రాల నిర్మాతల మండలి సంయుక్తంగా ఈ జేఏసీని ఏర్పాటు చేసుకుని ప్రొవైడర్లతో చర్చలు మొదలుపెట్టాం. ట్రైలర్లకు తక్కువ తీసుకునేందుకు ఒప్పుకున్నారు. రేట్లు మాత్రం తగ్గించే విషయంలో ఇంకా చర్చలు జరుగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాల్లో నేటి నుంచి సినిమా థియేటర్లు బంద్ చేస్తాం. తదుపరి చర్చలను బట్టి ముందుకు వెళ్తాం. కొన్నాళ్ళపాటు వర్చువల్ ప్రింట్ ఫీజు తీసేయాలని కోరుతున్నాం. దీనికి వారి నుంచి సమాధానం లేదు. ఇప్పటికైతే కొంత తగ్గించారు, ఇంకా తగ్గించాల్సి ఉంది. అయితే దక్షిణాది రాష్ట్రాల వీపీఎఫ్ అంతా ఒకేలా ఉంది. ఉత్తరాదిలో కొన్ని చోట్ల ఎక్కువగా, మరికొన్ని చోట్ల తక్కువగా ఉంది. ఇంతకు ముందు మామూలు సౌండ్ టెక్నాలజీ ఉండేది. ఇప్పుడు అట్మాస్ వచ్చింది. దాన్ని ఎగ్జిబిటరే పెట్టుకున్నారు. దానికి ఎలాంటి ఫీజు లేదు. ప్రొజెక్షన్ సిస్టమ్ మాత్రం ఇతరులు పెట్టి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించారు. థియేటర్లలో సౌండ్, సినిమా ప్రొజెక్షన్, సీట్లు అన్ని థియేటర్ యాజమానులకే ఇవ్వాలి. డిజిటల్ ప్రొవైడర్లలో యూఎఫ్ఓ, క్యూబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రసాద్‌కు ఉన్న పీఎక్స్‌డీ ఉంది. ఆయన ఇండస్ట్రీ ఎలా అంటే అలా ఉంటానన్నారు. ఇవి కాకుండా రాక్స్, ఆల్ట్రా, ప్రొవిజ్ చిన్న చిన్న వాళ్ళు కూడా ఉన్నారు. కానీ యూఎఫ్ఓ, క్యూబ్ కలిసి 90శాతం ఉండటంతో వీళ్ళతోనే ప్రధానంగా



దామోదర ప్రసాద్,సి.కళ్యాణ్, సురేష్‌బాబు, జెమినీ కిరణ్, మురళీమోహన్

చర్చించాల్సి వస్తుంది. వీటిలో కొత్తగా పోటీకి ఎవరైనా వస్తే ప్రోత్సహిస్తాం. సినిమాలు ఆపేయాలని మాకు ఎలాంటి దురుద్దేశం లేదు. ఎవరైనా మాకు వెయ్యి ప్రొజెక్టర్లు, వెయ్యి సర్వర్లు ఇస్తే వెంటనే సినిమాలు నడిపిస్తాం. మాది సమ్మె కాదు, ఇండస్ట్రీలో మంచి పరిస్థితులు రావాలని కోరుకుంటున్నాం. అందరికీ న్యాయం జరగాలని కోరుతున్నాం. అగ్రిమెంట్లు కుదుర్చుకున్నారుగా అని అనొచ్చు. అప్పుడు కొందరు ఎగ్జిబిటర్లు చూసి చూడకుండా సంతకాలు చేశారు. ప్రొగ్రామింగ్ చేయడం వేరు, పరికరాలు అమర్చడం వేరు. చాలా మంది ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, స్టూడియో యాజమానులుగా ఇలా పలు పాత్రలు పోషిస్తున్నారు. కేవలం నిర్మాతగా ఉండేవాళ్ళు తక్కువ. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు కేవలం ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే చెల్లించాలి. వేరే ఫీజును వసూలు చేయకూడదని మేం ప్రధానంగా డిమాండ్ చేస్తున్నాం. బంద్ చేయడం వల్ల వచ్చే నష్టం కన్నా భవిష్యత్‌లో వచ్చే లాభం ఎక్కువ. ప్రస్తుతం తెలుగు సినిమా వరకు బంద్ ఉంటుంది. హిందీ, ఇంగ్లీష్ సినిమా వాళ్ళతో కూడా మాట్లాడతాం' అని అన్నారు. ఈ కార్యక్రమం జాక్ కన్వీనర్ పి.కిరణ్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి ముత్యాల రాందాసు, డిజిటల్ కమిటీ చైర్మెన్ దామోదర ప్రసాద్, సి.కళ్యాణ్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ నుంచి మురళీమోహన్, సునీల్ నారంగ్, ఆర్కే తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికి, తెలంగాణకు ఎన్జీటీ నోటీసులు


ఓపెన్‌కాస్ట్ మైనింగ్ కాలుష్యంపై విచారణ

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ఓపెన్‌కాస్ట్‌మైనింగ్ వల్ల తెలంగాణలోని భూపాలపల్లిలో జరుగుతున్న కాలుష్యంపై వివరణివ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి సంస్థకు, కేంద్రానికి జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) నోటీసులు జారీ చేసింది. ఓపెన్‌కాస్ట్‌మైనింగ్ వల్ల వాతావరణ కాలుష్యం జరుగుతోందని, ప్రజలు శ్వాసకోశ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని ఆ ప్రాంతానికి చెందిన రాజలింగమూర్తి అనే వ్యక్తి గతంలో ఎన్జీటీలో ఓ పిటిషన్ దాఖలు చేశారు. అయితే గతంలో పిటిషన్ విచారణకు స్వీకరించిన జస్టిస్ స్వతంత్రకుమార్ నేతృత్వంలోని ప్రధాన ధర్మాసనం.. ఏయే ప్రాంతాల్లో ఉల్లంఘనలు జరుగుతున్నాయి? పర్యావరణ అనుమతులు లభించాయా లేదా అని కొన్ని సందేహాలు లేవనెత్తింది. నిర్ధిష్టంగా వ్యాజ్యం దాఖలు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో భూపాలపల్లి ప్రాంతంలో జరుగుతున్న ఓపెన్‌కాస్ట్‌మైనింగ్‌పై మాత్రమే వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం జస్టిస్ జావేద్‌రహీం నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపున న్యాయవాది శ్రవణ్‌కుమార్ వాదించారు. ఓపెన్‌కాస్ట్‌మైనింగ్ వల్ల కాలుష్యం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నారని తెలియజేశారు. పైగా జనావాసాలకు దగ్గరగా తవ్వకాలు చేయడం వల్ల ప్రజల ఇండ్లు ధ్వంసమవుతున్నాయని, స్థానికంగా ఉండే చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పైగా వ్యవసాయ బోర్లన్నీ ఎండిపోతున్నాయని తెలిపారు. తవ్వకాల్లో పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, కేంద్ర పర్యావరణ, అటవీశాఖ కానీ ఇటు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కానీ, పర్యవేక్షణ చేయడం లేదని వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం సింగరేణి సంస్థకు, తెలంగాణ సీఎస్‌కు, కాలుష్యనియంత్రణ మండలికి, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు నోటీసులు జారీ చేసింది.







బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి నీటి విడుదల

నవతెలంగాణ-ముప్కాల్

బాబ్లీ ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీకి గురువారం ఉదయం నీరు విడుదల చేశారు. తెలంగాణ, మహారాష్ట్రల మధ్య కుదిరిన ఒప్పందం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఉదయం 10.46 నిమిషాలకు 0.048 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ రామారావు, డీఈ జగదీష్ తెలిపారు. బాబ్లీ ప్రాజెక్టు ద్వారా వస్తున్న నీటిని నిజామాబాద్ జిల్లాలో చిన్నతరహా సాగునీటి పథకలు, ఆయకట్టు రైతులకు అందిస్తామని తెలిపారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (90.31టీఎంసీ) కాగా, ప్రస్తుత నీటి నిల్వ 1067.10 అడుగులు (23.770టీఎంసీ) ఉంది. గతేడాది ఈ సమయానికి ప్రాజెక్టులో 1074.90 అడుగుల (39.471 టీఎంసీ) నీరు ఉంది. ప్రాజెక్టు ప్రధాన కాలువల్లోని కాకతీయ కాలువకు 6వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 150 క్యూసెక్కుల నీటి విడుదల యథావిధిగా కొనసాగుతోందని, గుత్ప, అలీసాగర్‌కు 315 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు చెప్పారు.

జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి..

పోచంపాడ్‌లోని జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్టు జెన్‌కో డీఈ శ్రీనివాస్ తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న ఆరు వేల క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని నాలుగు టర్బాయిన్ల ద్వారా 0.3372 మిలియన్ యూనిట్ల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నట్టు చెప్పారు.

రాజ్యసభ మూడో సీటు అమరుల కుటుంబాలకు ఇవ్వాలి

రేవంత్‌రెడ్డి డిమాండ్

- షాడో సీఎంగా సంతోష్ కోట్లు కొల్లగొడుతున్నారు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు రాజ్యసభ ఎన్నికల్లో తెలంగాణ అమరవీరుల కుటుంబాల్లో ఒకరిని రాజ్యసభకు పంపించాలని కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ సంఖ్యా బలం ప్రకారం రెండు రాజ్యసభ సీట్లు వస్తాయని, మూడోది ఫిరాయింపు ఎమ్మెల్యేలతో వచ్చేదేనని, ఆ సీటునైన అమరుల కుటుంబాలకు ఇవ్వాలని సూచించారు.

గురువారం సీఎల్పీ కార్యాలయంలో ఇష్టాగోష్టిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో షాడో ముఖ్యమంత్రిగా సంతోష్ కోట్లు కొల్లగొడుతున్నాడని, కేసీఆర్ అమరవీరుల కుటుంబాలకు అవకాశం ఇవ్వకపోతే కాంగ్రెస్ బరిలో దిగుతుందన్నారు. రాజ్యసభకు కేసీఆర్ తన సోదరుని కొడుకు సంతోష్‌ను పంపాలని చూస్తున్నారన్నారు. రాజ్యసభకు కుర్రకుంకను ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. సంతోష్‌కు ఉన్న అర్హత ఏంటి? కేసీఆర్‌కు సేవలు చేయడమే సంతోష్‌కు ఉన్న అర్హతనా? కేసీఆర్ తన కుటుంబసభ్యులకు పదవుల వీలునామా ఏమైనా రాయించుకున్నారా? సంతోష్‌కు రాజ్యసభ సీటు ఇవ్వడమంటే తెలంగాణ అమరవీరులను అవమానించడమేనన్నారు. నేరెళ్లలో దళితులపై దాడికి కారకుడని, ఇసుక మాఫియాకు యజమానే సంతోష్ అన్నారు.

సంతోష్ భూ ఆక్రమణలపై తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. తెలంగాణ ఉద్యమంతో ఆయనకు అసలు సంబంధమే లేదని, రాష్ట్రంలో కోట్ల రూపాయల దోపిడీ వెనక సంతోష్ హస్తం ఉందన్నారు. అమరవీరుల కుటుంబం నుంచి అభ్యర్థిని నిలబెడతామని, దీనిపై పార్టీలో మాట్లాడుతున్నామన్నారు. కాంగ్రెస్ నుంచి అమరవీరుల కుటుంబాల సభ్యుడిని పోటీలో నిలబెడతామన్నారు. కేసీఆర్ అమరవీరుల కుటుంబాలకు రాజ్యసభ ఇవ్వకపోతే...కేసీఆర్‌ను ప్రజల ముందు దోషిగా నిలబెడతామని ఆయన చెప్పారు.

అహంకారం పనికి రాదు

స్థాయికి మించి మాట్లాడారు

- కేటీఆర్‌పై జానారెడ్డి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



కేసీఆర్ తనయుడు, మంత్రి కేటీఆర్‌కు అహంకారం పెరిగిపోయిందని ప్రతిపక్ష నేత కె జానారెడ్డి అన్నారు. కేటీఆర్ సంస్కారంతో మాట్లాడుతున్నారని ఫైరయ్యారు. జానా బాబా అంటూ తనపై ఆయన స్థాయిని మర్చి మాట్లాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదు, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. గురువారం సీఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎస్ఏ సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ లాంటి వ్యక్తులపై కౌంటర్ ప్రెస్ మీట్ పెట్టడమంటే, నా స్థాయి తగ్గించుకున్నట్టే అవుతుందని, ఇది ప్రజలు, నా అభిమానులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేటీఆర్‌పై ప్రెస్‌మీట్ పెట్టడమంటే ఇదే చివరిదన్నారు. రాజకీయ ఫిరాయింపులను తాను గతంలోనే తీవ్రంగా వ్యతిరేకించానన్నారు. గతంలో తాను పార్టీ మారినప్పుడు తన పదవికి రాజీనామా చేశానన్నారు. తాను కూడా ఒక పార్టీ పెట్టి దాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేశానని, అప్పుడు కాంగ్రెస్ అధికారంలో కూడా లేదన్నారు. తెలంగాణలో టీడీపీకి మనుగడ లేదు కాబట్టి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చారని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇక టీఆర్ఎస్ పని అయిపోతుందని, ఆ పార్టీ ఉండదన్నారు. టీఆర్ఎస్ కనుమరుగు అవుతుందని రాజకీయాలు చేయాలనుకుంటే టీఆర్ఎస్ వాళ్ళు కాంగ్రెస్‌లోకే వస్తారన్నారు. లక్షా 70 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందేలా ఇరిగేషన్ ప్రాజెక్టులతో పనులు చేపట్టామన్నారు. టీఆర్ఎస్ ఏం చెప్పి అధికారంలోకి వచ్చిందో, అధికారంలోకి వచ్చాక ఏం చేసిందో చెప్పుకోవాలని సూచించారు. కేటీఆర్ అర్హతకు మించి స్థాయి మరిచిపోయి అలీబాబా అని మాట్లాడారని గుర్తు చేశారు. అధికార గర్వంతో హేళనగా, కుసంస్కారంగా, అర్థం పర్థం లేని సందర్భాలలో మాట్లాడితే మీ స్థాయి పెరుగుతుందనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఒక ముఠాను తయారు చేసుకుని ఊత పదాలతో ప్రజలను భ్రమింపజేస్తున్నారని, మంత్రి కేటీఆర్ మాటలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కేటీఆర్ లాంటి నాయకులకు వివరణ ఇవ్వడమనేది తన స్థాయి కాదనుకున్నా...అయినా తాను మాట్లాడాల్సి వస్తుందన్నారు. నల్గొండలో ఫ్లోరైడ్ విషయాలన్నీ గుర్తించి పరిష్కారం కోసం ముందు తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. టీఆర్ఎస్ పుట్టకముందే ఫ్లోరైడ్‌పైన పరిశోధనలు చేయించామని, ఫ్లోరైడ్ ప్రాంతాల్లో మంచినీటి కోసం రూ 200 కోట్ల నిధులతో అన్ని గ్రామాలకు మంచినీరు అందేలా కృషి చేశామన్నారు. 66 గ్రామాలకు మంచినీటి సరఫరా పథకాన్ని బుధవారం మంత్రి కేటీఆర్ ప్రారంభం చేసిన ఆ పథకాన్ని తానే శంకుస్థాపన చేసి వంద కోట్ల రూపాయలు కేటాయించానన్నారు. ఇప్పుడు కేటీఆర్ ఆ పనులను ప్రారంభించి, కాంగ్రెస్ ఏం చేసిందనడం సరైందికాదన్నారు. పాలేరు కట్ట మీద వేసిన శిలాఫలకంలో తన పేరుంటది కావాలంటే చూసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో సిరిసిల్ల, సిద్ధిపేట, ఎల్లారెడ్డి, ముధోల్‌లలో కూడా నిధులను తాను మంజూరు చేశానన్నారు. తప్పు చేసిన వాళ్లకు ప్రజలే బుద్ధిచెబుతారని ఇందిరమ్మ ఇండ్లలో అవకతవకలు జరిగాయంటున్నారని, అలాంటి వారిని గుర్తించి శిక్షించాలని సూచించారు. టీఆర్ఎస్ రాష్ట్రంలో ఇచ్చిన గొర్రెల్లో సగం గొర్రెలయిన ఉన్నాయా? గొర్రెల అవకతవకలకు టీఆర్ఎస్ వాళ్ళు ఏమైనా చేశారా? అని అడగాల్సి వచ్చిందన్నారు. కులం పేరు చెప్పి ఓట్లు దండుకునే అవకాశముందని, తెలంగాణ ఆత్మాభిమానంపై దెబ్బ కొట్టే టీఆర్ఎస్‌ను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. నాలుగేండ్లు కాకముందే సుమారు 2లక్షల 20వేలకోట్లు అప్పు చేశారని, ఇవన్నీ రానున్న ఎన్నికలలో ప్రజలు గుర్తించి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

ఏబీవీపీ నేతకు మోకరిల్లి...



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

అనుకున్నదే జరిగింది...అందరూ ఊహించిందే నిజమైంది...ప్రొఫెసర్ లక్ష్మీనారాయణపై సోషల్‌మీడియా వేదికగా బూతులు తిట్టిన ఏబీవీపీ జాతీయ నేతపై విధించిన శిక్షను హెచ్‌సీయూ అధికారులు తగ్గించారు. వేసిన జరిమానాను రద్దు చేశారు. ఏబీవీపీ నేతపై ఫిర్యాదు చేసిన ప్రొఫెసర్ బోధిస్తున్న సబ్జెక్టుపై విచారణ కోసం ఓ కమిటీని వేయాలని నిర్ణయించటం గమనార్హం. ఫిబ్రవరి నెలాఖరులో జరిగిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పాలకమండలి (ఈసీ)లో తీసుకున్న ఆలస్యంగా బయటికొచ్చాయి. ఈసీ నిర్ణయంపై వర్సిటీ విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి.

హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణను 'బాస్టర్డ్...' అంటూ సంబోధిస్తూ ఏబీవీపీ సెంట్రల్ యూనివర్సిటీల జాతీయ కోఆర్డినేటర్ కలురాం పల్సానియాపై ప్రొక్టోరల్ బోర్డు గతంలో చర్యలు తీసుకున్నది. పల్సానియాను ఏడాది పాటు సస్పెండ్ చేయడంతో పాటు రూ.30వేల జరిమానా విధించింది. అన్ని ఆదారాలున్నా, పల్సానియాపై తక్కువ కాలం శిక్ష వేయడంపై విద్యార్థులు, ప్రొఫెసర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఏబీవీపీ నేత పల్సానియా గతేడాది నవంబర్ 25న ఫెస్‌బుక్‌లో బూతులతో కూడిన పోస్టింగ్ పెడితే, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ నవంబర్ 30న వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు నెలల పాలయాపన చేసిన వర్సిటీ ఉన్నతాధికారులు ఫిబ్రవరి 1న ఆ విద్యార్థి నేతపై చర్యలు తీసుకున్నట్టు అధికారికంగా ప్రకటించారు. అయితే నెలరోజుల్లోనే వర్సిటీ పాలక మండలి శిక్షను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 12నెలల(ఏడాది) పాటు వేసిన సస్పెన్షన్ వేటును 12 వారాలకు తగ్గించారు. జరిమానాగా వేసిన రూ.30వేలను మాఫీ చేశారు. దీనికితోడు రెండు సెమిస్టార్ల కాలం పాటు హాస్టల్ వసతిని రద్దు చేశారు. భవిష్యత్‌లో ఎలాంటి దూషణలకు దిగబోననే అంగీకారపత్రాన్ని తీసుకోవాలని నిర్ణయించారు. అయితే బూతులు తిట్టాడని ఫిర్యాదు చేసిన ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ బోధిస్తున్న 'ఎకనామిక్స్ ఆఫ్ ఎడ్యుకేషన్' సబ్జెక్టు పేపర్‌పై ప్రత్యేకంగా ఓ కమిటీతో విచారణ చేయించాలని ఈసీ నిర్ణయించింది. ఈనిర్ణయాన్ని ప్రొఫెసర్లు తప్పుబడుతున్నారు. ప్రత్యేకంగా ఎకనామిక్స్ విభాగం ఉన్నప్పుడు, వారితో కాకుండా సంబంధం లేనివారితో విచారణ చేయిస్తే, ప్రొఫెసర్‌కు వ్యతిరేకంగా నివేదిక ఇచ్చే అవకాశమూ లేకపోలేదని చెబుతున్నారు.

'కేంద్రం' ఒత్తిడే కారణమా..?

హెచ్‌సీయూలో డ్యూటీలో ఉన్న వార్డెన్లను తిట్టారనే సాకుతో రెండేండ్ల పాటు ఇద్దరు విద్యార్థులను వర్సిటీ అధికారులు సస్పెండ్ చేశారు. మరికొందరు విద్యార్థులపైనా చర్యలు తీసుకున్నారు. ఇక్కడ తిట్టినట్టుగా ఎలాంటి ఆధారాలు లేవు. కానీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణను బూతులు తిట్టినట్టు స్పష్టమైన ఆధారాలున్నాయి. అయినా ప్రొక్టోరల్‌బోర్డు వేసిన 12నెలల శిక్షను పాలకమండలి 12 వారాలకు కుదించి, జరిమానానూ రద్దు చేసింది. దీనికి కేంద్రం నుంచి వర్సిటీ అధికారులపై తీవ్ర ఒత్తిడి వచ్చినట్టు తెలుస్తోంది. ప్రొఫెసర్‌ను దూషించిన విద్యార్థి అధికార బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘమైన ఏబీవీపీ జాతీయ నేతగా ఉండటమే దీనికి కారణమని సమాచారం. శిక్షను తగ్గించాలని రాష్ట్ర నేతలూ వీసీపై ఒత్తిడి తీసుకువచ్చారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. దీంతోనే నామమాత్రపు శిక్ష వేసినట్టు తెలుస్తోంది.

హెల్ప్‌డెస్కుల అనుమతి నిరాకరణ

విద్యాసంవత్సరం ప్రారంభ సమయంలో నూతన విద్యార్థులకు సహాయార్థం విద్యార్థిసంఘాలు ఏర్పాటు చేసే హెల్ప్‌డెస్క్‌లనూ ఏర్పాటు చేయవద్దని పాలకమండలి నిర్ణయించింది. ప్రొక్టోరల్‌బోర్డు సూచనల మేరకే నిర్ణయం తీసుకున్నట్టు ఈసీ ప్రకటించింది. ప్రశాంతంగా కౌన్సెలింగ్ నిర్వహించేందుకు గానూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నది. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ భవనం వద్దకు కేవలం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, వారి సంరక్షకులను మాత్రమే అనుమతించాలని నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయంపై విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. ఇది విద్యార్థి సంఘాల హక్కులను హరించడమేనని వాదిస్తున్నాయి.



పార్టీని నమ్ముకున్న ఏ నాయకుడిని వదులుకోం

రెండోరోజు భేటీలో చంద్రబాబు

- ప్రతాపరెడ్డికి అండగా ఉంటామని హామీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డికి పార్టీ అండగా ఉంటుందని, పార్టీని నమ్ముకున్న ఏ నాయకుడిని వదులుకోబోమని తెలుగుదేశం అధినేత, ఏపీ సీఎం ఎన్ చంద్రబాబునాయుడు చెప్పారు. పల్లెపల్లెకు తెలుగుదేశం పార్టీని ప్రతిష్టాత్మకంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పదవులు అనుభవించిన నేతలు పార్టీ నష్టం చేసేలా మాట్లాడడం తగదంటూ పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులును ఉద్దేశించి ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. టీటీడీపీ నేతలతో గురువారం చంద్రబాబు రెండోసారి సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులతో ఆయా అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలపై మరోసారి సమీక్ష చేస్తానని చెప్పారు. లక్ష మందితో తెలంగాణలో మహానాడు నిర్వహిస్తామని పార్టీ అధినేతకు రాష్ట్ర నాయకులు వివరించారు. మహానాడులోగా మూడు ప్రాంతాల్లో సభలు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించామని టీటీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అంతేకాకుండా రాజకీయ పరిస్థితులు, కేంద్రం వైఖరి, ప్రజా సమస్యలపై చర్చించామని, మార్చి 29 వరకు పల్లె పల్లెకు తెలుగుదేశం కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వివరించారు. మే 28 వరకు కార్యక్రమాలను రూపొందించి ప్రజల్లోకి వెళ్లాలని , అసంపూర్తిగా ఉన్న కమిటీల నియామకాలను పూర్తిచేయాలని బాబు సూచించారు. బీజేపీ వాళ్ళే పొత్తు ఉండదని ముందుగా చెప్పారని మరోసారి బాబు ప్రస్తావించారు.

పార్టీకి ఉన్న ఓటింగ్ శాతాన్ని చర్చించుకుని సమయం, సందర్భం చూసి పొత్తుల గురించి ఆలోచిద్దామని వివరించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నామా నాగేశ్వర్‌రావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఎంపీ గరికపాటి మోహన్‌రావు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.పెద్దిరెడ్డి, జాతీయ క్రమశిక్షణా సంఘం సభ్యులు బక్కని నర్సింహులు, అధికార ప్రతినిధి అరవింద్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జి.బుచ్చిలింగం పాల్గొన్నారు. ఇదిలావుండగా నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బరాయుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డిని పరామర్శించారు.



కొప్పులను పరామర్శిస్తున్న చంద్రబాబు

నువ్వు ఏ దిక్కుకు తిరిగినా సరే దారికడ్డంగా
నిలబడే పెనుభూతం కుల వ్యవస్థ. - డా॥ అంబేద్కర్

సంపాదకీయం

భారత్-ఇరాన్ బంధం

ఇరాన్ అధ్యక్షుడు హసన్ రోహాని భారత్‌లో జరిపిన మూడు రోజుల పర్యటన చిరకాల మిత్రులైన ఈ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక, ఆర్థిక, వాణిజ్య సహకార సంబంధాల పటిష్టతకు కొత్త ఊపిరులూదింది.

రోహానీ, మోడీ భేటీ అయిన రోజే అమెరికా జాతీయ భద్రతా సలహాదారు హెచ్ ఆర్ మెక్ మాస్టర్ ఒక ప్రకటన చేస్తూ ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టే దేశాలు ఉగ్రవాదానికి, మధ్యప్రాచ్యంలో హత్యాకాండకు పరోక్షంగా సహకరించినట్టే అవుతుందని బెదిరించాడు. ఇటువంటి బెదిరింపులకు లొంగరాదు. భారత్ ఇరాన్ సంబంధాలు, వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాలకూ ప్రయోజనకరమైనవి, ఇందులో ఇతర దేశాల జోక్యాన్ని తిప్పికొట్టాలి.

ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఇరు దేశాల అధినేతలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటన చూసినా, వివిధ అంశాలపై కుదుర్చుకున్న డజనుకు పైగా ఒప్పందాలు, ఎంఓయూలను చూసినా ఇదే విషయం స్పష్టమవుతుంది. మధ్య ఆసియా, తూర్పు యూరపు, అఫ్ఘనిస్థాన్‌తో ఈ ఉపఖండ మార్కెట్‌ను కలిపే కీలకమైన చబహార్ - జెహెదాన్ రైలుమార్గం ఏర్పాటు, భారతీయ కంపెనీకి చబహార్ షాహిద్ బెహెస్తి రేవు నిర్వహణ కాంట్రాక్టు అప్పగింత, ద్వంద్వ పన్నుల రద్దు, ఇరాన్ నుంచి చేసుకునే చమురు దిగుమతులకు రూపాయల్లో చెల్లించే సదుపాయం కల్పించడం వంటివి వీటిలో అతి ముఖ్యమైనవి. చమురు దిగుమతులకు రూపాయల్లో చెల్లించే సౌకర్యం ఇంతవరకు నేపాల్, బంగ్లాదేశ్‌లకు మాత్రమే ఇరాన్ కల్పించింది. దీనిని ఇప్పుడు భారత్‌కు కూడా వర్తింపజేయాలని నిర్ణయించడం మంచి విషయం.



ఇరాన్ నుంచి ఏటా కోటి టన్నులకు పైగా ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న మన దేశానికి రూపాయల్లో చెల్లించే సదుపాయం కల్పించడం వల్ల ఇంధన భద్రతతోబాటు, విదేశీ మారకద్రవ్యం పెద్దమొత్తంలో ఆదా అవుతుంది. 2008లో అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు ఇరాన్‌తో గ్యాస్ పైపులైన్ ప్రాజెక్టునుంచి భారత్ వైదొలగాలని అగ్రరాజ్యం షరతు విధించింది. ఆ షరతుకు తలొగ్గిన అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం గ్యాస్ పైపులైన్ ప్రాజెక్టును అటకెక్కించగా, ప్రస్తుత నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికాకు మరింత మోకరిల్లి ప్రాజెక్టును పూర్తిగా చంపేసింది. దానికి బదులు టర్క్‌మానిస్థాన్ - అఫ్ఘనిస్థాన్ - పాకిస్థాన్ - భారత్ పైపులైను ప్రాజెక్టును ముందుకు తెచ్చింది. దాంతో ఇరాన్-పాకిస్థాన్‌ల మధ్య గ్యాస్ పైపులైను నిర్మాణం పూర్తయి పాక్‌కు ఇరాన్ గ్యాస్ సరఫరా చేస్తోంది. అయితే ఇప్పుడు పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్‌ల ద్వారా గ్యాస్ పైపులైన్ల వల్ల భద్రతాపరమైన సమస్యలున్నాయని భారత ప్రభుత్వం చెబుతోంది. అందువల్ల ఇరాన్ నుండి సముద్రంలో పైపులైను వేసి నేరుగా భారత్‌కు గ్యాస్ తెచ్చుకోవాలని ప్రయత్నిస్తోంది.

ఇరాన్ - అఫ్ఘన్ సరిహద్దుల మీదుగా సాగే చబహార్ - జెహదాన్ రైలు మార్గం నిర్మాణానికి రెండు దేశాలు అంగీకరించాయి. ఇది పూర్తయితే ఈ ఉపఖండానికి అఫ్ఘనిస్థాన్, మధ్య ఆసియా, తూర్పు యూరపు దేశాలకు వాణిజ్య వారధిగా భారత్ నిలుస్తుంది. దీనివల్ల భారత్ - ఇరాన్ మధ్య ప్రస్తుతం జరుగుతున్న 1300 కోట్ల డాలర్ల వాణిజ్యం రెట్టింపయ్యే అవకాశముంది. వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు, ఆరోగ్యం, మందులు, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని ఇరుదేశాలు సంకల్పించడం ఆహ్వానించదగిన పరిణామం. నూట ఇరవై కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్‌కు ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న డిమాండ్‌కు రోహానీ మద్దతు పలికారు. ఇలా అన్ని రంగాల్లోను ఆయన భారత్‌కు స్నేహ హస్తం అందించారు.

మధ్య ఆసియాలో చమురు నిల్వలపై పట్టు కోసం అమెరికా సాగిస్తున్న కుట్రలను ఇరాన్ ఒక వైపు దీటుగా ఎదుర్కొంటూ మరో వైపు ఈ ప్రాంతంలోని భారత్ వంటి దేశాలకు స్నేహ హస్తం చాచడం ఇరాన్ దౌత్య పరిణతిని తెలియజేస్తున్నది. సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోయాలని చూసిన అగ్ర రాజ్య కుట్రలను రష్యా, టర్కీతో కలిసి సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఆ పరాభవాన్ని జీర్ణించుకోలేని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై ఒంటికాలితో లేస్తున్నాడు. 2015లో కుదుర్చుకున్న ఇరాన్ అణు ఒప్పందాన్ని రద్దు చేస్తానని హుంకరించాడు. అది సాధ్యం కాకపోవడంతో, ఆ ఒప్పందాన్ని తిరగదోడాలంటూ నానా యాగీ చేస్తున్నాడు. ఒప్పందంలో భాగస్వాములుగా ఇతర సభ్య దేశాలపై ఒత్తిడి తెచ్చాడు. ఒప్పందాన్ని తిరగదోడే ప్రశ్నే లేదని చైనా, రష్యా కరాఖండీగా తేల్చి చెప్పాయి. యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా ట్రంప్‌ను వెనకేసుకురావడానికి నిరాకరించాయి. ఈ పరిస్థితుల్లో ఇరాన్‌కు భారత్ అండగా నిలవాల్సిన అవసరముంది. అమెరికాతో వ్యూహాత్మక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నప్పటి నుంచి మోడీ ప్రభుత్వం అగ్రరాజ్యం అడుగులకు మడుగులొత్తుతున్నది. దీనిలో భాగంగానే ఇజ్రాయిల్‌తో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకున్నది. రోహానీ, మోడీ భేటీ అయిన రోజే అమెరికా జాతీయ భద్రతా సలహాదారు హెచ్ ఆర్ మెక్ మాస్టర్ ఒక ప్రకటన చేస్తూ ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టే దేశాలు ఉగ్రవాదానికి, మధ్యప్రాచ్యంలో హత్యాకాండకు పరోక్షంగా సహకరించినట్టే అవుతుందని బెదిరించాడు. ఇటువంటి బెదిరింపులకు లొంగరాదు. భారత్ ఇరాన్ సంబంధాలు, వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాలకూ ప్రయోజనకరమైనవి, ఇందులో ఇతర దేశాల జోక్యాన్ని తిప్పికొట్టాలి.

సహజ మేధాశక్తిని మంత్రకళగా భావించారు



డాక్టర్ దేవరాజు మహారాజు

అభూత కల్పనలకు అలవాటు పడ్డ జనం వాస్తవాల్ని వాస్తవాలుగా స్వీకరించరు. సహజత్వాన్ని సహజత్వంగా అంగీకరించరు. అందులో కూడా వారికేవో అనుమానాలు, భయాలు తలెత్తుతూ ఉంటాయి. మంత్రాలేస్తారనో, చేతబడి చేస్తారనో కొందరిని కొట్టి చంపడం అప్పుడప్పుడు చూస్తుంటాం. మంత్రాలకు చింతకాయలు రాలవని తెలిసి కూడా మంత్ర కళలున్నాయంటే జనం భయపడుతున్నారు. ఈ పరిస్థితి మారాలి. ఇది ఇప్పటి పరిస్థితే కాదు. వందల యేండ్ల నుండి ఈ ధోరణి సమాజంలో ఉంది. ఉదాహరణకు ఖగోళ సిద్ధాంత కర్త, గణిత శాస్త్రజ్ఞుడు అయిన గియార్డనో బ్రూనో (1548-1600) విషయం చూద్దాం. ఆయన బుద్ధి కుశలతని, మేధాశక్తిని మత

ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టు, ఒక క్రైస్తవ సన్యాసే క్రైస్తవం మీద ధ్వజమెత్తాడు. మతమౌఢ్యం, తనను సజీవంగా అగ్నికి అర్పించబోతోందని తెలిసి కూడా, బ్రూనో దాసోహమనలేదు. రాజీ పడలేదు. నిర్భయంగా ఎదుర్కొని అమరుడయ్యాడు. సైన్సుతో పాటు సైన్సు చరిత్ర కూడా తెలుసుకోవడం అవసరం. వ్యక్తిత్వ వికాసానికి అది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రచారాలతో మహానుభావులవుతున్న వారు ఆత్మ విమర్శ చేసుకోవడం మంచిది.

ఛాందస వాదులు భరించలేక పోయారు. ఆయనలో సైతాను ప్రవేశించిందని రక్తం చిమ్మకుండా సజీవంగా నిప్పంటించి కాల్చారు.

బ్రూనో తండ్రి జియోవన్ని బ్రూనో ఒక సైనికుడు. ఆయన తన కొడుకును విద్యాభ్యాసం కోసం నాప్లస్‌కు పంపాడు. అక్కడ అగస్టియన్ మొనస్ట్రీ (సన్యాసుల ఆశ్రమం)లో ఉంటూ బ్రూనో ప్రయివేటుగా విద్యనభ్యసించేవాడు. అక్కడికి దగ్గరలో ఉన్న స్టేడియంలో అప్పుడప్పుడు సాగే ఉపన్యాస కార్యక్రమాలకు వెళుతుండేవాడు. మొనస్ట్రీలో ఈయనకు గీయార్డనో క్రిస్‌పో అనే ట్యూటర్ మెటాఫిజిక్స్ బోధిస్తుండేవాడు. ఆ ట్యూటర్ ప్రభావంలో బ్రూనో ఎంతగా పడిపోయాడంటే, తన పేరులోని 'ఫిలిప్పో'ను వదిలేసి 'గియార్డనో' పేరు తగిలించుకున్నాడు. అక్కడ పదిహేడో యేట మొనస్ట్రీలో డొమినికన్ ఆర్డర్‌లో ప్రవేశించాడు. అంటే ప్రభు విశ్వాసకుల్లో ఒకడిగా గుర్తింపు వచ్చిందన్నమాట. శిక్షణ పూర్తి చేసుకుని 1572 నాటికి అంటే తన ఇరవై నాలుగవ యేట మత బోధకుడి (ప్రీస్ట్)గా అయ్యాడు. అప్పటికే అతని అమోఘమైన జ్ఞాపకశక్తి, గణితం మీద పట్టు అందరూ గుర్తించసాగారు. ఓ సారి రోమ్ నగరానికి వెళ్లి ఐదో పోప్ పయస్, అలాగే కార్డినల్‌రిచిబాల ముందు తన ప్రజ్ఞ పాటవాల్ని ప్రదర్శించి వచ్చాడు. 'ఆన్ ద ఆర్ట్ ఆఫ్ నోహ్' అనే తన సూత్రీకరణల్ని మత పెద్దలు అంగీకరించారని చెప్పుకున్నాడు. 1576-1592 మధ్య కాలంలో పుస్తకాలు రాస్తూ, కొంత కొంత కాలం ఉపన్యాసకుడిగా పని చేస్తూ దేశ విదేశాల్లో విస్తృతంగా పర్యటించాడు. బ్రూనో ఖగోళ సిద్ధాంత కర్త మాత్రమే కాక, కవి, తత్వవేత్త కూడా. కాబట్టి అనేకానేక విభిన్నమైన రచనలు చేశాడు. వెన్నిస్‌లో ఉన్నప్పుడు 'కాలపు చిహ్నాలు' ప్రచురించాడు. యూనివర్సిటీ ఆఫ్ జేనీవాలో కొంత కాలం, ఫ్రాన్స్‌లోని పారిస్‌లో కొంత కాలం గడిపాడు. ఫ్రాన్స్ లయాన్‌లో ఉన్నప్పుడు డాక్టరేట్ తీసుకున్నాడు. ఆయన ఉపన్యాసాలకు ఆకర్షితులైన విద్యార్థులు ఆయనే తమకు అధ్యాపకుడిగా కావాలన్నారు. పారిస్‌లో ఓ ముప్పయి ఉపన్యాసాలిచ్చాడు. వాటి వల్ల గొప్ప కీర్తి గడించాడు. ఆయన ఉపన్యాసాలన్నీ క్రైస్తవానికి వ్యతిరేకంగా ఉండడం వల్ల, ఆయన వృత్తిరీత్యా మత బోధకుడన్న విషయం మరుగున పడింది.

బ్రూనో పేరు ప్రఖ్యాతలు గూర్చి తెలుసుకున్న రాజు మూడవ హెన్రీ ఒకసారి బ్రూనోను పిలిపించుకుని 'నీ తెలివి తేటలు సహజమైనవా లేక ఏవైనా మంత్ర కళల వల్ల అబ్బినవా' అని ప్రశ్నించాడు. అందుకు బ్రూనో తనకు మంత్ర కళలేవీ తెలియవని, తనది సహజమైన మేధస్సేనని విన్నవించుకున్నాడు. అంతే కాదు 'ఆలోచన ఛాయలు' (1582) పేరుతో పుస్తకం రాసి ఆయనకు అంకితమిచ్చాడు. రాజు మూడవ హెన్రీ సంతోషించి వెంటనే ఉపన్యాసకుడిగా నియమించి మంచి జీతం ఏర్పాటు చేశాడు. వైజ్ఞానికుడు, తత్వవేత్త, కవి అయిన బ్రూనో ఉపన్యాసకుడిగానే కాదు, రచయితగా కూడా సుప్రసిద్ధుడయ్యాడు. ఆ కాలంలోనే 'జ్ఞాపక కళ' (1582) 'వృత్తిగీతం' (1582) వంటి సాహిత్య గ్రంథాలు ప్రకటించాడు. ముఖ్యంగా అవి అనుభవాలకు, జ్ఞాపకాలకు సంబంధించినవి. అదే సంవత్సరం ప్రకటించిన 'దివిటి ధారుడు' హాస్యరస ప్రధానమైన తాత్విక గ్రంథం. ఆ మరుసటి సంవత్సరం రాజు మూడవ హెన్రీ సిఫారసుతో బ్రూనో ఇంగ్లాండ్ చేరాడు. అక్కడ కవులు ఫిలిఫ్ సిడ్నీ, జాన్ డి వంటి వారి స్నేహం లభించింది. ఆక్స్‌ఫర్డ్‌లో ఉపన్యసించే అవకాశమూ లభించింది. అక్కడ ఒక సంవత్సర కాలంలోనే నాలుగు పుస్తకాలు ప్రచురించగలిగాడు. అంటే ఆయన మేధో సంపద, రచనా కౌశలం ఎంత గొప్పదో బేరీజు వేసుకోవచ్చు. 'ఇటాలిన్ డైలాగ్స్' కారణం 'సూత్రీకరణల ఐక్యత' 'అనంత విశ్వం' ప్రపంచాలు - వంటివన్నీ వెంట వెంట ప్రచురించాడు. అయితే అయితే ద ఏష్‌వెన్స్‌డే సప్పర్ మాత్రం చాలా వివాదాస్పదమైంది. విషయం కుండబద్దలు కొట్టినట్టు చెప్పడం వల్ల కొందరు మిత్రులు నొచ్చుకుని ఆయనకు దూరమయ్యారు.

కాథలిక్ కుట్ర దారుల కుట్రల్ని - క్వీన్ ఎలిజబెత్ సెక్రటరీకి 'హెన్రీ షాగెట్' అనే మారు పేరుతో చేరవేస్తుండేవాడు. అక్టోబర్ 1585లో లండన్‌లోని ఫ్రెంచ్ రాయబార కార్యాలయంపై కొందరు దాడి చేశారు. అందులోనే ఉన్న బ్రూనో, ఇక అక్కడ ఉండడం క్షేమకరం కాదని, ఉద్రిక్తమైన రాజకీయ పరిణామాల వల్ల పారిస్‌కు వెళ్లి పోయారు. తర్వాత జర్మనీకి చేరుకున్నాడు. జర్మనీలో అనుకున్నంతగా మంచి బోధనావకాశాలు రాలేదు గాని విట్టెన్‌బర్గ్‌లో చిన్న అవకాశం లభించింది. అక్కడ రెండేండ్లు అరిస్టాటిల్ కృషి గురించి బోధించాడు. ప్రాగ్‌లోనూ, ఫ్రాంక్ ఫర్ట్‌లోనూ గడిపాడు. ఆ కాలంలో లాటిన్ పుస్తకాలు వెలువరించాడు. అయితే బ్రూనో నేరుగా లాటిన్‌లో రాయలేదు. ఆయన చెబుతుండగా బిసిలర్ అనే అతను లాటిన్‌లోకి అనువదిస్తూ రాసేవాడు.

అలా బ్రూనో ఏ దేశంలోనో ఉండిపోతే బావుండేది. తిరిగి మళ్లీ ఇటలీకి వెళ్లడం పెద్ద పొరపాటు అయిపోయింది. మతం మత్తులో జోగుతున్న అక్కడి వారికి బ్రూనో అభిప్రాయాలు నచ్చేవి కావు. పాడువాలో కొన్ని నెలల బోధన తర్వాత, వెన్నిస్‌లో హౌజ్ ట్యూటర్‌గా చేరాడు. అక్కడ దాని నిర్వాహకుడు బ్రూనో దైవ వ్యతిరేకి అని గ్రహించి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దైవ దూషణ కారణం



కింద వారు 22 మే 1592న బ్రూనోను అరెస్టు చేసి రోమ్‌కు పంపారు. అప్పటి నుండి రోమ్‌లో మత న్యాయ స్థాన అధికారుల ఆగడాలు ప్రారంభమయ్యాయి. సహజమైన మేధాశక్తికి మంత్ర కళల వల్ల వచ్చిందని అనుమాన పడడం, ఆయన చెప్పే వైజ్ఞానిక అంశాల గూర్చి ఆలోచించకుండా, ఆయనలో సైతాను ప్రవేశించిందని - ఆ సైతానే క్రైస్తవ మతానికి వ్యతిరేకండా మాట్లాడుతూ ఉందని భావించడం ఎంతో విచారించాల్సిన విషయం. ఆ విధంగా ఆయనను సజీవంగా దహనం చేయడం మత కిరాతకుల దారుణ చర్య! వైజ్ఞానిక మేధస్సు ముందు మతం తల దించుకోవాల్సిన పరిస్థితి. వందల యేండ్లు గడిచినా ఇప్పటికీ మతాలు అదే మూర్ఖత్వంతో వ్యవహరిస్తున్నాయి. పునరుద్ధరణ ప్రసక్తే లేదు.

'మానవుల జంతువుల ఊపిరితిత్తుల్లో, ధమనుల్లో ఎలాగైతే గాలి ఒక అంతర్భాగమో...ఈ భూమిపై వీస్తున్న గాలులు, పైన కదులుతున్న మేఘాలు కూడా భూమి అంతర్భాగాలే. నదులు, రాళ్లు, కొండలు, సముద్రాలు అన్నీ ఈ భూభాగానివే - ఈ నదులు, సముద్రాలు భూమి నీటితో నింపిపెట్టుకున్న పాత్రలు' అని కవితాత్మకంగా, రాసుకున్నాడు బ్రూనో. బ్రూనో బోధనలలో, రచనలలో 'పాడిజం' ప్రధానంగా ఉందని భౌతిక శాస్త్రవేత్త, తత్వవేత్త వెయన్ స్టెయన్ అన్నాడు. దేవుడే విశ్వంగా మారిపోయాడన్న భావనను, ఒక సిద్ధాంతంగా పాన్ - డిజం అని అంటారు. అయితే ఈయన అభిప్రాయాన్ని ఎవరూ బలపర్చలేదు.

బ్రూనో వ్యక్తిత్వ ప్రభావం, ఆయన వైజ్ఞానిక సిద్ధాంతాల ప్రభావం కవులు, రచయితలు, కళాకారులపై విపరీతంగా పడింది. ఆయన సమకాలికులు, ఆయన తర్వాతి తరం వారూ ఆయన త్యాగాన్ని గొప్పదనాన్ని అక్షర బద్ధం చేస్తూ వచ్చారు. బ్రూనో సజీవ దహనాన్ని నిరసిస్తూ - స్విన్ బర్న్‌క్రిస్‌లా మిలోజ్, మాక్‌హ్యూగ్ మొదలైన కవులంతా గాఢమైన కవిత్వం రాసి ప్రపంచ పాఠకులకు అందించారు. జేమ్స్ జాయ్, బెర్తోల్డ్‌బ్రెఫ్ట్, ఎస్.జె.పారిస్, మెర్రిస్ వెస్ట్ మొదలైన వారి రచనల్లో బ్రూనో స్ఫూర్తి కనిపిస్తుంది. 'కాస్‌మొస్' ఎ స్పేస్ టైం ఒడిస్సీ (2014) అనే టెలివిజన్ సీరియల్‌లో బ్రూనో పాత్ర చిత్రితమై ఉంది. అలాగే సినిమాలు కూడా వచ్చాయి. బ్రూనో ప్రతిపాదించిన ఖగోళ సిద్ధాంతాలు వృథా కాలేదు. ఆయన ఏ సత్య స్థాపన కోసం త్యాగం చేశాడో ఆ త్యాగాన్ని ప్రపంచ మానవాళి తమ గుండెల్లో భద్ర పరుచుకుంది.

బ్రూనో మరణం తర్వాత 270 సంవత్సరాలకు ఇటలీలో పరిస్థితులు పూర్తిగా మారి పోయాయి. క్రైస్తవ మతాధికారులు పెత్తనం చాలా వరకు అంతరించింది. కొత్త ఇటలీ రాజ్యం ఏర్పడింది. బ్రూనో ఎక్కడ సజీవంగా దహనం చేయబడ్డాడో అక్కడే - కాంపో డి ఫియోరి- కూడలిలో 1889లో రోమ్ మున్సిపాలిటీ బ్రూనో నిలువెత్తు విగ్రహం ప్రతిష్టాపించింది. ఆ తర్వాత మళ్లీ 119 సంవత్సరాలకు అంటే 2008లో బెర్లిన్‌లోని పాట్స్ డామర్ ప్లాట్స్ స్టేషన్లో తలకిందులుగా కాలి పోయిన బ్రూనో విగ్రహం ప్రతిష్టించారు. తరువాత తరం ఖగోళ శాస్త్రవేత్తలు కూడా ఆయనను గౌరవించుకున్నారు. అంతరిక్షంలో చంద్రునికి ఇరవై రెండు కి.మీ. దూరంలో ఉన్న ఒక ఖగోళ పదార్థాన్ని (ఇంపాక్ట్ క్రాటర్) కి 'గియార్డనో బ్రూనో' గా నామకరణం చేశారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఒక రేడియో ప్రసార కేంద్రానికి ఆయన జ్ఞాపకార్థం కాల్ సిగ్నల్‌కు 2 జీబీ అనే పేరు పెట్టుకున్నారు. జి.బి అనేవి బ్రూనో పేరుకు సంక్షిప్తం. 1995లో బ్రూనో స్మారక అవార్డు స్థాపించబడింది. 2004లో ఆయన పేరు మీద ఫౌండేషన్ ఏర్పాటయింది.

ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టు, ఒక క్రైస్తవ సన్యాసే క్రైస్తవం మీద ధ్వజమెత్తాడు. మతమౌఢ్యం, తనను సజీవంగా అగ్నికి అర్పించబోతోందని తెలిసి కూడా, బ్రూనో దాసోహమనలేదు. రాజీ పడలేదు. నిర్భయంగా ఎదుర్కొని అమరుడయ్యాడు. సైన్సుతో పాటు సైన్సు చరిత్ర కూడా తెలుసుకోవడం అవసరం. వ్యక్తిత్వ వికాసానికి అది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రచారాలతో మహానుభావులవుతున్న వారు ఆత్మ విమర్శ చేసుకోవడం మంచిది.

సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్
సెల్: 9573706806

మెయిల్ @ నవతెలంగాణ

గాయత్రి మంత్రంతో చదువొస్తదా?



ఎన్ నారాయణ

ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం ప్రార్థనా సమయంలో గాయత్రి మంత్రాన్ని జపించాలని హర్యానా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రాష్ట్రంలో 2014లో అధికారంలోకి వచ్చిన మనోహర్‌లాల్ ఖట్టర్ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయమయం చేసే చర్యల్లో భాగంగా ఫిబ్రవరి 24న ఈ నిర్ణయం చేసింది. పాఠశాల పాఠ్యపుస్తకాల్లో భగవద్గీత శ్లోకాలను చేర్చాలని 2015లో చేసిన నిర్ణయాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించటంతో వెనకడుగు వేశారు. అయినా 2016 నుండి ఏకపక్షంగా అమలు చేయటానికి పూనుకున్నారు. దాని వలన మంచి సానుకూల ఫలితాలు వచ్చినట్టు ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రామ్‌బిలాస్ శర్మ చెప్పుకొచ్చారు. ఏమి ఫలితాలు వచ్చాయో ఆ రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు తెలియాలి. గాయత్రి మంత్రాన్ని జపిస్తే మరిన్ని మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

"ఓం భూర్ భువస్వః, తత్సవితుర్వ రేణ్యం! భర్గోదేవస్య ధీమహి, ధియో యోన: ప్రచోదయాత్ !!" అనేది గాయత్రి మంత్రం. ఏక కాలంలో సమస్త ప్రదేశాలలో ఉండగలిగిన విశ్వరూపీ, ధీశాలి, పరమేశ్వరా! ప్రపంచంలో లభ్యమయ్యే సమస్త జ్ఞానం నువ్వే, మాలో భయాన్ని పోగొట్టేది నువ్వే, సృష్టి కర్తవు నువ్వే, సర్వోత్తముడివి నువ్వే! శిరస్సు వంచి నమస్కరిస్తున్నాము, మా మనస్సు మేధస్సు సత్కర్మల వైపు ఆకర్షింప బడేలా చూస్తూ మమ్ములను సన్మార్గంలో నడిపించు!" అనేది దాని అర్థం. క్రీస్తు పూర్వం ఎనిమిది వేల సంవత్సరాల క్రితం రుగ్వేదంలో గాయత్రి మంత్రం రాయబడినట్టు వేదపండితులనే వారు చెబుతున్నారు. అన్ని మంత్రాల కన్నా అత్యంత శక్తివంతమైన మంత్రం అని, పరమశివుడు విశ్వామిత్రునికి ఉపదేశించారని, అందువలన ఆయన అంత శక్తిమంతుడు అయినాడని ప్రచారంలో ఉన్నది. మంత్రాలకు మహిమ, శక్తి ఉన్నాయని చెప్పేందుకు ఆధారాలు, రుజువులు ఏమి లేవు. మంత్రాలకు చింతకాయలు రాలవు" అనేది మాత్రం నిజం. దానిని ఎవరైనా ఎక్కడైనా రుజువు చేయవచ్చు. మంత్రాలు నమ్మకానికి, మూఢవిశ్వాసానికి సంబంధించినవి. వాటిని విద్యార్థులపైన రుద్దటం అన్యాయం, అధికార దుర్వినియోగమే. ఇటీవల విడుదలైన వార్షిక విద్యాస్థాయి నివేదిక (అసెర్) 2017, జాతీయ సాధన సర్వే (న్యాస్)ల్లో హర్యానా పరిస్థితి అసంతృప్తి కరంగానే ఉన్నది. పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా వున్నట్టు యు-డైస్ నివేదికల ద్వారా తెలుస్తోంది. "బేటి బచావో బేటి పడావో" నినాదానికి భిన్నంగా బాలికల సంఖ్య తగ్గిపోతున్నట్టు కాగ్ రిపోర్ట్ కడిగేసింది. ఇలాంటి మౌలిక విషయాలను పట్టించుకోకుండా ముఖ్యమంత్రి ఖట్టర్ తన పార్టీ సైద్ధాంతిక భావజాలం ప్రచారానికి ప్రాకులాడటం సరైంది కాదు. అన్ని మతాల విద్యార్థులు ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో ఒక మతానికి చెందిన ఆచారాలను పాటింప చేయటం నియంతృత్వం, రాజ్యాంగ వ్యతిరేకం.

సెల్: 9490300577

సిరియాలో ఏం జరుగుతోంది?

సిరియాలో కొనసాగుతున్న తాజా పరిణామాలను ప్రపంచం పట్టించుకోవటం లేదంటూ ప్రజలు ఫొటోలు, వీడియోలతో కూడిన పోస్ట్‌లను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంటున్నారు. 'రెబల్స్' (ప్రభుత్వం చెబుతున్న ఉగ్రవాదులు) నుండి తూర్పు ఘౌటా నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా ప్రభుత్వ సేనలు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియా దీనిపై తీవ్రంగా స్పందిస్తోంది. సిరియా రాజధాని డెమాస్కస్ నగరానికి 15 కి.మీ దూరంలో వున్న తూర్పు ఘౌటా ప్రాంతం గత కొద్దికాలంగా రెబల్స్ ఆధీనంలో వున్న విషయం తెలిసిందే. వీరంతా టెర్రరిస్టు గ్రూప్ అల్‌ఖైదా, తదితర గ్రూప్‌లకు అనుబంధంగా గత కొద్దికాలంగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. తూర్పు ఘౌటాను రెబల్స్ నుండి స్వాధీనం చేసుకునే ప్రభుత్వ సేనల ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు డెమాస్కస్ నగరంపై రెబల్స్ భారీయెత్తున కాల్పులు దాడులు ప్రారంభించారు. గత నవంబర్ 16 నుండి కొనసాగుతున్న ఈ దాడులు, ప్రతిదాడులలో ఇప్పటి వరకూ 18 మంది చిన్నారులు, 14 మంది మహిళలతో సహా మొత్తం 116 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని రెబల్స్ అనుకూల వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఈ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేయటంతో ప్రస్తుతం మనం చూస్తున్న మీడియా ప్రచారం ఊపందుకుంది. ప్రస్తుతం ఫేస్‌బుక్, వాట్సప్ తదితర సోషల్ మీడియా వేదికల్లో షేర్ అవుతున్న ప్రచారానికి మూలం న్యూయార్క్‌టైమ్స్, ది గార్డియన్ వంటి పశ్చిమ దేశాల మీడియా సంస్థలతో పాటు అల్‌జజీరా, అల్‌జజీరా+, అల్ అరేబియా వంటి పశ్చిమాసియా మీడియా సంస్థలు అందిస్తున్న సమాచారమే. సిరియాలో బషర్ అల్ అసద్ సర్కారును గద్దెదించేందుకు గత ఐదేండ్లుగా జరుగుతున్న తిరుగుబాటులో అమెరికా సైన్యం నేరుగా జోక్యం చేసుకుంటున్న విషయం తెలిసిందే. సిరియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఈ పోరులో కొంతమంది మతఛాందసవాదులు, ఉగ్రవాదులు రెబల్స్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ఈ రెబల్స్‌కు అమెరికా, దాని నాటో మిత్ర దేశాల మద్దతు కూడా లభిస్తోంది. దీనితో పాటు సౌదీ అరేబియా వంటి రాజరిక వ్యవస్థలు సైతం వారిని గట్టిగా సమర్థిస్తున్నాయి.

ఎవరీ 'రెబల్స్'

తిరుగుబాటుకు నేతృత్వం వహిస్తున్న జభాత్ అల్ నస్రా (అల్ నస్రా ఫ్రంట్), ఇతర గ్రూపుల విలీనం అనంతరం జభాత్ ఫతే అల్ షామ్ అని, తరువాత తహ్రీర్ అల్ షామ్ అని పేర్లు మార్చుకుంది. వాస్తవానికి ఇది అల్‌ఖైదాకు చెందిన సిరియా విభాగం అని చెప్పవచ్చు. ఈ రెబల్ గ్రూపుల్లో వున్న వారంతా అమానుష హత్యలకు సైతం వెనుదీయని కరుడు గట్టిన ఉగ్రవాదులే. వీరిలో మరికొంత మంది ఉన్నారు. ఇందులో సౌదీ అరేబియాకు చెందిన జయేష్ అల్ ఇస్లామ్ (దీనికి సౌదీ, కువైత్‌కు చెందిన వహబిస్టులు ఆర్థిక అండదండలు సమకూరుస్తున్నారు), టర్కీకి చెందిన అహ్రార్ అల్ షామ్ అనే ప్రచ్ఛన్న సైనిక ముఠాలు ప్రధానమైనవి. వీరితో పాటు హర్కత్ నూర్ అల్ దీన్ అల్ జెంకీ మరో ఉగ్రవాద సంస్థ కూడా క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. గూఢచర్యం చేస్తున్నాడన్న అనుమానంతో పాలస్తీనాకు చెందిన12 ఏండ్ల బాలుడి తల నరికిన ఈ ఉగ్రవాదులు ఆ వీడియోను ఆన్‌లైన్‌లో కూడా ప్రసారం చేశారు.

అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థ దేనికోసం పోరాడుతోందో మనందరికీ తెలిసిందే. మహిళలను బానిసలుగా చూసే సమాజం కోసం వారు పోరాడుతున్నారు. ఇక్కడ మైనార్టీలందరూ ద్వితీయ శ్రేణి పౌరులుగానే బతకాలి (వారిని చంపకుండా వుంటే..) ఇదంతా వారు అనుసరించే వాహబిజం అనే మతఛాందసవాద దృక్పథంపై ఆధారపడి వుంటుంది.



ఫైల్ ఫోటో

ఇరాక్ మినహా పర్షియన్ గల్ఫ్‌లోని ఇతర అరబ్ దేశాలన్నీ రాజకుటుంబాల పాలనలోనే కొనసాగుతున్నాయి. వీటికి సౌదీ అరేబియా నాయకత్వం వహిస్తోంది. ప్రపంచంలో వివిధ దేశాలలో కొనసాగుతున్న మత ఛాందసవాద, ఉగ్రవాద కార్యకలాపాలకు ఇక్కడి నుండే ఆర్థిక సాయం అందుతోందన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లౌకిక విధానాన్ని అనుసరిస్తున్న సిరియా వీరికి సమస్యగా మారింది. పూర్తి స్థాయి రిపబ్లిక్ అయిన సిరియా చెబుతున్న అరబ్ జాతీయ వాదాన్ని ఈ ప్రాంతంలోని రాజకుటుంబాలు తమకు ముప్పుగా పరిగణిస్తున్నాయి. వీరితో పాటు ఈ ప్రాంతంలో మరో శక్తిగా ఎదుగుతున్న టర్కీలోని ఇస్లామిస్ట్ ప్రభుత్వం కూడా సిరియా ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే ప్రయత్నిస్తోంది.

చమురు సంపద పుష్కలంగా వున్న సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలు అమెరికా మిత్ర దేశాలుగా కొనసాగుతుండగా సిరియా మాత్రం సర్వ స్వతంత్ర దేశంగా కొనసాగుతోంది. ఈ దేశం అనుసరిస్తున్న విధానాలేవీ అమెరికా కంపెనీలకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేవు. అరబ్ జాతీయవాదానికి ఈ ప్రాంతంలో ఇప్పుడు మిగిలిన ఏకైక ప్రతినిధి సిరియా మాత్రమే. ఈ ప్రాంతంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, యూదు వ్యతిరేక వైఖరిని అనుసరిస్తున్న అరబ్ జాతీయవాద, సోషలిస్టు శక్తులతో పోరాడేందుకు అమెరికా దీర్ఘకాలంగా ప్రతీఘాత ఇస్లామిక్ శక్తులను, వాటి ప్రభుత్వాలను సమర్థిస్తోంది. మరోవైపు సిరియా తన సోషలిస్టు మిత్ర దేశాలతో సన్నిహితంగా మెలుగుతూ వాటితో మైత్రి కొనసాగిస్తోంది. ఇటీవలి కాలంలో అమెరికా తనకు ముప్పుగా భావిస్తున్న మరో దేశం ఇరాన్‌తో కూడా సాన్నిహిత్యం పెంచుకుంది. చారిత్రకంగా చూసుకుంటే ఇజ్రాయిల్‌ను గట్టిగా వ్యతిరేకిస్తున్న దేశం సిరియా. ఈ రెండు దేశాల మధ్య వున్న సరిహద్దులోని గోలన్ హైట్స్ ప్రాంతం సిరియా భూభాగంలో వుంది. పాలస్తీనా ప్రజలతో సన్నిహిత మైత్రి కొనసాగిస్తున్న సిరియా పాలస్తీనా ఏర్పాటు విషయంలోనూ అదే నిబద్ధత కొనసాగిస్తోంది. గత 18 ఏండ్లుగా ఇజ్రాయిల్‌తో పోరాడుతున్న హిజ్బుల్లాతో సిరియాకు సత్సంబంధాలే వున్నాయి. సిరియా ప్రభుత్వం పడిపోతే అరబ్ ప్రాంతంలో ఇజ్రాయిల్‌కు ఎదురు నిలిచే అరబ్ దేశమే ఉండదు. అన్నిచోట్లా ఓటమి ఎదుర్కొంటున్న అరబ్ జాతీయవాద శక్తులకు ఇప్పుడు పట్టున్న ఏకైక ప్రాంతం సిరియా మాత్రమే. అందువల్లే సిరియా ప్రభుత్వ పతనాన్ని అమెరికా కోరుకుంటోంది.

పశ్చిమాసియా ప్రాంతం దీర్ఘకాలంగా యుద్ధాలకు నిలయంగా మారింది. ఇటీవలి కాలంలో జరిగిన యుద్ధాలు ఉగ్రవాద గ్రూపులు స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను ఆయా ప్రభుత్వాలు తిరిగి స్వాధీనం చేసుకోటానికి చేస్తున్నవేనన్న విషయం తెలిసిందే. ఇస్లామిక్ స్టేట్ ఆక్రమించుకున్న సిరియా పట్టణం రక్కాను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు కొనసాగించిన పోరులో దాదాపు 3,200 మందికి పైగా సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కాల్పుల విరమణ పాటించాలంటూ ఐరాస చేసిన విజ్ఞప్తిని సైతం అమెరికా తోసిపుచ్చింది. అలాగే మోసుల్ నగర విముక్తి పోరులో 11 వేల మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇంత జరుగుతున్నా అమెరికా పోరాటాన్ని ఆపాలని మీడియా ప్రచారం చేయటం ఎక్కడన్నా కన్పిస్తోందా? లేదు. అందుకు బదులుగా అమెరికా సామ్రాజ్యవాదంతో దోస్తీకి నిరాకరిస్తున్న ఒక సార్వభౌమత్వ దేశం, అమెరికా, దాని మిత్ర దేశాలు సమర్థిస్తున్న ఉగ్రవాదుల చేతుల్లో నుండి తమ దేశంలో ఒక నగరాన్ని స్వాధీనం చేసుకోవటాన్ని వ్యతిరేకిస్తూ ప్రచారం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే 2016 డిసెంబర్‌లో సిరియన్ సైన్యం అలెప్పో నగరాన్ని విముక్తి చేసినప్పుడు సేవ్ అలెప్పో ప్రచారం జరిగింది. ఇప్పుడు సిరియా ప్రభుత్వం తూర్పు ఘౌటాను విముక్తి చేయటానికి ప్రయత్నించినప్పుడు అదే తరహా ప్రచారం ఊపందుకుంటోంది. ఇందుకు పశ్చిమ, ఇస్లామిక్ దేశాల అండతో లండన్‌లో తిష్ట వేసిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్' వంటి సంస్థలు పావులుగా మారుతున్నాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న చిత్రాలేవీ సిరియాలో ప్రస్తుత పరిణామాలకు సంబంధించినవి కాదన్న విషయం గమనార్హం. ఎప్పుడో అటకెక్కించిన పాత చిత్రాలను బూజు దులిపి సిరియాలో ప్రజలు కష్టాలు పడుతున్నారంటూ మొసలి కన్నీరు కారుస్తూ ప్రచారం కొనసాగిస్తున్నారు.

అనువాదం: వరప్రసాద్
సెల్: 8125796039





ఒక స్త్రీ తనను తాను నిలబెట్టుకోవడానికి లేచి నిలబడ్డప్పుడల్లా ఆమెకి తెలియకుండానే, ఆమె చెప్పుకోకుండానే, ఆమె సమస్త స్త్రీ జాతిని నిలబెట్టడానికి లేచి నిలబడుతున్నది.
- మాయా ఏంజిలో



బ్రాహ్మణీయభావజాలం... మార్కెట్ మాయాజాలం...

సాధికారతకు మూలం సరైన విద్య. చదువు లేనిదే జీవితంలోని చీకట్లను పోగొట్టలేమని మహాఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పులే నుంచి నేటివరకు ఎంతోమంది నిరూపిస్తూనే ఉన్నారు. మరి ఆ చదువుల్లో మహిళల స్థానం ఎక్కడ ఉంది? కాలేజీల్లో అందుతున్న విద్య మహిళా అభ్యుదయానికి ఏ మేరకు ఉపయోగపడుతోంది. అమ్మాయిలు చదువుతున్నారు. కానీ అమ్మాయిల పట్ల ఎలా ఉండాలనే జ్ఞానాన్ని చదువు ఇస్తోందా? బ్రాహ్మణీయ భావజాలం, మార్కెట్ మాయాజాలం ముప్పేటదాడి చేస్తున్న ఈ కాలంలో అమ్మాయిలు ఏ భావాలతో ఉన్నారు? మహిళా దినోత్సవాలు.. మహిళా సాధికారతకు ఉపయోగపడుతున్నాయా? ప్రతిరోజూ, ప్రతిచోటా మహిళలకు ఇవ్వాల్సిన గౌరవాన్ని.. ఒక్కరోజు తంతుగా ముగించేస్తున్నామా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు పంచుకున్నారు ఈ తరం విద్యార్థులు. మరో ఆరు రోజుల్లో మహిళా దినోత్సవం జరుపుకోబోతున్న సందర్భంగా వారి అభిప్రాయాలు....

స్వేచ్ఛ లేదు...



మహిళలు ఇంతకుముందు కంటే ఎక్కువగా చదువుతున్నారు. అందులో సందేహమే లేదు. ఉన్నత చదువులు ఎంతశాతం మంది చదువుతున్నారు అనేదే అసలు ప్రశ్న. ఎంత మంది అమ్మాయిలు వచ్చి చదువుకుంటున్నా... డిగ్రీ అయిపోగానే పెండ్లి చేసుకోవాలి, లేదా మాస్టర్స్ అయిపోగానే పెండ్లి చేసుకోవాలి అనే భావన ఉంటోంది. అందుకు ప్రధాన కారణం చుట్టూ ఉన్న వాతావరణం, పెంపకం. అమ్మాయివి కాబట్టి పెండ్లి చేసుకోవాలి. వేరేవాళ్ల ఇంటికెళ్లి... కుటుంబానికి చెడ్డపేరు తీసుకురాకుండా బతకాలి. కానీ అమ్మాయికి ఒక వ్యక్తిత్వం ఉంటుంది. చదువుకోవాలనో, మంచి ఉద్యోగం చేయాలనో ఆశ ఉంటుందని ఇప్పటికీ గుర్తించే పరిస్థితి లేదు. ఇదంతా ఒక ఎత్తయితే అబ్బాయిలతో మాట్లాడిన అమ్మాయిని తిరుగుబోతుగానో, ఇంకో పేరుతోనో ముద్ర వేసే పరిస్థితులు ఇంకా ఉన్నాయి. ఇన్ని నిబంధనల మధ్య బతుకుతున్నాం. అమ్మాయిలు బయటికి వస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. తమ సత్తా ఏంటో చాటుతున్నారు. కానీ ఇంకా ఆ అమ్మాయిల బట్టల మీదనే చర్చలు చేసే స్థితిలో మనం ఉన్నాం. తెలివివితేటలు, శక్తి సామర్థ్యాలు ఏవీ పరిగణనలోకి రావు. ఇప్పటికీ అమ్మాయిలది 'ఇది ఇష్టం లేదు. ఇది ఇష్టం ఉంది' అని గట్టిగా మాట్లాడలేని పరిస్థితి. ఏదైనా స్వేచ్ఛగా చెప్పే పరిస్థితి లేదు. స్వేచ్ఛగా రాసే పరిస్థితి లేదు. ఇష్టమైన బట్టలు వేసుకునే స్వేచ్ఛ లేదు. ఇన్ని నియమనిబంధనల మధ్య ఇంకా ఉన్న అమ్మాయిల సాధికారత గురించి మాట్లాడుకున్నా ఫలితం ఉండదు అనిపిస్తుంది.

- కడలి రౌతు, ఎమ్మే ఇంగ్లీష్ విద్యార్థిని, ఉస్మానియా యూనివర్సిటీ

అవగాహన పెంచుకోవాలి



ప్రస్తుతం అమ్మాయిలు ఎంత చదువుకున్నా తమకు ఎలాంటి హక్కులు ఉన్నాయో తెలుసుకోలేకపోతున్నారు. సమాజంపై అవగాహన ఉండడం లేదు. ఎవరి చేతుల్లో చూసిన ఫోన్లు. అమూల్యమైన సమయాన్ని కేవలం చాటింగులకు ఉపయోగిస్తున్నారు. దీని వల్ల తల్లిదండ్రుల నమ్మకాన్ని కోల్పోతున్నారు. పిల్లలు ఏమీ చేయకపోయినా 'మాకు తెలియకుండా ఏమో చేస్తున్నారు' అని అనుమానిస్తున్నారు. మనకు ఉన్న సమయాన్ని, అవకాశాలను ఉపయోగించుకొని చదువు, ఉద్యోగంలో రాణిస్తే భవిష్యత్ బాగుంటుంది. అయితే ఇలాంటి అవగాహన అమ్మాయిల్లో లేకపోవడానికి కారణం మన చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావం.ముఖ్యంగా సినిమాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందులో కనిపించే హీరోయిన్ మాదిరిగా అందంగా కనిపించాలనె తపన ఎక్కువవుతుంది. కొన్ని సమయాల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో తెలియక జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నారు. మరో విషయం... ఇప్పుడు అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ఎన్నో పథకాలను ప్రభుత్వాలు తెస్తున్నాయి. కొంత మంది మాత్రమే ఇలాంటి అవకాశాలను అందుకుంటున్నారు. చాలా మందికి ఇలాంటి పథకాలు అసలు అందుబాటులోకి రావడం లేదు. అసలు ఈ సమాజంలో మన బాధ్యత ఏమిటి , అనేది మర్చి పోయి 24 గంటలు ఫోన్లతో గడుపుతున్నారు. చదువుతోపాటు ఇతర సామాజిక కార్యక్రమాలు, రాజకీయల గురించి అవగాహన పెంచుకుంటే మనం ఏం చేయాలో తెలుస్తుంది. ఉమెన్స్ డే సందర్భంగా ఇలాంటి అవగాహన అమ్మాయిల్లో కల్పించాలని కోరుకుంటున్నాను.

- విజేత, డిగ్రీ సెకండ్ ఇయర్ (బీజెడ్‌సీ), శాతవాహన యూనివర్సిటీ



ఆధిపత్యం కొనసాగుతోంది...

ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకొంటున్నాం. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరుతూ, పిత స్వామ్య భావజాలనికి వ్యతిరేకంగా, క్లారాజెట్కిన్ నాయకత్వంలో తొలిసారిగా మహిళా ఉద్యమం కొనసాగింది. వందేండ్లు గడిచిపోయాయి. అప్పటి నుండి నేటిదాకా మహిళా లోకం నిరంతర పోరాటల ఫలితంగా కొంత మార్పు వచ్చింది. అయితే ఇంకా చాలా మార్పులు రావాల్సి ఉంది. నయా సామ్రాజ్యవాదం, బ్రహ్మణీయ భావజాలంతో కలిసి స్త్రీలపై కనిపించని ఆధిపత్యం కొనసాగుతోంది. మహిళను మరింత మార్కెట్ సరుకుగా తయారు చేస్తుంది. ఇదే విధానం అన్ని రంగాల్లోనూ కనిపిస్తోంది. వంటిల్లునుదాటి, పురుష ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ చదువులకో, ఉద్యోగాలకో బయటికి వస్తున్న మొదటితరం ఓవైపు... దానిని మించి కొనసాగిస్తున్న మార్కెట్ ఆధిపత్యం మరోవైపు కొనసాగుతోంది. దీనికి వ్యతిరేకంగా మహిళలా లోకంతో పాటు ప్రజాస్వామ్యాన్ని ఆకాంక్షించే ప్రతి ఒకరు కలిసిరావల్సిన అవసరం ఇప్పుడు ఉంది.

- శిరీష, పీహెచ్‌డీ విద్యార్థిని, జెండర్ స్టడీస్, సెంట్రల్‌యూనివర్సిటీ

చర్చ ప్రతి రోజూ జరిగితేనే...



స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కొన్ని మార్పులు వచ్చాయి. అయితే వివక్ష మాత్రం కొనసాగుతుంది. రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాల్సినంత ఇవ్వడం లేదు. ఇప్పటి వరకు 33 శాతం రిజర్వేషన్ అమలు కాకపోవడమే దీనికి ఉదాహరణ. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అమ్మాయిలకు పూర్తిస్థాయిలో అవగాహన లేదు. అమ్మాయిలకు చిన్న వయసులోనే పెండ్లి చేసేస్తున్నారు. చేసుకోబోయే వాడికి ఉద్యోగం ఉంటే చాలు తమ కూతురు సుఖంగా ఉంటుందనుకుంటున్నారు. పెండ్లి చేసుకునే అబ్బాయికి మంచి ఉద్యోగం ఉంటే సరిపోదు, మంచి ఆలోచనలు కూడా ఉండాలి. అది లేనప్పుడు ఆడపిల్లలకు కష్టాలు తప్పవు. సమస్యలకు వరకట్నం కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయి. ఇలాంటి సమాజంలో ఏలా పెరగాలి అనే అవగాహన కలిగించలేని విద్యను మేము చదువుకుంటున్నాం. ముఖ్యంగా అమ్మాయిలు సొంత నిర్ణయాలు తీసుకుంటే తల్లిదండ్రులుగానీ, సమాజంగాని గౌరవించడం లేదు. పెండ్లి విషయంలో తల్లిదండ్రులకు అవగాహన పెరగాలి. ఉమెన్స్ డే కేవలం నగరాలకు, పెద్ద పట్టణాలకే పరిమితం అవుతుంది. అది కూడా చాలా తక్కువ మంది మాత్రమే చేస్తారు. గ్రామీణ మహిళలకు అసలు దీని గురించే తెలియదు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే అమ్మాయిల సమస్యలపై చర్చించడం, గౌరవించడం కేవలం ఒక్క ఉమెన్స్ డే రోజు మాత్రం జరిగితే సరిపోదు. దీని వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. ప్రతి రోజు అమ్మాయిల అభివృద్ధి గురించి ఆలోచించాలి. సమాజంలో ఎలా మెలగాలి, ఎలా ఉంటే ముందుకు వెళ్లగలరు అనేది విద్యా విధానంలో ఉండాలి. అప్పుడే ఆడపిల్లకు న్యాయం జరుగుతుంది.

- మాలతి, బయోటెక్నాలజీ (ఇంటిగ్రేటెడ్ కోర్స్) కాకతీయ యూనివర్సిటీ



మాటల్లో మాత్రమే సమానత్వం

ఉమెన్స్ డే లాంటివి తప్పకుండా జరుపుకోవాలి. అయితే ఇప్పుడు అమ్మాయిలు ఉన్న పరిస్థితి ఏమిటంటే... అబ్బాయిలతో సమానంగా అన్నింట్లో సమాన అవకాశాలు కల్పిస్తామని అందరూ ఉపన్యాసాలు మాత్రం చెబుతున్నారు. కానీ ఇవన్నీ కేవలం మాటలకే పరిమితమవుతున్నాయి. చేతల్లో మాత్రం వివక్ష కొనసాగుతుంది. గ్రామాలకు వెళితే పరిస్థితి మరీ ఘోరంగా వుంది. అమ్మాయిలకు స్వేచ్ఛ లేదు. చిన్నప్పుడు తండ్రి, పెండ్లి తర్వాత భర్త, ముసలి వాళ్ళు అయిన తర్వాత కొడుకు ఇలా ప్రతి స్థాయిలో ఎవరో ఒకరిపై అమ్మాయిలు ఆధారపడి ఉండాల్సిందే. వీటన్నింటి నుంచి బయటపడి ఒకవేళ తను ధైర్యంగా ఏదైనా చేద్దాం అనుకుంటే 'నువ్వు అమ్మాయివి ఇవన్నీ అవసరమా' అంటూ నిరుత్సాహపరుస్తారు. ఏమీ చేయనీయకుండా వెనక్కు లాగేస్తారు. అందుకే మహిళల సమస్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి. ఉమెన్స్ డే రోజు మాత్రమే కాకుండా గ్రామ స్థాయి వరకు వెళ్ళి పెద్ద స్థాయిలో ఇలాంటి రోజులు నిరంతరం జరపాలి.

- ఇందిర, మహాత్మాగాంధీ యూనివర్సిటీ

జీన్స్ మెరవాలంటే !



జీన్స్ ఉతకాలంటే చాలా కష్టం. ఒకవేళ ఎక్కువగా ఉతికిన రంగులు పోతాయి, క్లాత్ త్వరగా పాడవుతుంది. అలా పాడవకుండా ఎలా ఉతకాలో తెలుసుకుందాం! దాని కోసం కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

- జీన్స్ ఉతికేటప్పుడు తిరగేసి ఉతకాలి. అలాగే జీన్స్ బట్టలను రెగ్యులర్ గా ఉతకవద్దు. ఎందుకంటే వాటి నాణ్యత తగ్గుతుంది.
- జీన్స్ ప్యాంట్ ఉతకాలంటే వాడే డిటర్జెంట్ పౌడర్ మంచి నాణ్యత కలిగినదై ఉండాలి. దాంతో పాటు ఘాటు తక్కువగా, తేలికగా ఉండే పౌడర్‌ను ఉపయోగించడం మంచిది.
- జీన్స్ బట్టలను చల్లటి నీటిలో ఉతకాలి. వేడి నీటిలో నానపెడితే దుస్తులు త్వరగా పాడవుతాయి. జీన్స్ ప్యాంట్‌ను నాలుగు లేదా ఐదు సార్లు వేసుకోవచ్చు. అయితే వాటిని ఐరన్ చేసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల క్లాత్ మీద ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది.
- సాధారణంగా జీన్స్ ప్యాంట్స్ ఉతికేటప్పుడు బ్రష్ వేస్తారు. దీని వల్ల ప్యాంట్ త్వరగా చిరిగిపోతుంది. ప్యాంట్ ను చేతులతో ఉతకడం మంచిది. బ్రష్ తో గట్టిగా రుద్దొద్దు. అలా రుద్దితే ప్యాంట్ కలర్ త్వరగా పోవడంతో పాటు బట్ట పలుచబడుతుంది.
- డిటర్జెంట్ లో పది నిమిషాలు నానపెట్టాలి. ఆ తర్వాత ప్యాంట్‌కు ఉన్న నురగ వదిలేందుకు రెండు లేదా మూడు సార్లు నీటిలో జడించాలి.
- జీన్స్ ఉతికిన తర్వాత దానికి కండిషనర్ వాడాలి. కండిషనర్ వాడటం వల్ల క్లాత్ మెత్తగా ఉండటంతో పాటు రంగు పోకుండా కాపాడుతుంది.
- తెలుపు రంగు జీన్స్ ఉతకాలంటే ఒక బకెట్‌లో ఒక చెంచా వెనిగర్, అమోనియా, బేకింగ్ సోడాలు కలపాలి. ఆ నీటిలో 15 నిమిషాల పాటు ప్యాంట్‌ను నానబెట్టాలి. ఆ తర్వాత సబ్బుతో రుద్ది ప్యాంట్ మీద ఉండే మరకలన్ని పోయి తెల్లగా, కొత్తదానిలా మెరిసిపోతుంది. ముఖ్యంగా జీన్స్ ఉతికిన తర్వాత నీటిని పిండకుండా అలానే తాడుపై వేలాడదీయాలి. ❄

పెంపుడు జంతువుల నుంచి...



కాఫీ పొడి, కాఫీ గింజలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇంట్లో వచ్చే దుర్వాసనను తొలగించడంతో పాటు చీమల నివారణకు కాఫీ పౌడర్ బాగా పని చేస్తుంది.

దుర్వాసనను తొలగిస్తుంది: బాత్ రూమ్‌లో దుర్వాసన ఎక్కువగా వస్తుంటే, ఒక చిన్న కాటన్ క్లాత్ లో కాఫీ పౌడర్ లేదా కాఫీ గింజలను వేసి మూట కట్టి బాత్‌రూమ్‌లో వేలాడదియ్యాలి. ఇలా చేయడం వల్ల దుర్వాసన పూర్తిగా దూరం అవుతుంది. అలాగే ఫ్రింజ్ లో కూడా ఏమైన చెడు వాసనలు వస్తుంటే ఒక బౌల్లో కొద్దిగా కాఫీ గింజలను లేదా పౌడర్‌ను పోసి పెడితే సరిపోతుంది.

చీమలను నివారించడానికి: ఇంట్లో కార్నర్స్ దగ్గర, వంట గదిలో చీమలు ఎక్కువగా ఉన్నట్లైతే ఆ ప్రదేశంలో కాఫీ పౌడర్ ను లేదా కాఫీ గింజలను కానీ చిలకరించాలి. అలాగే గార్డెన్ లో కూడా చీమల బెడద లేకుండా చేసుకోవాలంటే కాఫీ పౌడర్ కొద్దిగా చల్లితే చాలు చీమల బెడద తగ్గుముఖం పడుతుంది.

పాత్రలను శుభ్రపరచడానికి: ఇంట్లో తరచూ ఉపయోగించే పాత్రలు, గిలకొట్టిన గుడ్డు వాసన వస్తున్నా లేదా వెజిటేబుల్ కట్ చేయడానికి ఉపయోగించే చాకులు వెల్లుల్లి గార్లిక్ వంటి వాసనలు వస్తున్నా, కాఫీ పౌడర్‌ను ఉపయోగించి రుద్దడం వల్ల వాసన తొలగిపోతుంది. ముఖ్యంగా కాఫీతో ఎక్కువగా మరకలు పడ్డ పాత్రలను శుభ్రం చేయడానికి ఉపయోగిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

పెంపుడు జంతువుల నుండి వచ్చే వాసనను నివారిస్తుంది: మనకు పెంపుడు జంతువులంటే చాలా ఇష్టం. అయితే వాటి వాసన మాత్రం ఇష్టం ఉండదు. పెంపుడు జంతువుల నుంచి వచ్చే వాసన తొలగించుకోవాలంటే సోఫా మీద తాజా కాఫీ బీన్స్ బ్యాగ్‌ను ఉంచాలి. దాంతో పాటు కాఫీ పొడి వేసి మరిగించిన నీటిని ఇంట్లో పెట్టిన చాలు నిమిషాల్లో గది వాసన తాజాగా ఉంటుంది. ❄

చేతులు జాగ్రత్త...

ఖాళీగా ఉన్న చేతులు అస్సలు ఊరుకోవు. అందుకే అవసరం లేకపోయినా ముఖానికి, చెంపలకు చేతులు ఆనిస్తుంటాం. చిన్న కురుపులా కనిపించినా గిల్లుతుంటాం. కానీ ఇది అస్సలు మంచి పద్ధతి కాదంటున్నారు వైద్యులు. కీబోర్డులు, ఫోన్లు రకరకాల గాడ్జెట్స్ వాడిన చేతులతో ముఖాన్ని తాకితే ఎలర్జీ వస్తుంది. చర్మ సమస్యలు వస్తాయి. అలాగే ముఖానికి మసాజ్ పేరుతో అతిగా రుద్దుతుంటారు చాలా మంది. ఇది కూడా మంచి పద్ధతి కాదు. దీనివల్ల చర్మం సాగిపోతుంది. వయసుకు మించి కనబడుతుంటారు.

చర్మంతోపాటు అత్యంత సున్నితమైన భాగం కళ్లు. చాలా మంది కళ్లు దురదగా ఉంటే చేతులతో రుద్దుతుంటారు. అదేపనిగా రుద్దడం మంచిది కాదు. చేతులతో కళ్లను రుద్దడం వల్ల ఎర్రబడటమే కాదు... ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి. ఇవి ప్రమాదానికి దారి తీస్తాయి. కాబట్టి కళ్లు దురదగా ఉంటే ఐ డ్రాప్స్ వాడటం మంచిది.



మరో ముఖ్యమైన భాగం గోర్లు. చాలామంది అందం కోసం గోర్లు పెంచుతుంటారు. కానీ ఈ గోర్లకింద చాలా ఫంగస్, బ్యాక్టీరియా చేరుతుంది. ఈ చేతులను ఎక్కడపడితే అక్కడ ఉంచడం వల్ల ఆ బ్యాక్టీరియా, ఫంగస్ హాని కలిగిస్తుంది. కాబట్టి గోర్లు వెంట వెంటనే కత్తిరించుకోవడం మంచిది. శరీరంలో అత్యంత సున్నితమైన భాగాలు చెవులు, ముక్కు. చాలా మంది ఏ కాస్త దురద అనిపించినా చెవుల్లో, ముక్కుల్లో వేల్లు దూర్చేస్తూ ఉంటారు. అది అస్సలు మంచిది కాదు. చాలామందికి నోట్లో వేలుపెట్టుకునే అలవాటు ఉంటుంది. ఇది అస్సలు మంచిదికాదు. ఇలా చేయడం వల్ల బ్యాక్టీరియాను నేరుగా శరీరంలోకి పంపిన వారవుతారు. కాబట్టి చేతులు నిత్యం శుభ్రంగా ఉంచుకోవడం మంచిది. ❄



ముర్తుజా మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న జి.ఓబులు తదితరులు

ముస్లింల అభ్యున్నతికి ముర్తుజా విశేష కృషి

నేడు నంద్యాలలో అంత్యక్రియలు

నంద్యాల: ముస్లింల అభ్యున్నతికి ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి ముర్తుజా ఎనలేని సేవలందించారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు, తూర్పుప్రాంత జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ , ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ పేర్కొన్నారు. గురువారం ముర్తుజా భౌతికాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముర్తుజా ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి ముస్లింల సమస్యలపై పరిపూర్ణమైన అవగాహనతో కృషి చేశారన్నారు. ప్రజాశక్తి, ఇతర పత్రికలకు వ్యాసాలు రాసి చైతన్యపరిచారన్నారు.

ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింల సమస్యలపై ఆ సామాజిక తరగతికి చెందిన వారిని ఐక్యం చేస్తూ పోరాటాలు చేశారన్నారు. ఆయన లేనిలోటు తీరనిదని చెప్పారు. ముర్తుజా అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 9గంటలకు నంద్యాలలో నిర్వహించనున్నారు. బుధవారం ఆయన గుండెపోటుతో మృతిచెందారు. విదేశాల్లో ఉన్న ఆయన కుమారుడు గురువారం రాత్రి పొద్దుపోయాక నంద్యాలకు చేరుకున్నారు.

పోలవరం మాజీఎమ్మెల్యే సింగన్నదొర మృతి



పోలవరం: పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మాజీ ఎమ్మెల్యే పూనెం సింగన్నదొర(68) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. గత నెల 24న ఆయన అస్వస్థతకు గురికావడంతో బంధువులు చికిత్స నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా గురువారం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో హఠాన్మరణం చెందారు. అనంతరం ఆయన స్వగ్రామమైన కోండ్రుకోట గ్రామానికి పార్థివదేహాన్ని తరలించారు. పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. గురువారం సాయంత్రం కోండ్రుకోటలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. సింగన్నదొర మృతికి సంతాపంగా పోలవరంలో వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేసి సంతాపం తెలిపారు. ఎన్‌టిఆర్ ఆహ్వానం మేరకు టిడిపిలో చేరిన ఆయన 1994 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

- సిద్దిపేట జిల్లాలో ఘటన

నవతెలంగాణ- జగదేవపూర్

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రైతు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం బీజీ వెంకటాపూర్‌లో గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గౌడలింగం (29) ఆరెకరాలు కౌలుకు తీసుకుని వరి, మొక్కజొన్న సాగు చేశాడు. పెట్టబడి కోసం సుమారు రూ.4 లక్షల వరకూ అప్పు చేశాడు. పంట కొంత భాగం ఎండి దిగుబడి సరిగా రాలేదు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ఆయన్ను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఫలితం లేక మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

హోలీ పాటల సీడీలను ఆవిష్కరించిన ఎంపీ కవిత

హైదరాబాద్ : హోలీ పాటల సీడీలను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కవిత ఆవిష్కరించారు. హోలీని పురస్కరించుకుని తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం కన్వీనర్ కొదారి శ్రీను నిర్వహణలో తయారైన ఈ సీడీలను గురువారం కవిత తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షులు రాజీవ్ సాగర్, భిక్షపతి, కష్ణారెడ్డి, నితీష్, నరేందర్ గల్ఫ్ అధ్యక్షులు చెల్లంశెట్టి హరిప్రసాద్, యువజన విభాగం కన్వీనర్ కొరబోయిన విజయ్, మహారాష్ట్ర అధ్యక్షులు సుల్గె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హోలీ సంబురాల్లో విషాదం

- ముగ్గురు మృతి
- మంజీర నదిలో ఇద్దరు విద్యార్థులు
- చెరువులో మరో యువకుడు





నవతెలంగాణ-జోగిపేట/కొత్తగూడెం

హోలీ సంబురాల్లో విషాదాలు చోటు చేసుకున్నాయి. హోలీ ఆడి స్నానం కోసం మంజీర నదిలో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, మరో యువకుడు బావిలో మునిగి చనిపోయాడు. మరో ఘటనలో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలు గురువారం సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగాయి. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం కొర్పోల్ గ్రామానికి చెందిన చెందిన సాయికిరణ్(15), సాయికుమార్(15) ఉదయం స్నేహితులతో కలిసి హోలీ ఆడారు. మధ్యాహ్నం అందరూ కలిసి స్నానాల కోసం గ్రామ సమీపంలోని మంజీర నదికి వెళ్లారు. సాయికిరణ్, సాయికుమార్‌లకు ఈత రాక పోవడంతో నీటిలో మునిగిపోయారు. తోటి బాలురు వారిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సాయికిరణ్ శివంపేటలో, సాయికుమార్ స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ఇద్దరు విద్యార్థులు నీటిలో మునిగి మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో మృతదేహాలను వెలికి తీయించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం కర్లపబోడుతండాకు చెందిన యువకులు హోలీ ఆడారు. అనంతరం అందరూ కలిసి వ్యవసాయ బావిలో స్నానం చేసేందుకు వెళ్లారు. తొలుత గుగులోత్ విజయ్ (23) బావిలోకి దూకాడు. బావిలో పూడిక ఉండడంతో విజయ్ దానిలో కూరుకుపోయాడు. పైనఉన్న స్నేహితులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే విజయ్ మృతి చెందాడు. టేకులపల్లి మండలం గంగారం ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అజ్మీరా ప్రసాద్ స్నేహితులతో హోలీ ఆడుతూ రెండవ అంతస్తు నుండి కింద పడిపోయాడు. ముక్కు, చెవుల నుండి రక్తం రావడంతో వెంటనే కొత్తగూడెం వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు.

కార్మికులా..కార్పొరేట్లా !

తేల్చుకోవాలని సీఎంకు గఫూర్ హెచ్చరిక

- ఇది కార్మిక వ్యతిరేక ప్రభుత్వం
- బడ్జెట్ సమావేశాల్లో సమస్యల్ని చర్చించాలి: ధర్నాలో వక్తల డిమాండ్



విజయవాడలో ధర్నాకు హాజరైన మధ్యాహ్న భోజన కార్మికులు

అమరావతి : ప్రభుత్వానికి కార్మికులు కావాలో, కార్పొరేట్లు కావాలో తేల్చుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించొద్దని, కార్మికులకు నెలకు రూ.5000 వేతనాన్ని చెల్లించాలని, పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, విద్యార్థులకు ఇచ్చే మెనూ ఛార్జీల్ని పెంచాలని, ఉపాధి భద్రత కల్పించాలని కోరుతూ విజయవాడ అలంకార్ సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే టీడీపీ తిరిగి అధికారంలోకి రాదన్నారు. 8 నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు. పథకాన్ని ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇస్కాన్, అక్షయ పాత్ర వంటి సంస్థలకు అప్పగించాలని ప్రభుత్వం ప్రయత్నించడాన్ని తిప్పికొట్టాలన్నారు.

కార్మికుల కడుపుమంట పట్టించుకోని ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ బడ్జెట్‌లో సమావేశాల్లో కార్మికుల సమస్యల్ని చర్చించాలన్నారు. దీనికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యల్ని తీసుకెళ్తానన్నారు. కార్మికులపై రాజకీయ కక్ష సాధింపు చర్యల్ని మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఉద్యమానికి విద్యార్థులు, తల్లిదండ్రుల మద్దతు కూడా తీసుకోవాలని సూచించారు.


ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం: స్వరూపారాణి

యూనియన్ ప్రధాన కార్యదర్శి కె స్వరూపరాణి మాట్లాడుతూ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించడాన్ని ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల్ని వెంటనే చెల్లించాలన్నారు. వేతనాలను రూ.5000లకు పెంచాలన్నారు. ధర్నా వద్దకు వచ్చిన విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌కు యూనియన్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు సుప్రజ, డి రమాదేవి, నాగమణి, శివకుమారి, శ్యామలరాణి, లక్ష్మి, ప్రసన్న, పెద్ద ఎత్తున మధ్యాహ్న భోజన పథక కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్రాలు కలిసి ముంచాయి

విభజన హామీలపై జేఎఫ్‌సీ నివేదిక

- రేపు అధికారికంగా విడుదల



నివేదిక వివరాలను పవన్ కల్యాణ్‌కు వివరిస్తున్న జయప్రకాశ్ నారాయణ్

హైదరాబాద్: విభజన హామీలు అమలులో ఏర్పడిన గంగరగోళంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాన భాగస్వామ్యం ఉందని జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జేఎఫ్‌సీ) తేల్చింది. హోదా, విభజన హామీలు అమలు చేయడంలో రెండు ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టుగా పేర్కొంది. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబెట్టుకోలేక పోయినట్టు నివేదికలో అభిప్రాయపడింది. గురువారం సాయంత్రం జేఎఫ్‌సీ కమిటీ ప్రత్యేకంగా భేటీ అయ్యింది. కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, లోక్ సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య కార్యదర్శి ఐ.వై.ఆర్.కృష్ణా రావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఐ.ఏ.ఎస్ అధికారి తోట చంద్ర శేఖర్, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కమిటీ తుది నివేదిక రూపకల్పనపై విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముసాయిదా నివేదికను కమిటీ సభ్యులు పవన్ కల్యాణ్‌కు అందజేశారు. అయితే తుది నివేదికపై శుక్రవారం మరోసారి చర్చలు జరిపి మార్చి 3న నివేదికను ప్రజల ముందుంచాలని నిర్ణయించారు. విభజన హామీల అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తప్పుపట్టినట్టు తెలిసింది. పార్లమెంటు సాక్షిగా ప్రధాని మన్మోహన్ సింగ్ ఏపీకి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ విషయంలో బీజేపీ, టీడీపీలు ప్రజలను తప్పుదారి పట్టించినట్టు నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. హోదా స్థానంలో ఇస్తానన్న ప్రత్యేక ప్యాకేజీని ఇంతవరకు అమలు చేయలేదని, బడ్జెట్‌లో ఇచ్చిన నిధులు సాధారణంగా అన్ని రాష్ట్రాలకూ ఇచ్చినట్టుగానే ఇచ్చారని కమిటీ తేల్చినట్టు తెలుస్తోంది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇచ్చే విషయంలోనూ కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం.

వేదికపైనే కేటీఆర్‌ను నిలదీశా

మోడీపై కేసీఆర్ వ్యాఖ్యలు నాకు నచ్చలేదు.. : రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



నవతెలంగాణ- హైదరాబాద్ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీపై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తప్పుబట్టారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ఈ విధంగా మాట్లాడడమేంటని ప్రశ్నించారు. మోడీపై కేసీఆర్ ఉపయోగించిన పదజాలం తనకు నచ్చలేదన్నారు. ఈ అంశంపై మంత్రి కేటీఆర్‌ను తాను వేదికపై కూడా నిలదీశానని వెల్లడించారు. సీఎం కేసీఆర్ వివరణ ఇచ్చి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన ఆ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ నాలుగో వర్ధంతి సభలో పాల్గొన్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. సిద్ధాంతపరమైన వైరుధ్యాలపై చేయాల్సిన రీతిలో విమర్శలు చేస్తే.. మేమూ వినగలం, సమాధానం చెప్పగలమని అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ.. అనుచితంగా మాట్లాడడం సరికాదన్నారు. ఆదిభట్లలో 'బోయింగ్ టాటా కంపెనీ' కార్యక్రమానికి రావాలని మంత్రి కేటీఆర్ తనను ఆహ్వానించినప్పుడు మోడీపై కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యల గురించి నిలదీశానని చెప్పారు.

ప్రధానమంత్రిని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలు విన్న తరువాత బోయింగ్ కార్యక్రమంలో పాల్గొంటే బాగుండదని చెప్పానని తెలిపారు. నేను రావాలా ..? వద్దా..? అని ప్రశ్నించానన్నారు. అయితే.. 'మా నాన్న అలా మాట్లాడతారని నేను అనుకోను.' అని మంత్రి కేటీఆర్ తనతో చెబుతూ వివరంగా సమాధానం చెప్పిన తరువాతే ఈ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. ఇక్కడికి వచ్చిన తరువాత కూడా వేదికపై కేటీఆర్‌ను మరోమారు నిలదీశానని చెప్పారు. మోడీపై చేసిన వ్యాఖ్యలకు సీఎం కేసీఆర్ వివరణ ఇచ్చి ఉంటే బాగుండేది అని అన్నారు. కాగా ఇటీవల కరీంనగర్‌లో జరిగిన 'రైతు చైతన్య సమితి' సమావేశంలో పంటలకు మద్దతు ధర విషయంలో 'కేంద్రం, మోడీ గడ్డిపీకుతున్నారా.? ' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆ మరుసటి రోజు కూడా తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నానని, కేసీఆర్ ప్రకటించడం తెలిసిందే.

పులుల పరిరక్షణ ప్రాంతాలు 13శాతమే

- ఆసియాలోని 11 దేశాల్లో చేసిన సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రపంచ ప్రమాణాల పాటిస్తున్న పులుల సంరక్షణ ప్రాంతాలు 13 శాతం మాత్రమే ఉన్నాయని పరిరక్షణ హామి/ పులి ప్రామాణికత (సీఏ/టీఎస్) ఆధారంగా ఓ తాజా సర్వే వెల్లడించింది. ఆసియా వ్యాప్తంగా భారత్ సహా 11 టైగర్ రేంజ్ దేశాల్లోని 112 ప్రాంతాల్లో చేసిన సర్వే ఈ విషయాన్ని వెల్లడించింది. పులుల పరిరక్షణకు ప్రాంతాల వారీగా తొలి సారిగా చేసిన ఈ సర్వే.. అతిపెద్ద, వేగవంతమైన అంచనా. ఇప్పటి వరకు భారత్‌లోని ఉత్తరాఖండ్‌లో ఉన్న లాన్స్‌డౌన్ ఫారెస్ట్ డివిజన్, నేపాల్‌లోని చిత్వాన్ నేషనల్ పార్క్, రష్యాలోని శిఖోతే-ఆలిన్ నేచర్ రిజర్వ్‌లు పులుల సంరక్షణకు సరైన ప్రమాణాలు పాటిస్తూ సీఏ/టీఎస్ గుర్తింపును పొందినట్టు తెలిపింది. ఆసియా వ్యాప్తంగా సర్వే చేసిన 112 ప్రాంతాల్లో ప్రస్తుతం 12.5 శాతం మాత్రమే సీఏ/టీఎస్ ప్రమాణాలను పాటిస్తున్నాయని తెలిపింది. అంచనా వేసిన వాటిలో 52.5 శాతం ప్రాంతాల్లో పులుల సంరక్షణకు నిర్వహణ వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ ఇంకాస్త మెరుగుదల సాధించాల్సిన అవసరమున్నదని సర్వే స్పష్టం చేసింది. మిగతా 35 శాతం ప్రాంతాల్లో ముఖ్యంగా ఆగ్నేయాసియాలో పులుల సంరక్షణకు నిర్వహణా తీరు సరిగా లేదని తెలిపింది.

దక్షిణాసియా, తూర్పు ఆసియా దేశాలైన బంగ్లాదేశ్, భూటాన్, చైనా, భారత్, నేపాల్, రష్యాల్లో పులుల పై పర్యవేక్షణ ప్రాంతాలు 87 శాతంగా ఉన్నదనే సానుకూలాంశాన్ని సర్వే తెలిపింది. ఆగ్నేయాసియాలోని కాంబోడియా, ఇండోనేషియా, మలేసియా, మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన 61 శాతం ప్రాంతాల్లో పులుల పై పర్యవేక్షణ కొరవడిందని తెలిపింది. అక్కడ చాలా తక్కువ సిబ్బంది ఉన్నదని, సరిపడా నిధులు కేటాయించకుండా ప్రభుత్వాలు దృష్టి సారించకపోవడమే దీనికి కారణమని స్పష్టం చేసింది. కాగా సీఏ/టీఎస్ గుర్తింపు పొందిన ఉత్తరాఖండ్‌లోని లాన్స్‌డౌన్ ఫారెస్ట్ డివిజన్ భారత్‌లో మొదటిది కాగా ప్రపంచంలో మూడోది.

మదురో అభ్యర్థిత్వానికి వేలాది మంది మద్దతు

కారకాస్: ఏప్రిల్‌లో జరుగనున్న వెనిజులా అధ్యక్ష ఎన్నికలకు అభ్యర్థిగా తన పేరును అధికారికంగా నమోదు చేసుకున్న అధ్యక్షుడు నికొలస్ మదురోకు వేలాది మంది అభిమానులు, మద్దతుదారులు తమ మద్దతును ప్రకటించారు. గురువారం నాడు తన అభ్యర్థిత్వ నమోదుకు ఎన్నికల కమిషన్ కార్యాలయానికి బయల్దేరిన మదురో ముందుగా మాజీ అధ్యక్షుడు హ్యూగోఛావెజ్ స్మారక ప్రాంతాన్ని సందర్శించి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తన మద్దతుదారులనుద్దేశించి ప్రసంగిస్తూ 'మనం అజేయుడైన మన ప్రియతమ నేతకు నివాళులర్పించేందుకు అతి పవిత్రమైన ప్రదేశానికి చేరుకున్నామని, మేం విజయంతో తిరిగి వస్తామని ఆయనకు చెబుతున్నా'నని ప్రకటించారు. ఎన్నికల కమిషన్ కార్యాలయంలో తన పేరును నమోదు చేసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు వ్యతిరేకంగా పోటీ చేసేందుకు అమెరికాపై ఆధారపడుతున్న ప్రతిపక్షం దమ్ముంటే అమెరికాతో బంధాన్ని తెగతెంపులు చేసుకుని తనతో తలపడాలని సవాల్ చేశారు. కాగా ఏప్రిల్ అధ్యక్ష ఎన్నికల్లో తాము పాల్గొనబోవటం లేదని ప్రతిపక్ష డెమొక్రాటిక్ యూనిటీ రౌండ్ టేబుల్ ఇప్పటికే ప్రకటించింది. వెనిజులా ఎన్నికల ప్రక్రియ అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌తో సహా ప్రపంచ వ్యాప్తంగా పలువురు నేతల ప్రశంసలు అందుకున్నప్పటికీ అమెరికా మద్దతునిస్తున్న ప్రతిపక్షం మాత్రం ఈ నిర్ణయం తీసుకోవటం గమనార్హం.

బహుముఖ ప్రజ్ఞాశాలి

నాయుని కృష్ణమూర్తి కన్నుమూత



చిత్తూరు : ప్రముఖ రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి నాయుని కృష్ణమూర్తి (67) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన సొంతూరు చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలం నడిం చెర్ల. 1951లో జన్మించిన నాయుని కృష్ణమూర్తి ప్రముఖ తెలుగు రచయితగా, సాహితీ పరిశోధకుడిగా గుర్తింపు పొందారు. ఎన్నో పుస్తకాలను, గేయాలను రచించిన కృష్ణమూర్తి చౌడేపల్లిలో విజయవాణి విద్యాసంస్థలను స్థాపించి సాహితీ యజ్ఞాన్ని కొనసాగించారు. ఏడో తరగతి విద్యార్థుల కోసం మాబడి, 10వ తరగతి విద్యార్థుల కోసం పాఠశాల పేర్లతో ఆయన నేతృత్వంలో రూపొందిన పుస్తకాలు తెలుగునాట బహుళ ప్రాచుర్యం పొందాయి. మూడు తెలుగు, ఇంగ్లీషు నిఘంటువులకు సంకలనకర్తగా పేరు సంపాదించారు. రామాయణ, మహాభారత ఇతిహాసాలను, భాగవత పురాణాన్ని వ్యవహారిక భాషలో అందించారు. జిల్లాలో అక్షరాస్యతా ఉద్యమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహించిన అక్షర తపస్మాన్ కార్యక్రమానికి ఛైర్మన్‌గా వ్యవహరించారు. పలు సినిమాల్లో పాటలు రాసినా వంశీ దర్శకత్వంలో వచ్చిన 'మహర్షి' సినిమాలో ఆయన రచించిన 'సుమం.. ప్రతి సుమం సుమం' పాట ప్రాచుర్యం పొందింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణమూర్తి బెంగుళూరులో చికిత్స పొందుతూ గురువారం ఉదయం కన్నుమూశారు. శుక్రవారం చౌడేపల్లిలో అంత్యక్రియలు జరగనున్నాయి. నాయిని కృష్ణమూర్తి భార్యపేరు నాయిని పద్మకుమారి. పెద్ద కుమారుడు డాక్టర్ గురుశ్రీధర్. ఆయన ఎస్‌వి మెడికల్ కళాశాలలో రేడియాలజీ విభాగంలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. రెండో కుమారుడు నందకిశోర్, కోడలు శిల్ప వీరిద్దరూ శాస్త్రవేత్తలు. వీరు లండన్‌లో ఉంటున్నారు.

ప్రముఖుల నివాళి

నాయుని క్రిష్ణమూర్తి మృతదేహానికి ప్రముఖులు,గ్రామస్తులు నివాళులర్పించారు. ఆయన మృతి సాహితీ లోకానికి తీరని లోటని కలెక్టర్ ప్రద్యుమ్న ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజాశక్తి' తిరుపతి ఎడిషన్ మేనేజర్ చంద్రశేఖర్, ఎడివిటి ఎడిషన్ ఇన్‌ఛార్జీ ప్రకాష్, గుణశేఖర్ నివాళి అర్పించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటామోహన్, మురళి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హోదానే కావాలి

- ప్రత్యేక హోదాపై రాజకీయ పార్టీల సదస్సులో వక్తలు



అమరావతి : రాష్ట్రానికి హోదా రావాల్సిందేనని, అదే ఫైనలని, దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ఆందోళనలు నిర్వహించాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి సదస్సులో వక్తలు నిర్ణయించారు. హోదా విషయంలో టీడీపీ, బీజేపీ మినహా మిగిలిన రాజకీయ పక్షాలన్నీ ఐక్యంగా ఆందోళనలు నిర్వహించనున్నారు. ఐదోతేదీ నుండి ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఘోషను ఢిల్లీ పార్లమెంటుకు వినపడేలా చేయనున్నారు. గురువారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన రాజకీయ పక్షాల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ బీజేపీ చేతిలో టీడీపీ పావుగా మారిం దన్నారు. అధికారం పదవుల కోసం టీడీపీ లాలూచీ పడుతోందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

బాగీకపై వృద్ధుడి లైంగికదాడి

గర్భం దాల్చిన చిన్నారి

నవతెలంగాణ- సిటీ బ్యూరో


హైదరాబాద్‌లోని హబీబ్‌నగర్‌లో దారుణ ఘటన జరిగింది. 13 ఏండ్ల బాలికపై 76 ఏండ్ల వృద్ధుడు లైంగిక దాడి చేశారు. బాలిక గర్భం దాల్చడంతో విషయం గురువారం వెలుగులోకొచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటున్న మహమ్మద్ అబ్దుల్ వాహబ్ ఇంటి సమీపంలో నివాసముంటున్న బాలిక తల్లిదండ్రులతో ఎంతో నమ్మకంగా ఉంటూ దగ్గరయ్యాడు. ఈ క్రమంలో 8వ తరగతి చదువుతున్న బాలికను మాయమాటలు చెప్పిన వాహబ్ లోబర్చుకున్నాడు. పలుమార్లు లైంగిక దాడి చేశాడు. బాలిక ఆరు నెలల గర్భవతి కావడంతో విషయం తల్లిదండ్రులకు తెలిసింది. దాంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. తదుపరి విచారణ నిమిత్తం బాధితులను భరోసా సెంటర్‌కు పంపించారు.

గుజరాత్‌లో హోలీకి నీటికొరత



అహ్మదాబాద్: ప్రధాని మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఈ ఏడాది తీవ్రమైన నీటికొరత మధ్య హోలీ వేడుకలు గురువారం జరిగాయి. తీవ్రమైన కొరత కారణంగా హోలీలో నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వం కోరింది. రాష్ట్రంలో పెద్దవైన అహ్మదాబాద్, సూరత్ మున్సిపాలిటీలు.. హోలీ సందర్భంగా నీటిని వృథా చేయవద్దని ప్రజలను కోరాయి. హోలీని కేవలం తిలకంతోనే సరిపెట్టుకోవాలని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సూచించింది. నీటి కొరత సమస్యతో రాజ్‌పూత్‌లు, కర్ణావతి సంఘాలు హోలీని బహిష్కరించాయి. రాష్ట్రంలో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నందున వేడుకను జరుపుకోలేదని కర్ణావతి సంఘం నేత జయేశ్ మోడీ తెలిపారు. నర్మదా పరివాహక ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడితో గుజరాత్‌కు నీటి సరఫరా తొమ్మిది మిలియన్ ఎకరాల నుంచి సగానికి పడిపోయింది. అలాగే నర్మదా, కందన డ్యాం, ఇతర డ్యాంల నుంచి అహ్మదాబాద్‌కు రోజువారీ లభ్యమయ్యే వాటాలో 200 మిలియన్ లీటర్ల నీరు తగ్గే అవకాశం ఉంది. వడోదరా, రాజ్‌కోట్‌లకు లభించే రోజువారీ నీటి వాటాలో 50 మిలియన్ లీటర్ల చొప్పున కోతలు ఎదుర్కొనే అవకాశం ఉంది. అదేవిధంగా గతేడాదితో పోల్చితే దక్షిణ గుజరాత్‌లో నీటి లభ్యత 27శాతం తక్కువగా ఉంది. సర్దార్ సరోవర్ డ్యాంలో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో ఆందోళన చెందిన విజయ్‌రూపానీ ప్రభుత్వం.. రైతులు వేసవి కాల పంటలు పండించవద్దని గతనెల హెచ్చరించింది.

అమెరికా మార్కెట్‌లో గాంధీజీ లేఖ



వాషింగ్టన్: మహాత్మాగాంధీ ఏసుక్రీస్తుపై తన అభిప్రాయాన్ని తెలుపుతూ శబర్మతీ ఆశ్రమం నుంచి 1926 ఏప్రిల్ 6న అమెరికాలోని మత పెద్ద మిల్టన్ న్యూబెర్రీ ఫ్రాన్జ్‌కు రాసిన ఒక అరుదైన లేఖను సేకరించి పెన్సిల్వేనియాలోని రాబ్ కలె క్షన్ విక్రయానికి ఉంచింది. మిల్టన్ తనకు రాసిన ఒకలేఖకు జవాబుగా ఈ లేఖను పంపారు. 'మానవాళికి గొప్ప బోధకుల్లో జీసస్ ఒకరు' అని ఈ లేఖలో గాంధీజీ పేర్కొన్నారు. మతపరంగా వివిధ మతాల మధ్య సామరస్యతను, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ , జీసస్ గురించి తనకుగల నమ్మకాన్ని అంతవరకే గాంధీజీ పరిమితం చేస్తూ ఈ లేఖను రాశారు. ఇది ప్రయివేట్ సేకరణల్లో ఇది అత్యంత అరుదైన చరిత్రాత్మక లేఖ అని, ఈ ఒరిజినల్ లేఖ ప్రారంభ ధర 50వేల డాలర్లుగా రాబ్ కలెక్షన్ ఒక ప్రకటనలో పేర్కొంది.

రష్యా అమ్ముల పొదిలో అస్త్రం

శత్రు దాడులను ఎదుర్కొనేందుకు 'సర్మాట్ ఐసీబీఎం' : పుతిన్



మాస్కో : శత్రు దాడులను సమర్ధవంతంగా తిప్పిగొట్టే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం తమ అస్త్రంలో ఉన్నదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడించారు. ఖండాంతర క్షిపణుల దాడులను ఎదుర్కొనేందుకు సర్మాట్ ఐసీబీఎంను రూపొందించామని అన్నారు. దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించగా విజయవంతమైందని అన్నారు. ఫెడరల్ అసెంబ్లీ సమావేశంలో పుతిన్ మాట్లాడారు. సర్మాట్ ఐసీబీఎం గురించి వివరించారు. రష్యా సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని పరోక్షంగా ప్రయత్నిస్తున్న దేశాలకు సర్మాట్ ఐసీబీఎం ఓ హెచ్చరిక లాంటిదన్నారు. ఇతర దేశాల అంతరంగిక వ్యవహారాల్లో తామెన్నడూ తలదూర్చలేదన్నారు.

శత్రు దేశాల దాడులను సమర్ధ వంతంగా ఎదుర్కొనే పరిజ్ఞానం తమ వద్ద ఉందన్నారు. ఉత్తర, దక్షిణ ధ్రువాల్లోని ఏ ప్రాంతాన్నైనా ఢీకొనే సామర్థ్యం సర్మాట్ ఐసీబీఎంలో ఉన్నదని పుతిన్ అన్నారు. 2004లో అమెరికా దుందుడుగు వైఖరి ప్రదర్శించింది. ఈనేపథ్యంలో క్షిపణుల దాడులను ఎదుర్కొనే పరిజ్ఞానాన్ని రూపొందించే పనిలో రష్యా నిమగ్నమైంది. దక్షిణ కొరియా దేశానికి అమెరి కా అందజేసిన థాడ్ పరిజ్ఞానం కంటే మెరుగైన పరిజ్ఞానాన్ని రష్యా తాజాగా రూపొందించింది. రష్యా రూపొందించిన సర్మాట్ ఐసీబీఎం నిర్ధేషించిన లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించగలదని రక్షణ శాఖ పేర్కొన్నది.

కుర్దు తిరుగుబాటుదారులకు అమెరికా నుంచి ఆయుధాల సరఫరా : రష్యా

కుర్దు తిరుగుబాటుదారులకు అమెరికా నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రి సరఫరా అవుతున్నాయని రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ పేర్కొన్నది. సిరియా భద్రతాబలగాలకు, కుర్దు తిరుగుబాటుదారులకు మధ్య భీకర యుద్ధం కొనసాగుతన్న సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో గురువారంనాటికి మృతి చెందిన వారి సంఖ్య 731కి చేరుకుంది. వందలాది మంది గాయపడ్డారు. ఇరు వర్గాల మధ్య జరుగుతున్న పోరు కారణంగా అమాయక ప్రజలు మృతి చెందడం పట్ల ఐరాస భద్రతా మండలి ఆందోళన వ్యక్తం చేసింది. సిరియాలో 30 రోజుల కాల్పుల విరమణ పాటించాలని సభ్య దేశాలను కోరింది.

కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినట్టయితే సిరియన్లకు ఆహారం, దుస్తులు, మందులు సరఫరా చేయడానికి వీలవుతుందని తెలిపింది. అంతేగాకుండా, యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రజలు వెళ్లిపోయేం దుకు వీలవు తుందని తెలిపింది.

సిరియాలో కుర్దు తిరుగుబాటుదారుల లక్ష్యంగా టర్కీ బలగాలు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహి స్తున్నాయి. కుర్దు తిరుగుబాటుదారులపై టర్కీ ఉగ్రవాదం ముద్ర వేసింది. అయితే, ఈ కుర్దు తిరుగుబాటుదారులను అమెరికా రెచ్చగొడుతున్నట్టు రష్యా నిఘా సంస్థలు నిర్ధారించాయి. కుర్దు తిరుగుబాటుదారుల దగ్గర అధు నాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రైఫిల్స్, క్షిపణులు, రాకెట్ లాంచర్లు, తుపాకులు, మందుగుండు సామాగ్రి, గ్రెనేట్లు ఉన్నట్టు గుర్తించాయి. కుర్దు తిరుగుబాటుదారుల దగ్గర ఉన్న ఆయుధాలన్నీ అమెరికా నుంచి సరఫరా అయి నట్టు రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ ధ్రువీకరించింది. ఆఫ్రిన్ నగరంలో గతవారం జరిగిన పలు దాడుల్లో ఈ ఆయుధాల వినియోగం జరిగినట్టు పేర్కొన్నది. రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ సహాయ కార్యదర్శి అలెగ్జాండర్ వెనెడిక్టో ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

సిరియాలో జనవరి20న ఆపరేషన్ ఆలివ్ బ్రాంచ్ పేరిట టర్కీ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తోందన్నారు. కుర్దు తిరుగుబాటుదారులే లక్ష్యంగా భద్రతా బలగాలు ఈ దాడులు నిర్వహిస్తున్నాయని అన్నారు. సిరియా సరిహద్దులో 30వేల స్థావరాలు నిర్మించనున్నట్టు ట్రంప్ సర్కార్ తాజాగా జారీ చేసిన ఆదేశాలు ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించేలా ఉన్నాయని అలెగ్జాండర్ అభిప్రాయపడ్డారు.

కుర్దు తిరుగుబాటుదారులను ఈ శిబిరాల్లో నియమిస్తామంటూ అమెరికా ప్రకటించడం ఆందోళన కల్గిస్తున్నదన్నారు. ఒక పక్క సిరియాలో శాంతిస్థాపన కోసం తాము ప్రయత్నిస్తు న్నామంటూ చెబుతున్న ట్రంప్...మరోపక్క ఆయుధాలు సరఫరా చేస్తూ తిరుగుబాటుదారులను ప్రోత్సహిస్తూ ఉగ్రవాదాన్ని పెంచి పోషించేందుకు ప్రయత్నిస్తున్నారు.

రికార్డు స్థాయిలో అమ్ముడుపోయిన 'ఆఫ్రికా మోనాలిసా' పేయింటింగ్

- వేలంలో 1.68 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయినట్టు వెల్లడించిన నిర్వాహకులు



లండన్: ఫేమస్ పెయింటింగ్ 'ఆఫ్రికా మోనాలిసా' రికార్డు ధర పలికింది. లండన్‌లో గతనెల 28న జరిగిన వేలంలో ఏకంగా 1.68 మిలియన్ డాలర్లకు (రూ. 10కోట్ల 97 లక్షలు)అమ్ముడుపోయింది. చిత్రకారుడు బెన్ ఎన్వోను గీసిన అడెటుటు అదేమిల్యుయ్ అనే రాకుమారి పెయింటింగ్ ఆఫ్రికా మోనాలిసా అందరికీ సుపరిచితమే. దీన్ని అందరూ టుటుగా పిలుచుకుంటారు. అయితే 1973లో పెయింటింగ్ వేసిన కొన్ని రోజులకే ఇది మాయమైంది. నాలుగు దశాబ్దాల అనంతరం గతేడాది లండన్‌లో ఓ అపార్ట్‌మెంట్లో టుటు దర్శనమిచ్చిన విషయం తెలిసిందే. తాజా వేలంలో ఆఫ్రికా మోనాలిసా పెయింటింగ్ 2.75 లక్షల డాలర్ల నుంచి 4.13 లక్షల డాలర్ల వరకు ధర పలుకవచ్చునని నిర్వాహకులు భావించారు. కానీ నిర్వాహకులు ఊహించిన దానికంటే దాదాపు నాలుగురెట్లు అధిక ధరకు టుటు పెయింటింగ్ అమ్ముడుపోవడం గమనార్హం. రాకుమారిపై వేసిన మరో రెండు పెయింటింగ్స్ ఇప్పటికీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. ఐదు శతాబ్దాల కిందట ప్రముఖ చిత్రకారుడు లియోనార్డో డావిన్సీ కుంచె నుంచి జాలువారిన మోనాలిసా. ఎక్కడైనా అందమైన పెయింటింగ్ కనిపిస్తే మోనాలిసాతో పోల్చుతుంటారు. అదే విధంగా నైజీరియా యువరాణి టుటు పెయింటింగ్‌ను ఆఫ్రికా మోనాలిసాగా గుర్తింపు పొందింది. టుటు పోర్ట్‌రెయిట్ రికార్డు స్థాయిలో వేలంలో అమ్ముడుపోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్టు మోడ్రన్ ఆర్ట్ డైరెక్టర్ గయిల్స్ పెప్పియట్ తెలిపారు.

బ్రిటన్‌లో మంచు తుఫాను బీభత్సం



లండన్ : బ్రిటన్‌లో మంచు తుఫాను బీభత్సం సృష్టిస్తోంది. మంచు తుఫాను కారణంగా 10 మంది మృతి చెందినట్టు అధికారులు ధ్రువీకరించారు. రోడ్లపై మంచు పేరుకుపోయింది. ఫలితంగా రవాణా వ్యవస్థ స్తంభించింది. రైళ్లు రద్దయ్యాయి. విమానాశ్రయల్లోనే విమానాలు నిలిచిపోయాయి. విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఎమ్మా తుఫాను సంభవించే ప్రమాదముందని అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎమ్మా తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చలి తీవ్రత అధికంగా ఉండటంతో పలు సంస్థలు ప్రజలకు సహకరించేందుకు ముందుకొస్తున్నాయి. బ్రిస్టల్‌లో చలి తీవ్రత అధికంగా ఉంది. అక్కడ నివసించే ప్రజలకు కొంతమందికి కనీస ఇల్లు కూడా లేదు. దీన్ని గమనించిన గ్యావిన్ ఎమరీ అనే వ్యక్తి వారికోసం 'కీప్ బ్రిస్టల్ వామ్ అనే ఉద్యమాన్ని 2015లో ప్రారంభించింది. దీనిలో భాగంగా ప్రజలు తమ వద్ద ఉన్న చేతి గ్లౌజులను, టోపీలను ఒక పోల్ వద్ద వదిలి వెళ్లాలి. అంతేకాకుండా 'నేను దీన్ని పోగొట్టుకోలేదు. ఒకవేళ దీని అవసరం ఉంటే మీ వెంట తీసుకెళ్లి వెచ్చగా ఉండండి' అని రాసున్న ఒక కాగితాన్ని అక్కడ వేలాడదీయాలి. అతడి ఉద్దేశాన్ని గ్రహించిన చాలామంది ప్రజలు దానికి సంబంధించిన ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు.

ట్రంప్ సర్కార్‌కు షాక్ !

వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ హిక్స్ రాజీనామా



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ హోప్ హిక్స్ తన పదవికి రాజీనామా చేశారు. అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయం నుంచి ట్రంప్ వెంట ఉన్న హోప్ రాజీనామా సమర్పించడం వైట్‌హౌస్‌లో చాలా మందిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. హోప్ సుదీర్ఘ కాలంగా ట్రంప్‌కు సలహాదారుగా ఉంటున్నారు. ఆమె రాజీనామాకు గల కారణాలు తెలియరాలేదు.

2016 అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకున్నట్టు అమెరికా ఇంటెలిజెన్స్ విభాగం ఆరోపిస్తున్నది. ఈమేరకు ట్రంప్ ప్రచార బృందంలో పాల్గొన్న సభ్యులందరినీ హౌస్ ఇంటెలిజెన్స్ కమిటి విచారిస్తున్నది. ఈ కమిటి బుధవారం తొమ్మిది గంటల పాటు హోప్‌ను విచారించింది. ఈ విచారణ ముగిసిన మరుసటి రోజే హోప్ రాజీనామా చేయడం గమనార్హం.

ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి హోప్ సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసిస్తూ ట్రంప్ ఓ ప్రకటన విడుదల చేశారు. తాను ఆమెను ఎంతగానో కోల్పోతున్నానంటూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్ష కార్యాలయమైన ఓవల్ ఆఫీస్‌కు సంబంధించి వెస్ట్ వింగ్‌లో ఆమె కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే, రష్యా దర్యాప్తు విషయంలో తాను ఎలాంటి అబద్ధాలు చెప్పలేదని హోప్ తెలిపారు. రాబర్ట్ ముల్లర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక కౌన్సిల్ కూడా ఆమెను ప్రశ్నించింది. మాజీ మోడల్ అయిన హోప్ గతంలో ట్రంప్ కుమార్తె ఇవాంక కోసం పనిచేసేవారు. ట్రంప్ ఆమెను తన ప్రచార బృందంలోకి ఆహ్వానించేప్పటికి ఆమెకు ఎలాంటి రాజకీయ అనుభవం లేదు. ఇటీవల వైట్‌హౌస్ స్టాఫ్ సెక్రటరీగా పనిచేసిన రాబ్ పోర్టర్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాబ్ తమను శారీరకంగా, మానసికంగా వేధించేవాడని అతని మాజీ భార్యలు ఆరోపణలు చేయడంతో ఆయన రాజీనామా చేశారు. అయితే, రాబ్ పోర్టర్‌కు, హోప్‌కు మధ్య వివాహేతర సంబంధమున్నట్టు యూఎస్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి.

కాంగ్రెస్ వచ్చాక కేసీఆర్, కేటీఆర్ జైలుకే

- కేటీఆర్ నోటిని అదుపులో పెట్టుకో..
- అవినీతిపై అసెంబ్లీలో నిలదీస్తాం : విలేకర్ల సమావేశంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ టౌన్

కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక కేసీఆర్, కేటీఆర్‌లు జైలుకు పోక తప్పదని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో రాజీవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమీషన్ల పేరిట వేల కోట్ల రూపాయలు దండుకుంటున్న దోపిడీ దొంగలు కేసీఆర్, కేటీఆర్ అని ఆరోపించారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై రానున్న శాసనసభ సమావేశాల్లో ఆధారాలతో నిలదీస్తామన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని నలుగురు ఆంధ్రా కాంట్రాక్టర్లకు కట్టబెట్టి వేల కోట్ల రూపాయల కమీషన్ తీసుకున్నారని విమర్శించారు. కేవలం రూ.500 కోట్లతో జరిగే ఆప్టికల్ కేబుల్ కాంట్రాక్టును రూ.5 వేల కోట్లకు కేటీఆర్ బామ్మర్దికి అప్పజెప్పారన్నారు. దీనిలోనే ఇంటింటికీ కేబుల్ ఇచ్చే కాంట్రాక్టు అప్పగించారన్నారు. కేటీఆర్ అవినీతి కుంభకోణాలు, జీడిమెట్ల, మియాపూర్ స్కాంలను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని, ఈ విషయంపై ఈడీలకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. దొంగ పాస్‌పోర్టు, నకిలీ నోట్ల కేసులో ఉన్న నీచ చరిత్ర సీఎం కేసీఆర్‌ది అని విమర్శించారు. పెద్దవారిని తిడితే తమ పార్టీ గౌరవం పెరుగుతుందనే ఉద్దేశంతోనే కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, నోటిని అదుపులో ఉంచుకోవాలని హెచ్చరించారు. ఐటీ, పురపాలక శాఖా మంత్రిగా వ్యవహరిస్తున్న కేటీఆర్‌కు ఆ శాఖలపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. నెలకు రెండుసార్లు విదేశాలకు పోతూ, వారానికి మూడుసార్లు ఢిల్లీకెళుతూ ఏదో ఘనకార్యం చేసినట్టు అవార్డు తీసుకుంటున్నారని విమర్శించారు. బెంగళూరు, హైదరాబాద్‌లో కూడబెట్టుకుంటున్న అక్రమ సొమ్మంతా తాము అధికారంలోకొచ్చాక బయటకు తీస్తామన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి నాగారంలోని మూడు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. రౌడీ చరిత్ర కల్గిన ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి తిరగడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మంత్రికి డిపాజిట్ కూడా దక్కదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్య కేసులో త్వరలోనే ఎమ్మెల్యేలు, మంత్రులు జైలుకు పోతారన్నారు. ఈ సమావేశంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, శంకర్‌నాయక్, ఎం.ఏ.కరీం, పొదిల శ్రీనివాస్, రామకృష్ణ, కోడిరెక్క శౌరి, శ్రీనివాస్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

2ముగుతున్న మతోన్మాద చర్యలు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని

- జాతీయ మహాసభల ప్రచారం ప్రారంభం



నవతెలంగాణ- ●ూబజార్

కేంద్రంలో బీజేపీ మతోన్మాద చర్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. ఏప్రిల్ 18 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న సీపీఐ(ఎం) 22వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ఖమ్మంలో ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రీటౌన్ కార్యదర్శి తుశాకుల లింగయ్య అధ్యక్షతన జరిగిన సభలో పోతినేని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం అభివృద్ధికి 2014 విభజన చట్టంలో పొందుపర్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నాటి కాంగ్రెస్ విధానాలనే నేడు బీజేపీ అనుసరిస్తోందని విమర్శించారు. గిట్టుబాటు ధర కోసం రైతులు రోడ్లపైకి రావాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే టీమాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశామని చెప్పారు. సామాజిక సంఘాలు, వామపక్ష భావజాల పార్టీలు బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌లో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి2వైస్ ప్రిన్సిపాల్ దాడి

- భువనగిరి గురుకుల పాఠశాలలో ఘటన
- వైస్ ప్రిన్సిపాల్‌కు విద్యార్థుల దేహశుద్ధి
- ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేసిన అధికారులు

నవతెలంగాణ - కలెక్టరేట్

ఉపాధ్యాయురాలిపై వైస్ ప్రిన్సిపాల్ దాడి చేశాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. బాధితురాలి వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్‌గా జనార్ధన్‌రెడ్డి ఐదేండ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. అదే పాఠశాలకు పది రోజుల కిందట ఓ ఉపాధ్యాయురాలు బదిలీపై వచ్చారు. రోజూ మాదిరిగానే ఆమె బుధవారం రాత్రి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సందేహాలు నివృత్తి చేస్తున్నారు. ఈ క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జనార్థన్‌రెడ్డి ప్రిన్సిపాల్‌తో ఫోన్ మాట్లాడుతూ ఆమె వద్దకు వచ్చాడు. 'ఏమే, ఎవరు రమ్మన్నారు ఇక్కడికి, విద్యార్థులను అనవసరంగా డిస్టర్బ్ చేస్తున్నావు' అంటూ' దాడికి దిగాడు. విద్యార్థులు అడ్డగించినా ఆగకుండా ఉపాధ్యాయురాలిని కొట్టాడు. అది చూసి ఆగ్రహానికి గురైన విద్యార్థులు వైస్ ప్రిన్సిపాల్‌కు దేహశుద్ధి చేశారు. విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. ఈ విషయం గురించి పై అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఉపాధ్యాయురాలు తెలిపారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్‌పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ జనార్దన్‌రెడ్డి తనపై దాడి చేశాడని ఉపాధ్యాయురాలు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ చేయాలని ఆయన రీజినల్ కోఆర్డినేటర్ సక్రునాయక్‌ను ఆదేశించారు. ఉపాధ్యాయురాలే విద్యార్థులచే వైస్ ప్రిన్సిపాల్‌పై దాడి చేయించారని విచారణలో తేలింది. దీంతో ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై అన్యాయంగా దాడి చేసిన జనార్దన్‌రెడ్డిపై చర్యలు తీసుకోకుండా తనను సస్పెండ్ చేశారని ఉపాధ్యాయురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు.

క్యాన్సర్ నియంత్రణకు టాటా ట్రస్టుతో ఒప్పందం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంప్రహెన్సివ్ కాన్సర్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ కింద టాటా ట్రస్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. శంషాబాద్ నోవాటెల్ హెూటల్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పురపాలక అభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, టాటా గ్రూప్ ఛైర్మన్ రతన్ టాటా సమక్షంలో ఈ ఒప్పందంపై వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శాంతకుమారి, టాటా సంస్థ ప్రతినిధి వెంటకట్‌లు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ టాటా గ్రూప్‌తో రాష్ట్రానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో టాటా గ్రూప్ సేవలు అందిస్తుందన్నారు. 31శాతంగా ఉన్న ప్రసవాలు కేసీఆర్ కిట్ల పథకం అమలు తర్వాత 50 శాతానికి పెరిగాయన్నారు. ఆపరేషన్లు లేని ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నామని, ఉచిత కంటి పరీక్షలు చేయబోతున్నామని, ఫర్టిలిటీ కేంద్రం దేశంలో మొదటి సారిగా రాష్ట్రంలోని గాంధీ దవాఖానాలో పెట్టామని వివరించారు. అనంతరం మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఇప్పటివరకు రాష్ట్రంలో 40 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కేసీఆర్ కిట్లతో ప్రభుత్వ ఆస్పత్రులకు ఆదరణ పెరిగిందన్న కేటీఆర్.. గర్భిణీలు డెలివరికి ప్రభుత్వ ఆస్పత్రులకే వస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌ని చేపట్టామని, గ్రామీణ ప్రాంత మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌ని గుర్తించి, నివారణ చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం ఎంఎన్‌జే హాస్పిటల్ క్యాన్సర్ నివారణకు క షి చేస్తున్నదన్నారు. టాటా ట్రస్ట్ ఒప్పందంతో నాలుగు మెడికల్ కాలేజీలు, మూడు జిల్లాల్లోని వైద్యశాలలకు క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, డిజిటలైజేషన్, వ్యాధి నివారణ చికిత్స, శస్త్ర చికిత్స అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతి కుమారి వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన కార్యక్రమాల మీద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా, టాటా ట్రస్ట్ ప్రతినిధులు ట్రస్ట్ సేవల మీద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎఫ్‌డబ్ల్యూ వాకాటి కరుణ, ఎన్‌హెచ్‌ఎం సీపీఓ శ్రీనివాసరావు, ట్రస్ట్ ప్రతినిధులు వెంకట్, శ్రీనివాస్, డాక్టర్ శర్మ, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణా బోర్డు వర్కింగ్ గ్రూప్ సమావేశం

నీటి కేటాయింపులే ప్రధాన ఎజెండా



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కృష్ణా బోర్డు వర్కింగ్ గ్రూప్ సమావేశం శుక్రవారం జరగనున్నది. బోర్డు సభ్య కార్యదర్శి ఎ. పరమేశం, రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. 2017-18 నీటి సంవత్సరానికి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు నీటి కేటాయింపులు జనవరి 8 న జరిగిన బోర్డు సమావేశంలోనే జరిగినప్పటికీ తాజా అవసరాలను పరిగణలోకి తీసుకుని మళ్ళీ కేటాయింపులు చేసే అవకాశం ఉన్నది. రాబోయే కాలానికి అవసరమైన నీటి ఇండెంట్‌ను ఇవ్వాలని రెండు రాష్ట్రాలను బోర్డు ఇటీవల కోరింది. జనవరిలో జరిగిన సమావేశంలో తెలంగాణకు 50, ఏపీకి 60 టీఎంసీల నీటిని కేటాయిస్తూ బోర్డు తీర్మానించింది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి ఈ నీటిని వినియోగించుకోవాల్సి ఉన్నది. ఏపీ ఇప్పటికే 62.32 టీఎంసీల నీరు వినియోగించుకోగా తెలంగాణ 33.50 టీఎంసీల నీటిని వినియోగించుకున్నది. మరో 16.42 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు తమకు ఉన్నదని తెలంగాణ ఇంజినీర్లు వాదిస్తున్నారు. అయితే తాజా ఇండెంట్‌ల ప్రకారం దీర్ఘ, స్వల్పకాలిక నీటి కేటాయింపులు చేయాలని బోర్డు అధికారులు భావిస్తున్నారు. సాగర్, శ్రీశైలం డ్యాంలలో డెడ్ స్టోరేజీ స్థాయికి కేవలం 36.18 టీఎంసీల నీరు మాత్రమే ఉండటంతో రాబోయే వర్షాకాలం వరకూ ఈ నీటిని రెండు రాష్ట్రాలూ వినియోగించుకోవాల్సి ఉన్నది. అయితే తమకు మరో 40 టీఎంసీల నీరు కావాలని ఏపీ కృష్ణా బోర్డును కోరింది. గతంలో కేటాయించిన నీటి వాటాతో కలిపి భవిష్యత్ అవసరాలకు 30 టీఎంసీల నీరు కావాలని తెలంగాణ అధికారులు కోరనున్నట్టు తెలిసింది. కృష్ణా ప్రాజెక్టుల్లో టెలిమెట్రీల ఏర్పాటుతో పాటూ బోర్డు కార్యాలయం అమరావతికి తరలింపు వంటి అంశాలు కూడా శుక్రవారం నాటి సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నదని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

కాంగ్రెస్ రథ చక్రాల కింద నలిగిపోతారు

- టీఆర్ఎస్ నేతలకు మల్లు రవి హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రారంభించిన ప్రజా చైతన్య యాత్ర, జైత్ర యాత్రలా సాగిపోతుందని, దీంతో టీఆర్ఎస్ నేతలు ఏమి చేయాలో తోచక పిచ్చి పట్టినట్టుగా మాట్లాడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్‌కుమార్ గౌడ్, ఉజ్మా షాకీర్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్ఎస్ నాయకుల మాటల తీరు చూస్తుంటే వారు కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఎదురుకోలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని, కాంగ్రెస్ నాయకులను బాబా దొంగలు అంటూ చేస్తున్న విమర్శలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

ఆదిలాబాద్‌ను కల్లోల కాశ్మీర్ చేస్తున్న కేసీఆర్

గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, కేసీఆర్ హామీ ఇచ్చిన దాన్ని అమలు చేయకుండా గిరిజనుల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మాజీ ఎంపీ, టీపీసీసీ అధికార ప్రతినిధి రవీంద్ర నాయక్ విమర్శించారు.

గురువారం గాంధీభవన్‌లో పార్టీ నేత సూర్యానాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్‌లో సభ జరిపి మాట్లాడిన కేసీఆర్ ఆదిలాబాద్‌ను కాశ్మీర్‌లా చేస్తానని చెప్పారని ఇప్పటికే గిరిజనుల మధ్య చిచ్చు పెట్టి అల్లర్లతో ఆదిలాబాద్‌ను కల్లోల కాశ్మీర్‌లా మార్చివేశారన్నారు.

కేటీఆర్ ఓ పిచ్చికుక్క

- అధికార మదమెక్కింది: ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ ఫైర్



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

'కేటీఆర్ ఓ పిచ్చి కుక్క.. అధికార మదంతో మాట్లాడుతున్నాడు. అహంకారంతో పిచ్చి ప్రేలాపణలు చేస్తున్నాడు' అని శాసన మండలి కాంగ్రెస్ పక్ష నేత, ప్రజాచైతన్య బస్సు యాత్ర చైర్మన్ షబ్బీర్ అలీ విమర్శించారు. కాంగ్రెస్ బస్సు యాత్రనుద్దేశించి కేటీఆర్ జానా బాబా 40 దొంగలని, వాళ్లంతా కుక్కల్లా మొరుగుతున్నారని చేసిన విమర్శలపై షబ్బీర్ అలీ పైవిధంగా ఎదురుదాడి చేశారు. మార్చి 4వ తేదీన ప్రజా చైతన్య బస్సు యాత్ర నిజామాబాద్‌కు చేరుకుంటున్న సందర్భంగా కలెక్టర్ మైదానాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అంతకు ముందు కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో ఆత్మహత్య చేసుకున్న విద్యావాలెంటీర్ సుప్రజ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నోటిఫికేషన్లు వేయక పోవడం వల్లే నిరుద్యోగులు ప్రాణాలు తీసుకుం టున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నారంలో ఓ విద్యావాలెం టీర్ ఉద్యోగం సాధించలేకపోతున్నానని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. మార్చిలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నవచిత్రం



నాని, త్రివిక్రమ్

సరికొత్త కాంబినేషన్ !

తెలుగులో ఓ సరికొత్త కాంబినేషన్ తెరపైకి రాబోతున్నట్టు తెలుస్తుంది. వరుస విజయాలతో దూసుకుపోతున్న హీరో నాని తొలిసారిగా స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్‌తో పనిచేయడానికి సిద్ధమయ్యారట. ఇటీవల 'అజ్ఞాతవాసి'తో పరాజయాన్ని చవిచూసిన త్రివిక్రమ్ ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా ఓ సినిమాను రూపొందించబోతున్నారు. త్వరలో ఈ సినిమా ప్రారంభం కానుంది. ఆ తర్వాత వెంకటేష్ హీరోగా ఓ సినిమా, మహేష్ బాబుతో మరో సినిమా ఉంటుందని ఆ మధ్య వార్తలొచ్చాయి. అయితే వాటిని పక్కన పెట్టి త్రివిక్రమ్ నెక్స్ట్ సినిమాను నాని హీరోగా రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. ఇదే సెట్ అయితే డిఫరెంట్ కాంబినేషన్‌లో కచ్చితంగా ఇదొక క్రేజీ ప్రాజెక్ట్ అవుతుంది. త్రివిక్రమ్ గతంలో నితిన్ తప్ప మరే యువ హీరోలతో సినిమాలు చేయలేదు. ఎక్కువగా మహేష్‌బాబు, పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్‌లతోనే చేశారు. తొలిసారిగా ఇప్పుడు ఎన్టీఆర్‌తో చేస్తున్నారు. ప్రస్తుతం నాని 'కృష్ణార్జునయుద్ధం'లో ద్విపాత్రా భియం చేస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకుడు. ఆ తర్వాత శ్రీరామ్ ఆదిత్య రూపొందించబోతున్న మల్టీస్టారర్ చిత్రంలో నాగార్జునతో కలిసి నటించనున్నారు.

తల్లీకూతుళ్ల అనుబంధంతో..



'కణం'లో నాగశౌర్య, సాయి పల్లవి

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కణం'. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఫంక్షన్ మార్చి 5న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు ఎన్‌విఆర్ సినిమా అధినేత చెప్పారు. ఈ సినిమా గురించి సాయిపల్లవి మాట్లాడుతూ, 'ఈ చిత్రం తల్లి, కూతురికి మధ్య ఉండే భావోద్వేగాల ఆధారంగా ఉంటుంది. నేను ఏదైనా సినిమా చేస్తున్నప్పుడు అందులో నా పాత్రకి ఎలా న్యాయం చేయగలను అనేది చూసుకుంటాను. దర్శకుడు విజయ్ ఈ కథ చెప్పి, ఇందులో నేను తల్లి పాత్ర చేయాలి అని అడిగినప్పుడు ఈ పాత్రలోని ఎమోషన్స్‌ని పండించగలనా అనుకున్నాను. చిత్రంలో నా కూతురిగా కనిపించే వెరోనికాతో చాలా సమయం గడిపాను. తాను నేను నిజంగానే తల్లి, కూతుళ్ళుగా కలిసిపోయాం. అందువల్ల సినిమాలో కనిపించే ఎమోషన్స్ అన్ని చాలా సహజంగా ఉంటాయి. దర్శకుడు విజయ్ ఎంతో సహకారం అందించారు. తనకి ఏమి కావాలో స్పష్టంగా తెలిసిన దర్శకుడు ఉన్నప్పుడు మన పని సులువు అయిపోతుంది. విజయ్ ఏ సీన్‌కి ఎలాంటి ఎమోషన్ ఉంటే బావుంటుందో బాగా తెలుసు. తల్లి–కూతురి మధ్య సన్నివేశాలు కొంచెం లౌడ్‌గా ఉంటే బాగా పండుతాయి అని అనుకునేదాన్ని. కానీ విజయ్ సహజంగా ఉండాలనేవారు. ఈ విషయంలో విజయ్‌తో 'నన్ను మీరు యాక్ట్ చేయనివ్వట్లేదు' అని కూడా అనేదాన్ని (నవ్వుతూ). కానీ డబ్బింగ్ సమయంలో సినిమా చూస్తున్నప్పుడు అర్థమైంది ఆయన ఎందుకలా అనేవారో. నటిగా ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైంది. పాత్రని ఎంతో ఇష్టపడి చేశాను' అని అన్నారు. ఈ చిత్రానికి నిరవ్‌షా, శ్యామ్ సి.ఎస్.,ఎల్. జయశ్రీ, స్టంట్ సిల్వ, ఆంటోని, విజయ్, సత్య, పట్టణం రషీద్, ఎం.ఆర్.రాజకృష్ణన్, కె.మణివర్మ, రామసుబ్బు ఇతర సాంకేతిక వర్గంగా పనిచేస్తున్నారు.

భారీ మొత్తానికి !

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, పూజా హెగ్డే జంటగా శ్రీవాస్ దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. ఈ చిత్ర శాటిలైట్ రైట్స్ భారీ మొత్తానికి అమ్ముడు పోయాయి. ఆ విశేషాలను నిర్మాత అభిషేక్ నామా తెలియజేస్తూ, 'ఈ చిత్ర తెలుగు, హిందీ శాటిలైట్ రైట్స్ రూ.13.5కోట్లకు అమ్ముడు పోయాయి. జీ సంస్థ తెలుగు రైట్స్‌ను రూ.5.5కోట్లకు, హిందీ రైట్స్‌ను 8కోట్లకు దక్కించుకోవడం విశేషం. దీంతో సినిమాపై మార్కెట్ వర్గాల్లో విపరీతమైన క్రేజ్ పెరుగుతుంది. ఓ యువ హీరోకు ఈ స్థాయిలో శాటిలైట్ బిజినెస్ జరగడం ఇదే మొదటిసారి. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డేల ఫస్ట్‌లుక్‌కు విశేషమైన స్పందన లభించింది. డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. నిర్మాణ విలువల విషయంలో రాజీపడకుండా తెరకెక్కిస్తున్నాం. ఆఖరి షెడ్యూల్ కోసం త్వరలో అమెరికాకు వెళ్ళనున్నాం. అక్కడ చిత్రీకరించే కీలక సన్నివేశాలతో సినిమా చిత్రీకరణ పూర్తవుతుంది. మే 11న ప్రపంచ వ్యాప్తంగా సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. కచ్చితంగా హిట్ చిత్రంగా నిలుస్తుందన్న నమ్మకం ఉంది' అని చెప్పారు. జగపతిబాబు, శరత్ కుమార్, మీనా, వెన్నెల కిశోర్, జయప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ, రవికిషన్, అశుతోష్‌రానా, మధు గురుస్వామి, లావణ్య తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్థన్, కెమెరా: ఆర్థర్ ఎ.విల్సన్.



బెల్లంకొండ సాయి శ్రీనివాస్




సమంత

చరణ్‌తో మరోసారి

రామ్‌చరణ్, సమంత కలిసి ప్రస్తుతం 'రంగస్థలం' చిత్రంలో నటిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో చరణ్ పల్లెటూరి కుర్రాడు చిట్టిబాబుగా కనిపిస్తుండగా, సమంత పల్లెటూరి అమ్మాయి రామలక్ష్మి పాత్రలో కనువిందు చేయనుంది. ఇదిలా ఉంటే ఈ ఇద్దరు మరోసారి కలిసి జోడీ కట్టబోతున్నారట. రాజమౌళి దర్శకత్వంలో రూపొందించే మల్టీస్టారర్ చిత్రంలో ఎన్టీఆర్‌తో కలిసి చరణ్ నటించనున్నారు. ఇందులో ఎన్టీఆర్ సరసన రాశీఖన్నాను ఎంపిక చేసినట్టు తెలుస్తుంది. అలాగే చరణ్ సరసన మరోసారి సమంతను నటింప చేయాలని రాజమౌళి భావిస్తున్నారట. దాదాపు సమంతను ఫిక్స్ చేసినట్టు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. అక్టోబర్‌లో సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్ళేందుకు ప్లాన్ చేస్తున్నారు. సమంత ప్రస్తుతం 'అభిమాన్యుడు', 'మహానటి', 'యూ టర్న్', 'సూపర్ డీలక్స్' చిత్రాల్లో నటిస్తుంది. ఇందులో 'మహానటి' ఈ నెల 29, 'రంగస్థలం' ఈ నెల 30న బ్యాక్ టు బ్యాక్ రిలీజ్ కానున్నాయి.

నాపేరు సూర్య పోస్టర్ ఇంపాక్ట్



నా పేరు సూర్య నా ఇల్లు ఇండియాలో అల్లు అర్జున్

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్ జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో 'నా పేరు సూర్య– నా ఇల్లు ఇండియా' చిత్రం రూపొందుతుంది. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి పోస్టర్ ఇంపాక్ట్ పేరుతో బన్నీకి చెందిన ఓ కొత్త లుక్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'హోళి సందర్భంగా పోస్టర్ ఇంపాక్ట్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఇప్పటి విడుదలైన లుక్స్, పాటలు, టీజర్ సినిమాపై విపరీతమైన క్రేజ్‌ను పెంచుతున్నాయి. ప్రస్తుతం ఆర్‌ఎఫ్‌సీతోపాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అద్భుతమైన లొకేషన్లలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. ఇందులో అల్లు అర్జున్‌తోపాటు ముఖ్య తారాగణం అంతా పాల్గొంటుంది. ఈ నెల 14 వరకు ఈ ముఖ్యమైన షెడ్యూల్ జరుగుతుంది. ఇందులో యాక్షన్ కింగ్ అర్జున్, శరత్ కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్–శేఖర్ అద్భుతమైన బాణీలను అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను మే 4ను గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం' అని అన్నారు.

దండుపాళ్యం4లో నటించడం లేదు



రవికాలే, మకరంద్ దేశ్ పాండే, పూజా గాంధీ

'దండుపాళ్యం' చిత్రాలు ఎంతగా క్రేజ్‌ను సంతరించుకుంటున్నాయో తెలిసిందే. తాజాగా 'దండుపాళ్యం 4'ను రూపొందిస్తున్నట్టు నిర్మాత వెంకట్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి వెల్లడించారు. ఇందులో పాత ఆర్టిస్టులతోపాటు కొత్త వాళ్ళు కూడా నటించనున్నారని తెలిపారు. పూజాగాంధీ, మకరంద్ దేశ్ పాండే, రవికాలే, రవిశంకర్ పేర్లను ప్రకటించారు. లోగో పోస్టర్‌లో కూడా వారి ఫొటోలను వేశారు. కాగా 'దండుపాళ్యం4'లో తాము నటించడం లేదని ఆయా నటులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఓ వీడియోలను విడుదల చేశారు. ఇందులో పూజా గాంధీ మాట్లాడుతూ, 'నేను 'దండుపాళ్యం 4'లో నటించడం లేదు. నన్ను ఎవరూ సంప్రదించలేదు. 'దండుపాళ్యం 4' ప్రెస్‌మీట్‌లో నా అనుమతి లేకుండా నా ఫొటోలను వాడారు. నా ప్రమేయం లేకుండా ఫొటోలను ఎలా వాడుతారు' అని ఆమె ప్రశ్నించారు. 'మేం ఈ చిత్రంలో నటించడం లేదు. దీనికి సంబంధించి మాకు ఎలాంటి సమాచారం లేదు' అని మకరంద్ దేశ్ పాండే, రవికాలేలు వీడియోలో తెలిపారు.

నిధి కోసం జరిగే అన్వేషణ

ప్రభుదేవా, హన్సిక హీరోహీరోయిన్లుగా కళ్యాణ్ దర్శకత్వంలో రూపొంది ఘన విజయం సాధించిన తమిళ చిత్రం 'గులేబకావళి'ని సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రై.లి పతాకంపై మల్కాపురం శివకుమార్ అదే పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నారు. ఇందులో రేవతి శక్తివంతమైన పాత్రలో నటించారు. ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ, 'తమిళంలో ఘన విజయాన్ని సాధించిన ఈ సినిమా తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకంతో తెలుగులో విడుదల చేస్తున్నాం. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. పూర్తి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా ఉంటుంది. ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా నృత్యాలు, నటన హైలైట్‌గా ఉంటుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ నెల 16న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్ రాజ్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ మెర్విన్.



హన్సిక, ప్రభుదేవా




రాజ్ తరుణ్

ప్రేమలోని కొత్త కోణం

రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'లవర్'. రిద్ధి కుమార్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి అనీష్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్ర గురించి యూనిట్ చెబుతూ,'ప్రేమలోని కొత్త కోణాలను టచ్ చేసేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. సమీర్‌రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా నటిస్తుండగా, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోన్న ఈ సినిమాను జూన్ 14న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు' అని తెలిపింది.

రియలిస్టిక్ లవ్ స్టోరీతో ఆర్‌ఎక్స్ 100



ఆర్‌ఎక్స్ 100 ప్రీ లుక్

రామ్‌గోపాల్ వర్మ వద్ద పనిచేసిన అజయ్ భూపతి దర్శకుడిగా మారుతూ 'ఆర్ ఎక్స్ 100' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కార్తికేయ, పాయల్ రాజపుట్ హీరోహీరోయిన్లు. కె.సి.డబ్ల్యూ పతాకంపై అశోక్ రెడ్డి గుమ్మకొండ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రీలుక్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాతలు తెలియజేస్తూ, 'ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటోంది. రావు రమేష్, సింధూరపువ్వు రాంకీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హైలీ ఎమోషనల్ రియలిస్టిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక బృందం పనిచేస్తోంది. జాతీయ అవార్డు గ్రహీత ప్రవీణ్. కే.ఎల్ సినిమాకు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. తెలుగులో ఆయనకు ఇదే తొలి చిత్రం. త్వరగా చిత్రీకరణ పూర్తి చేసి వేసవిలో సినిమాను విడుదల చేస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చైతన్ భరద్వాజ్.



కైరా అద్వాని

టీమ్ ప్లేయర్‌గా ఉంటాడు..!

'మహేష్‌బాబు పెద్ద స్టార్ హీరో అయినప్పటికీ సెట్‌లో మాత్రం సూపర్ స్టార్ అనే ఫీలింగ్ ఆయనలో ఏమాత్రం కనిపించదు. చాలా సింపుల్‌గా, రిజర్వ్‌డ్‌గా ఉంటాడు. అది నాకు బాగా నచ్చింది' అని అంటోంది కైరా అద్వాని. 'ఫుగ్లీ', 'ఎం.ఎస్.ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీ' చిత్రాలతో బాలీవుడ్‌లో మెప్పించిన కైరా తెలుగులో ఎంట్రీ ఇస్తూ 'భరత్ అనే నేను'లో మహేష్ సరసన కథానాయికగా నటిస్తుంది. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర విశేషాలను కైరా పంచుకుంటూ, 'నా మొదటి చిత్రం విడుదలయ్యాక దక్షిణాది నుంచి చాలా ఆఫర్స్ వచ్చాయి. అప్పుడు నేను సిద్ధంగా లేను. మహేష్ వైఫ్ నమ్రత చాలా కాలంగా నాతో టచ్‌లో ఉన్నారు. అలా ఎట్టకేలకు 'భరత్ అనే నేను'లో నటించే అవకాశాన్ని అందుకున్నాను. సినిమాలో నేను హైదరాబాద్ అమ్మాయిగా, పోలీస్ అధికారి కూతురిగా నటించాను. ఫస్ట్‌టైమ్ తెలుగులో నటించేటప్పుడు కాస్త భయంగా అనిపించింది. డైలాగ్స్ పలకడం పెద్ద ఛాలెంజింగ్‌గా అనిపించింది. యాక్టింగ్ క్లాసుల ద్వారా భయాన్ని అదిగమించగలిగాను. భవిష్యత్‌లో డబ్బింగ్ కూడా చెప్పాలనుకుంటున్నా. మహేష్‌తో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. సెట్‌లో నాపై క్లోజప్ షాట్స్ చిత్రీకరించేటప్పుడు మహేష్ మానిటర్ వద్దకు వెళ్ళి చూసేవారు. సెట్‌లో ఒక టీమ్ ప్లేయర్‌గా ఉండేవారు. హైదరాబాద్ షూటింగ్ కోసం ఆయనతో ప్రయాణించినప్పుడు 'నా సినిమాలు ఏం చూశావ'ని అడిగారు. ఆయనతో జరిగే కన్వర్జేషన్ ఎక్కువగా సినిమాల గురించే ఉంటుంది' అని తెలిపింది. దీంతోపాటు కైరా తెలుగులో రామ్‌చరణ్ సరసన బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందే చిత్రంలో, హిందీలో 'బాంబే టాకీస్ 2'లో నటిస్తుంది.

వేలానికి శ్రీదేవి ఫేవరేట్ పెయింటింగ్

అతిలోక సుందరి శ్రీదేవి అద్భుతమైన నటినే కాదు, కళాకారిణి కూడా. ఖాళీ సమయాల్లో ఆమె పెయింటింగ్‌లు వేస్తుండేవారు. ఓ సారి సోనమ్ కపూర్ నటించిన 'సావరియా' చిత్రంలోని ఓ ఫొటో శ్రీదేవికి బాగా నచ్చిందట. దీంతో తన కుంచెతో దాన్ని అందమైన పెయింటింగ్‌గా ఆవిష్కరించారు. అంతేకాదు, పాప్‌స్టార్ మైఖేల్ జాక్సన్‌తోపాటు ఇతర బొమ్మలను కూడా గీశారు. త్వరలో మైఖేల్ జాక్సన్ చిత్ర పటాన్ని దుబాయ్‌లో వేలానికి పెట్టనున్నారు. శ్రీదేవి పెయింటింగ్‌లు చూసి 2010లో దుబాయ్‌కి చెందిన అంతర్జాతీయ ఆర్ట్ హౌస్ ఆమెను సంప్రదించింది. తన పెయింటింగ్‌లను వేలానికి పెట్టాల్సిందిగా కోరింది. కానీ అందుకు శ్రీదేవి ఒప్పుకోలేదు. వేలంలో వచ్చిన డబ్బును ఓ ఛారిటీకి విరాళంగా ఇస్తామని చెప్పడంతో తన పెయింటింగ్‌లను వేలానికి పెట్టడానికి ఆమె ఒప్పుకున్నారు. మైఖేల్ జాక్సన్ చిత్రం తన ఫేవరేట్ పెయింటింగ్ అని శ్రీదేవి తెలిపారట. ఈ చిత్రాన్ని రూ.8లక్షలకు వేలం చేయనున్నారు. ఇదిలా ఉంటే శ్రీదేవిని ఉద్దేశించి అమితాబ్ ట్వీట్ చేసిన ఓ కవిత ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది.



శ్రీదేవి వేసిన మైఖేల్ జాక్సన్ పెయింటింగ్



లంచం అడిగితే చెప్పుతో కొట్టండి: ముఖ్యమంత్రి కేసీఆర్ నిత్యం సీఎం చెబుతున్న మాటలివి..

లంచం వేధింపులు..

అధికారుల లంచం దాహానికి రైతు కుటుంబాలు బలవుతున్నాయి. ఇటీవల జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి జిల్లాల్లో భూ సమస్యలు పరిష్కరించుకోలేక అన్నదాతలు కలెక్టరేట్ల ఎదుట ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలు కండ్ల ముందు కదలాడుతుండగానే.. తాజాగా మరో దళిత రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం చేసింది. స్వయంగా కలెక్టర్ ఆదేశించినా రుణం మంజూరుకాక.. ఆర్థిక ఇబ్బందులు భరించలేక రైతు కుటుంబీకులకు ఎలుకల మందు ఇచ్చి తాను ఉరేసుకున్నాడు. దంపతులిద్దరూ మృతిచెందారు. ఇద్దరు పిల్లలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లాలోని కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది.



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు..

నవతెలంగాణ- కాసిపేట

కాసిపేట ఎస్ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం సోమగూడెం పరిధిలోని చొప్పరిపల్లి గ్రామం ఎస్సీ కుటుంబానికి చెందిన కొండగుర్ల లక్ష్మి-మారయ్యలకు శంకర్, తిరుపతి, దేవేందర్, మల్లేశ్వరి సంతానం. రెండో కొడుకైన తిరుపతి తన రెండెకరాల భూమితోపాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని ఆరేండ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాడు. సరైన లాభాల్లేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. తన పరిస్థితిని వివరిస్తూ న్యాయం కోసం కలెక్టర్‌ను ఆశ్రయించాడు. స్పందించిన కలెక్టర్ ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.5 లక్షల రుణం మంజూరయ్యేలా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అయితే లోను మంజూరు కావాలంటే రూ.20 వేలు ఇవ్వాల్సిందేనని బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలోని ఓ ఉద్యోగి డిమాండ్ చేశాడు. అప్పటికే రూ.6.50 లక్షల అప్పుల్లో కూరుకుపోయిన తిరుపతికి ఏం చేయాలో పాలుపోలేదు. మరోవైపు అప్పులిచ్చిన వారి ఒత్తిడి పెరగడంతో మానసికంగా కుంగిపోయిన అతను చావే శరణ్యమనుకున్నాడు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 27న భార్యాపిల్లలకు జ్యూస్‌లో నిద్రమాత్రలు వేశాడు. ప్రమాదమేమీ జరగకపోవడంతో మళ్లీ బుధవారం రాత్రి జ్యూస్‌లో ఎలుకల మందు కలిపాడు. పిల్లలను వేరే గదిలో పడుకోబెట్టి తలుపులు పెట్టాడు. మరో గదిలో ఉన్న భార్య భూదేవి(35) మృతిచెందింది.

అదే గదిలో తిరుపతి(38) ఉరేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున చిన్నారులు వాంతులు చేసుకున్నాక, తిరుపతి కుమారుడు శ్రీకాంత్ తలుపులు కొట్టాడు. దీన్ని గమనించిన స్థానికులు తలుపుల గెడెం తీసి బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. దంపతుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. బెల్లంపల్లి ఏసీపీ బాలుజాదవ్, మందమర్రి సీఐ రాంచందర్‌రావు విచారణ చేపట్టారు.

రుణం మంజూరైతే కొంత అప్పుకట్టేద్దామనుకున్నానని, రుణం రాలేదని, ఇక ఆత్మహత్య తప్ప మరో దారి కనిపించడం లేదని తిరుపతి సూసైడ్‌నోట్ రాసినట్టు సమాచారం.

గ్రామస్తుల రాస్తారోకో

దంపతుల ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, కుటుంబీకులు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పిల్లలకు న్యాయం చేయాలని, లంచం అడిగిన ఉద్యోగి ప్రణయ్‌పై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏసీపీ బాలుజాదవ్, మందమర్రి సీఐ రాంచందర్‌రావు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎన్‌ఎండీసీ స్టీల్ ప్లాంట్ శ్రీకారానికి తొలి అడుగు

- సెక్యూర్స్ పవర్ లింకేజీ ప్రారంభం



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని నగర్నార్‌లో నేషనల్ మినెరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ)కు చెందిన స్టీల్‌ప్లాంట్ శ్రీకారానికి తొలి అడుగుపడింది. ప్లాంట్‌లోని మెయిన్ రిసీవింగ్ సబ్‌స్టేషన్(220 కేవీ) జీఐఎస్(గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్)ను ఎన్ఐఎస్‌పీ, ఎంఈసీఓఎన్, జీఈ ఇండియా సీనియర్ అధికారుల సమక్షంలో నగర్నార్ ఐరన్ అండ్ స్టీల్ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ దాశ్ గురువారం ఆపరేషనల్ పవర్ స్విచ్‌ను ఆన్ చేసి ప్రారంభించారు. బైజేంద్ర కుమార్ (ఐఏఎస్), స్టీల్ ప్లాంట్ సీఎండీగా విధుల్లోకి చేరిన తర్వాత ఆయన అద్భుత నాయకత్వంలో వాయిదా పడిన ప్యాకేజీలన్ని చురుకుగా సాగుతున్నాయి. ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్న ఈ జీఐఎస్ విధానం సాధారణ పవర్ సబ్‌స్టేషన్ ఆక్రమించే స్థలంలో నాలుగో వంతు స్థలం మాత్రమే ఉపయోగించుకుటుంది. బస్తర్‌లో పార్చన్‌పల్‌లోని ఛత్తీస్‌గఢ్ స్టేట్ పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్(సీఎస్‌పీటీసీఎల్) సబ్‌స్టేషన్‌నుంచి జీఐఎస్ విధానంలో విద్యుత్‌ను స్వీకరించి ఇతర స్టీల్ ప్లాంట్‌లకు సరఫరా చేసేందుకు ప్లాంట్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం(పీపీడీఎస్) విధానాన్ని విధానాన్ని రూపొందించారు. 15రోజుల్లో పీపీడీఎస్ విధానం కూడా ఏర్పాటు చేయబోతున్నారు. స్టీల్ ప్లాంట్‌కు కావాల్సిన మొత్తం విద్యుత్ 296 మెగావాట్లయితే సీఎస్‌పీటీసీఎల్ నుంచి 241 మెగావాట్ల కోసం ఎన్‌ఎండీసీ ప్రతిపాదించింది. మిగతా విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేయనున్నది.

అందుబాటులోకి రానున్న నాగ్ క్షిపణులు

- ట్రయల్ పరీక్షలు పూర్తి రక్షణశాఖ



న్యూఢిల్లీ: యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్(ఏటీజీఎం) 'నాగ్' పరీక్షలు విజయవంతమైనట్టు భారత రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆ ర్‌డీవో) రూపొందించిన ఈ క్షిపణిని తాజాగా రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఎడారిలో పరీక్షించినట్టు అధికారులు తెలిపారు. రెండు వేర్వేరు లక్ష్యాలను ఛేదించేందుకు రెండు వేర్వేరు సమయాల్లో నిర్వహించిన ఈ పరీక్షలు సక్సెస్ అయినట్టు అధికారులు తెలిపారు. దీంతో, ట్రయల్ పరీక్షలు పూర్తయ్యాయని నాగ్ క్షిపణులను రక్షణశాఖకు అందుబాటులోకి తేనున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే రక్షణశాఖకు అగ్ని, పృథ్వి, నిర్భయ్, ధనుష్‌లాంటి పలు రకాల క్షిపణులు అందుబాటులో ఉన్నట్టు రక్షణవర్గాలు తెలిపాయి.

హోలీ వేడుకల్లో దళితులపై దాడి

(మొదటిపేజీ తరువాయి)



ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. దాడికి పాల్పడ్డ పండ్లరాజు, పండ్లయాదయ్య, బొర్రశివ, శేఖర్, చీకూరి శివ, పండ్ల హన్మంతులపై స్థానిక కేవీపీఎస్ నాయకులు పోలే జగన్, సుధాకర్, పరశురాం, శంకర్, ఎస్ఎఫ్ఐ నాయకుడు కురుమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు.

109శాతం పెరిగిన అదానీ సంపద



న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుల సంపద 31 శాతం పెరిగినట్టు హురున్ ప్రపంచ ధనవంతుల జాబితా-2018 వెల్లడించింది. ఈ ఏడాది 68 దేశాలకు చెందిన 2,694మందికి(2,157 కంపెనీలకు చెందినవారికి) ఈ జాబితాలో చోట్టు దక్కింది. ఆరేండ్ల క్రితం ప్రపంచ జీడీపీలో కుబేరుల వాటా 7 శాతం కాగా, ఇప్పుడది 13.2 శాతానికి పెరిగింది. జాబితాలోని కుబేరుల మొత్తం సంపద 10 లక్షల 50 వేల కోట్ల డాలర్లు. ఈసారి ఇండియా నుంచి 131మందికి చోటు లభించగా, వీరిలో 31మంది కొత్తవారు. భారత సంతతికి చెందినవారితో కలిపి చూస్తే జాబితాలో చోటు దక్కినవారి సంఖ్య 170. దేశాలవారీగా ఎక్కువమందికి చోటు దక్కినవారిలో భారత్‌కు మూడో స్థానం. 819మందితో చైనా మొదటిస్థానంలో, 571మందితో అమెరికా రెండో స్థానంలో నిలిచాయి. గతేడాది చైనా నుంచి 534మందికి, అమెరికా నుంచి 535మందికి ఈ జాబితాలో చోటు దక్కడం గమనార్హం.

భారత్ నుంచి అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ(55) సంపద ఒక్క ఏడాదిలో రెండితలైనట్టు హురున్ నివేదిక వెల్లడించింది. గౌతమ్ అదానీ సంపదను సుమారు రూ.91,245 కోట్లు(1400 కోట్ల డాలర్లు)గా హురున్ ప్రపంచ నివేదికలో తెలిపారు. ప్రపంచ కుబేరుల్లో అదానీ 98వ స్థానంలో నిలిచారు. ఒక్క ఏడాదిలోనే అదానీ సంపద 109 శాతం పెరిగినట్టు నివేదికలో పేర్కొన్నారు. హర్యానా ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సాహిత్రీ జిందాల్‌కు ప్రపంచ జాబితాలో 149వ స్థానం దక్కింది. వీరి ఆస్తి విలువ సుమారు రూ.70,400 కోట్లు(1100 కోట్ల డాలర్లు)గా లెక్క తేల్చారు. రిలయన్స్ గ్రూప్ అధినేత ముకేశ్ అంబానీ(60) సుమారు రూ.2,88,000 కోట్ల(4500 కోట్ల డాలర్లు) సంపదతో దేశంలో మొదటిస్థానంలో ప్రపంచంలో 19వ స్థానంలో నిలిచారు. ఈయన సంపద ఈ ఏడాదిలో 73 శాతం పెరిగినట్టు నివేదికలో వెల్లడైంది. ఇండియా నుంచి ఈ జాబితాలో చోటు దక్కించుకున్నవారిలో అత్యధికంగా 19మంది ఔషధ పరిశ్రమకు చెందినవారు కాగా,ఆటోమొబైల్-విడిభాగాల తయారీకి చెందినవారు 14మంది, వినియోగ ఉత్పత్తులకు చెందినవారు 11మంది ఉన్నారు.

ప్రపంచంలోనే అత్యధిక సంపద కలిగిన వ్యక్తిగా అమేజాన్ అధినేత జెఫ్‌బెజోస్ నిలిచారు. ఈయన సంపద 12,300 కోట్ల డాలర్లు. రెండో స్థానంలో 10,200 కోట్ల డాలర్లతో బెర్క్‌షైర్ హాత్‌వే అధినేత వారెన్ బఫెట్, మూడోస్థానంలో 9,000 కోట్ల డాలర్లతో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ నిలిచారు.

కొలువులు అంతంతే..

(మొదటిపేజీ తరువాయి)

పోస్టులు భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు 48,172 నియామకాలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. వాటిలో ఇప్పటి వరకు 24,682 మందికి కొలువులు వచ్చాయి. ప్రభుత్వం ప్రకటించిన పోస్టుల్లో 83,062 మందికి ఉద్యోగాలు రావాలి. అంటే 22.91 శాతం మందికే ఉద్యోగాలొచ్చాయి. ఇంకా 77.09 శాతం మందికి ఉద్యోగాలు రావాల్సి ఉంది. టీఎస్‌పీఎస్సీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు 76 నోటిఫికేషన్ల ద్వారా 30,490 ఉద్యోగాలు ప్రకటించింది. అందులో గ్రూప్-1, గురుకుల పీజీటీ కలిపి ఏడు వేల మందికే ఉద్యోగాలొచ్చాయి.

రాత పరీక్షలు నిర్వహించినా ఇంకా 23,490 ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. 8,792 ఉపాధ్యాయ పోస్టులకు రాతపరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇవి కాకుండా సింగరేణిలో 4,500 మందికి, విద్యుత్ శాఖలో 2,681 మందికి, పోలీసు శాఖలో 10,501 మంది చొప్పున మొత్తం 17,682 మందికి కొలువులొచ్చాయి.

కొలువుల భర్తీ వివరాలు

భర్తీసంస్థ	ఉద్యోగాలు
టీఎస్‌పీఎస్సీ	7,000
సింగరేణి	4,500
విద్యుత్	2,681
పోలీసు	10,501
మొత్తం	**24,682**

గ్రూప్-1, గ్రూప్-3, గ్రూప్-4 నోటిఫికేషన్ల ఊసేలేదు

తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత గ్రూప్-2 నోటిఫికేషన్ మాత్రమే విడుదలయ్యింది. అదీ కోర్టు పరిధిలోనే నానుతూనే ఉన్నది. గ్రూప్-2లో టాప్ 5 వేల మంది అభ్యర్థుల జవాబు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు హైకోర్టు న్యాయవాదులతో కమిటీని నియమించిన విషయం తెలిసిందే. గ్రూప్-2 కేసును ఈనెల 19న విచారించనున్నట్టు ప్రకటించింది. దీంతో గ్రూప్-2 నోటిఫికేషన్ వచ్చినా నియామకాలు మాత్రం చేపట్టలేదు. ఇక తెలంగాణ ఆవిర్భవించి మూడున్నరేండ్లు దాటినా గ్రూప్-1, గ్రూప్-3, గ్రూప్-4, ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ఊసేలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ తీరుపై నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

టీఎస్‌పీఎస్సీ ద్వారా విడుదలైన నోటిఫికేష్లు, పోస్టుల వివరాలు

2015	13	3,425
2016	12	2,379
2017	51	23,953
2018	7	733
మొత్తం	**76**	**30,490**

టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీకి, ఆచరణకు పొంతన లేదని వాపోతున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదం ఆధారంగానే తెలంగాణ ఆవిర్భవించింది. నీళ్ల కోసం మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు, నిధుల ఖర్చుకు ప్రత్యేక వహిస్తున్న సర్కారు నియామకాల పట్ల అశ్రద్ధ ఎందుకని యువజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నదని విమర్శలొస్తున్నాయి.

కొత్త జిల్లాల్లో సరిపోను ఉద్యోగుల్లేక అవస్థలు

కొత్త జిల్లాలు ఏర్పడినా ప్రజలకు పరిపాలనా సౌలభ్యం వచ్చిందనే పేరు తప్ప ప్రయోజనం తక్కువ అన్న విమర్శలొస్తున్నాయి. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పడినా సరిపోను ఉద్యోగుల్లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇంకోవైపు ఉన్న ఉద్యోగులపైనే పనిభారం పెరిగిందని ఉద్యోగ సంఘాలు చెప్తున్నాయి. ఒకవైపు కొత్త ఉద్యోగాలు పూర్తిస్థాయిలో భర్తీ చేయడం లేదని నిరుద్యోగులు, ఉన్న వారిపైనే భారం పడిందని ఉద్యోగులు, సకాలంలో పనులు కావడం లేదని ప్రజల్లో ఇలా అందరిలోనూ అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

పాత పది జిల్లాల్లో పనిచేసిన 41,816 మంది ఉద్యోగులను 31 జిల్లాలకు తాత్కాలిక పద్ధతిలో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. అంటే జిల్లాకు 4,181 చొప్పున పనిచేస్తున్నారు. ఆ లెక్కన కొత్తగా ఏర్పడ్డ 21 జిల్లాలకు 87,801 ఉద్యోగులు అవసరమని తెలుస్తున్నది. పాత పది జిల్లాల పరిధిలోనే సుమారు 10 వేల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. కానీ తెలంగాణ ప్రభుత్వం కొత్త జిల్లాలు, కొత్త రెవెన్యూ మండలాలు, కొత్త మండలాల కోసం 2,109 పోస్టులను మాత్రమే మంజూరు చేయడం గమనార్హం. ఉద్యోగులు సరిపోయినంత మంది ఉంటేనే ప్రజలకు సేవలు పూర్తిస్థాయిలో అందుతాయిని ఉద్యోగ సంఘాల నేతలు చెప్తున్నారు.

నిధుల కొరతే ప్రధాన సమస్య

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోస్టులను వేగవంతంగా భర్తీ చేయడానికి నిధుల కొరతే ప్రధాన సమస్యగా ఉన్నట్టు తెలుస్తున్నది. అందుకే ఉద్యోగాల భర్తీని నత్తనడకన సాగిస్తున్నట్టు అర్థమవుతున్నది. ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తే వారికి జీతాలివ్వడం ఇబ్బందిగా మారుతుందన్న అభిప్రాయం వినిపిస్తున్నది. గతనెలలో విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించలేని పరిస్థితి వచ్చింది. అదే నెలలో 9వ తేదీనాటికి చెల్లించాల్సిన దుస్థితి తలెత్తింది. అందుకే విశ్వవిద్యాలయాల్లో ప్రకటించిన 1,551 పోస్టుల భర్తీని పలు కారణాలతో ఆలస్యం చేస్తున్నట్టు సమాచారం. 2017-18 బడ్జెట్‌లో ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు, కార్యాలయాల ఖర్చులు, నిర్వహణ ఖర్చులు, వడ్డీ చెల్లింపులు, ఇతర ప్రభుత్వ హామీలు, అప్పుల కోసం 2017-18 బడ్జెట్‌లో నిర్వహణ వ్యయం కింద రూ.61,607 కోట్లు కేటాయించింది. అందులో కొత్త పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతోనే ఉద్యోగాలు త్వరగా భర్తీ చేయడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

సాయిదీక్షిత మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాలుగు రోజుల కిందటి సాయిదీక్షిత అనుమానస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం (కెవిఎస్ఎస్) పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు ప్రొఫెసర్ ఐ.తిరుమలి, గౌరవాధ్యక్షులు ఎస్.వినయకుమార్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.మౌనిక, ఎం.దశరథ్‌లు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం చెంగల్ గ్రామంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సాయిదీక్షిత అదే గ్రామానికి చెందిన ఎస్సీ యువకుడిని ప్రేమించిందని గుర్తుచేశారు. ఆ క్రమంలో కుల దురహంకార హత్య జరిగిందా? లేదా కుటుంబ సభ్యులే చంపి ఉంటారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సాయిదీక్షిత మృతిపై తక్షణం సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. రాష్ట్రంలో కులదురంకార హత్యలు రోజు రోజుకి పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని ఆరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సాయిదీక్షిత ఆత్మహత్య వెనుక గల కారణాలను అన్వేషించాలని, కారకులను వెతికి పట్టుకోవాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వం కార్మిక సంఘాలతో

సమావేశం ఏర్పాటు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

మార్చి 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మికసంఘాల నుంచి అభిప్రాయాలు సేకరించి, కార్మికుల సంక్షేమానికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. గురువారం సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ...బడ్జెట్ సమావేశాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ ఉంటే, వీటిలో 71 రంగాల జీవోల కాలపరిమితి ముగిసిందని అన్నారు. కాలపరిమితి ముగిసిన జీవోలను సవరించాలని, కార్మికుల కనీసవేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబు మాట్లాడుతూ... కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని చెప్పిన కేసీఆర్, ఇప్పటికీ ఏ ఒక్కరినీ చేయలేదని అన్నారు. హైకోర్టు పేరు చెప్పి తప్పించుకుంటున్న ముఖ్యమంత్రి, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 50లక్షల మంది అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆందోళనలు నిర్వహించాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, రాజారావు, ఎస్ రమ, కార్యదర్శులు పాలడుగు భాస్కర్, పి జయలక్ష్మి, వీఎస్‌రావు, కోటంరాజు, నిర్మల, మధు, నర్సింహారావు, కోశాధికారి వంగూరి రాములు పాల్గొన్నారు.

నేడు హోలీ..మజ్లిస్ ఆవిర్భావసభ

పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఉన్నతాధికారులు

- ముందు జాగ్రత్త చర్యగా రంగంలోకి రాపిడ్ యాక్షన్ ఫోర్సు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో శుక్రవారం ఒకే రోజున హోలీపండుగ, ఎంఐఎం పార్టీ 60 వ ఆవిర్భావ సభ జరుగుతుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులు నగరంలో పోలీసుయంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే గాక కీలకమైన ప్రాంతాల్లో అదనంగా సాయుధ పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు. మరో వైపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పరిస్థితిని అదుపు చేయడానికి సీఆర్‌పీఎఫ్ రాపిడ్ యాక్షన్ ఫోర్సును కూడా రంగంలోకి గురువారం రాత్రి దింపారు. ఈ మారు రెండు రోజుల పాటు హోలీ పండుగ వేడుకలను జరుపుకుంటుండగా, శుక్రవారం రాష్ట్ర రాజధానిలో జరుపుకుంటున్నారు. అదే సమయంలో ఎంఐఎం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకత్వం దారుసలాంలోని తమ కార్యాలయంలో పెద్ద ఎత్తున జరుపుకుంటున్నది. ఈ వేడుకలకు నగరం నలు వైపుల నుంచి తమ పార్టీ శ్రేణులు హాజరవుతున్నట్టు సమాచారం. దీంతో ఒక పక్క రాష్ట్రంలో ముఖ్యంగా నగరంలోని ప్రతి బస్తీ, కాలనీలో హోలీ వేడుకలు హోరెత్తనున్నాయి. ఈ నేపథ్యంలో తమ పార్టీ వేడుకల్లో పాల్గొనడానికి సమూహంగా తరలి వెళ్లే ఎంఐఎం పార్టీ కార్యకర్తలపై రంగులు పడితే అది వివాదానికి దారి తీసే ప్రమాదం ఉన్నదని పోలీసు ఉన్నతాధికారులకు నిఘా వర్గాలు హెచ్చరించినట్టు తెలిసింది. ముఖ్యంగా నగరం నలు వైపుల నుంచి ప్రధానంగా పాతబస్తీలోని ప్రతి డివిజన్ నుంచి కార్యకర్తలు తరలి వెళ్లే అవకాశాలు ఉండటంతో నగర పోలీసు యంగ్రాంగం మరింత అప్రమత్తంగా మెలగాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది. ప్రధానంగా ఎంఐఎం పార్టీ కేంద్ర కార్యాలయం ఉన్న పశ్చిమ మండలం , పార్టీకి బలం ఉన్న దక్షిణ మండలం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలను తీసుకున్నామని డీసీపీలు వెంకటేశ్వరరావు, సత్యనారాయణలు తెలిపారు. ఇప్పటికే ప్రతి రోడ్డుపై సీసీ కెమెరాలు ఉండటంతో పాటు అదనంగా పోలీసు బలగాలను మోహరించామని, రాపిడ్ యాక్షన్ ఫోర్సును సున్నితమైన ప్రాంతాల్లో పికెట్‌లను ఏర్పాటు చేశామని వారు తెలిపారు.



సెన్సెక్స్ ▼ 137	నిఫ్టీ ▼ 39	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
34,046	10,458	66.16	రూ. 30,192	రూ. 41,600





కోడిగుడ్లు

హైదరాబాద్	358	విజయవాడ	348
ఒక్కగుడ్డుకు	4.15	చెన్నై	397
వరంగల్	357	ముంబయి	406



వడ్డీరేట్లు పెంచిన ప్రధాన బ్యాంకులు

- సామాన్యుడిపై పెరగనున్న ఈఎంఐల భారం

న్యూఢిల్లీ: ప్రజల నడ్డి విరిచేలా దేశంలోని మూడు ప్రధాన బ్యాంకులు గురువారం కీలక నిర్ణయం తీసుకున్నాయి. దేశంలో బ్యాంకింగ్ దిగ్గజాలైన భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో (పీఎన్‌బీ) సహా అతిపెద్ద ప్రయివేటు బ్యాంక్ ఐసీఐసీఐ రుణాలపై వడ్డీరేటును పెంచుతున్నట్టుగా ప్రకటించాయి. ప్రస్తుతం ఉన్న 'నిధుల వ్యయ ఆధారిత రుణ రేటు' (ఎంసీఎల్ఆర్) 7.95 శాతం నుంచి 8.15 శాతానికి పెంచుతున్నట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. ఈ మేరకు బ్యాంక్ నుంచి నోటిఫికేషన్ వెలువడింది. మరోవైపు పీఎన్‌బీ కూడా ఎంసీఎల్ఆర్‌ను 8.30 శాతానికి సవరించినట్టుగా పేర్కొంది. గురువారం (మార్చి 1) నుంచి ఈ రేట్లు అమల్లో వచ్చాయని పీఎన్‌బీ, ఎస్‌బీఐ ప్రకటించాయి. తొలత ఈ సవరణ కొత్త రుణ గ్రహీతలకే వర్తిస్తాయని బ్యాంకులు తెలిపాయి. రుణగ్రహీతలు ఎంచుకున్న ప్లాన్ బట్టి రానున్న రోజుల్లో పాత రుణగ్రహీతలకు ఈ పెంపు వర్తించనుంది. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్ల మేర సవరించిన 8.3 శాతంగా నిర్ణయించినట్టుగా ప్రకటించింది. దీంతో రుణ గ్రహీతలపై ఈఎంఐ భారీగా పడనుంది. పెరిగిన వడ్డీ రేట్లను ఈఎంఐల రూపంలో ఖాతాదారులు భరించాల్సి ఉంటుంది. కాగా, మధ్య తరగతిపై వడ్డీ రేట్ల పెంపు తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది.

స్టాక్ మార్కెట్లలో ఆద్యంతం ఊగిసలాట



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టాలను మూటగట్టుకున్నాయి. సమీప భవిష్యత్తులో వడ్డీరేట్లు పెంచనున్నట్టుగా అమెరికా ఫెడ్ సంకేతాలివ్వడంతో వరుసగా మూడో రోజూ స్టాక్ మార్కెట్లు నష్టాల బాట పట్టాయి. దీనికి తోడు ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు ఆ తరువాత తీవ్ర ఒడిదుడుకులకు లోనయి ట్రేడింగ్ ముగిసే సమయాన్ని నష్టాలను నమోదు చేశాయి. జీడీపీ సానుకూల ప్రభావంతో ఈ ఉదయం లాభాలతో ట్రేడింగ్‌ను ఆరంభించినప్పటికీ.. అంతర్జాతీయ సంకేతాలతో మదుపర్లు అమ్మకాల వైపు మొగ్గు చూపడంతో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఫలితంగా ఆరంభ లాభాలను కోల్పోయాయి. రోజులో చాలా సేపు ఊగిసలాడిన సూచీలు చివరకు నష్టాలను మూటగట్టుకున్నాయని వారు విశ్లేషించారు. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 137 పాయింట్లు జారి 34,047 వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 34 పాయింట్లు కోల్పోయి 10,458 పాయింట్ల వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.65.20గా నిలిచింది. గురువారం ట్రేడింగ్‌లో ఎన్ఎస్ఈలో భారత్ పెట్రోలియం, కోల్ఇండియా, అరబిందో ఫార్మా, ఇండస్ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడగా.. ఐసీఐసీఐ బ్యాంక్, వేదాంతా లిమిటెడ్, జీ-ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్‌బీఐ, హిందాల్కో షేర్లు నష్టపోయాయి.

హైదరాబాద్‌లో అపాచీ ఫ్యూజ్‌లేజ్ల తయారీ

- టీబీఏఎల్‌లో కొత్త ఉత్పత్తి యూనిట్ ప్రారంభం
- దాదాపు 14000 చ.మీ. విస్తీర్ణంలో ఏర్పాటు..
- రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లోకి భారత్: నిర్మలా
- భారత్‌లో మరింత విస్తరిస్తాం: బోయింగ్




నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ దేశాల్లో రక్షణ దళాలు నమ్మకంగా వినియోగిస్తున్న 'ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్ల' కీలక విడిభాగాల తయారీకి ఇక హైదరాబాద్ కేంద్రంగా మారనుంది. టాటా అడ్వాన్స్ సిస్టమ్స్, బోయింగ్‌ల సంయుక్త సంస్థ 'టాటా బోయింగ్ ఏయిరోస్పేస్' (టీబీఏఎల్) ఆదిభట్ల ప్రధాన ప్రాంగణంలో అపాచీ హెలికాప్టర్ల ఫ్యూజ్‌లేజ్ (ప్రధాన విభాగాల) తయారీకి గాను ఏర్పాటు చేసిన యూనిట్‌ను కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె. తారాకరామారావు, టాటా సన్స్ ఎమరిటీస్ ఛైర్మన్ రతన్ టాటాలతో కలిసి ప్రారంభించారు. 14,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ తయారీ యూనిట్‌లో 350 మంది మేటి నైపుణ్యం కలిగి ఉద్యోగులు అపాచీ ఫ్యూజ్‌లేజ్‌లను తయారు చేయనున్నారు. అపాచీ హెలికాప్టర్లకు అంతార్జతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అమెరికా, భారత్‌తో పాటు దాదాపు 17 దేశాలకు చెందిన రక్షణ దళాల వారు తన నిత్యావసర ప్రయాణాలకు.. బోయింగ్ సంస్థ రూపొందించే అపాచీ హెలికాప్టర్లనే ఉపయోగిస్తుండడం విశేషం. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారమన్ మాట్లాడుతూ ఒకప్పుడు రక్షణ రంగం ఉత్పత్తలను దిగుమతి చేసుకొనే దేశంగా ఉన్న భారత్ ఇప్పుడు రక్షణ ఉత్పత్తుల ఎగుమతి స్థాయికి చేరడం ఆనందంగా ఉందని వివరించారు. భారత్ నుంచి అపాచీ ఫ్యూజ్‌లేజ్‌ల తయారీ మూలంగా రక్షణ, రక్షణ రవాణా విషయంలో మన దేశానికి మరింత మంచి గుర్తింపు లభించే అవకాశం ఉందని అన్నారు. ఫలితంగా ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులు వచ్చి తద్వారా మరింత మంది యువతకు ఉపాధి లభించే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. మేకిన్ ఇండియాలో భాగంగా టాటా-బోయింగ్ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా కాప్టర్ల విడిభాగాల తయారీని చేపట్టడం తమకు ఆనందదాయకంగా ఉందని అన్నారు.

ఇది ఆరంభం మాత్రమే..

బోయింగ్ ఇండియా సంస్థ అధ్యక్షుడు ప్రత్యూష్ కుమార్ మాట్లాడుతూ భారత భాగస్వామ్యంతో తాము మొదలుపెట్టిన భవిష్యత్ ప్రయాణంలో ఇది ఆరంభం మాత్రమేనని అన్నారు. భవిష్యత్తులో భారత్‌తో కలిసి ఏయిరోస్పేస్, రక్షణ రంగాల్లో ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగనున్నట్టుగా ఆయన వివరించారు. ఈ కొత్త తయారీ యూనిట్ నుంచి ఈ ఏడాదే తొలి ఫ్యూజ్‌లేజ్‌ను ఉత్పత్తి చేయాలని తాము నిర్ణయించామన్నారు.

నైపుణ్యత శిక్షణకు పెద్దపీట..

బోయింగ్ డిఫెన్స్, స్పేస్-సెక్యూరిటీ విభాగం అధ్యక్షురాలు లియెన్నె కారట్ మాట్లాడుతూ భారత్‌ను తమ ఉత్పత్తుల తయారీ, వ్యాపార కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మార్చుకొనేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్టుగా తెలిపారు. ఇందులో భాగంగానే ఇక్కడ తమ పెట్టుబడులను పెంచుతూ వస్తున్నామన్నారు. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా స్థానికంగా మానవ వనరుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టుగా తెలిపారు. ఇందులో భాగంగా ఇక్కడ అత్యాధునిక సాంకేతికతపై శిక్షణా ఏర్పాట్లు చేయనున్నట్టుగా వివరించారు. ఈ కార్యక్రమంలో భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్‌తో పాటు ఎంపీలు కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో పాటు టీఎస్ఐఐసీ కమిషనర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ కంపెనీలు తెలంగాణ బాట..

ఇన్నోవేషన్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని.. ఈ నేపథ్యంలోనే బోయింగ్, ఎయిర్‌బస్, యూటీసీ, సీఎఫ్ఎం వంటి ప్రతిష్టాత్మకమైన ఏయిరోస్పేస్ కంపెనీలు హైదరాబాద్‌పై ఆసక్తి కనబరుస్తున్నాయని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో డిఫెన్స్ ఉత్పత్తుల తయారీ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన మంత్రి నిర్మాలా సీతారమన్‌ను కోరారు.

'అఫెండర్స్' బిల్లుకు క్యాబినెట్ సై!

న్యూఢిల్లీ: దేశంలోని బ్యాంకింగ్‌తో సహా వివిధ ఆర్థిక సంస్థలకు వేల కోట్ల రుణాలను ఎగవేసి విదేశాలకు తరలిపోతున్న వారిని కట్టడి చేసే విషయంలో సర్కారు ఆలస్యంగానైనా కండ్లు తెరిచింది. విజయ్ మాల్యా, నీరవ్ మోడీల వంటి ఆర్థిక మోసగాళ్ల ఆగడాలను నియంత్రించి, ఇలాంటి వారికి కచ్చితంగా శిక్షలు పడేలా కొత్తగా రూపొందించిన "ది ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ బిల్లు"కు కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లు త్వరలోనే పార్లమెంట్ ముందుకు రాబోతుంది. దీని ద్వారా విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల కఠిన విచారణతో పాటు ఆస్తులను జప్తు చేసే అధికారం, అమ్మే అధికారం బ్యాంకులకు ప్రభుత్వం కల్పించనుంది. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే రూ.100 కోట్లు అంత కంటే ఎక్కువ మొత్తం బ్యాంకు మోసాలు, రుణ ఎగవేతలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాళ్లను కచ్చితంగా భారత్‌కు తిరిగి వచ్చేలా చేసి న్యాయ విచారణను కొనసాగించే వీలు కలుగనుంది. ఆస్తుల స్వాధీనం ద్వారా వారినుంచి వీలైనంత ఎక్కువ బాకీలను బ్యాంకులు తిరిగి వసూలు చేసుకొనే అవకాశం ఉంటుందని ఒక ప్రభుత్వ అధికారి తెలిపారు. బ్యాంకుల్లో జరిగే ఆడిటింగ్ మోసాలను అరికట్టేందుకు స్వతంత్ర హోదాలో పనిచేసే జాతీయ ఆర్థిక నమోదు ప్రాధికారిక సంస్థ (ఎన్ఎఫ్ఆర్ఏ)ను ఏర్పాటు చేయాలని కూడా కేంద్ర మంత్రివర్గం నిర్ణయించిందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు.

తెలంగాణలో గీతాంజలీ పార్క్ 'జప్తు'!

- పీఎన్‌బీ కేసులో పట్టుబిగుస్తున్న ఈడీ



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో (పీఎన్‌బీ) దాదాపు రూ.13 వేల కోట్ల భారీ మోసం కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీతో పాటు ప్రధానంగా అనుమానిస్తున్న గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ ఛోక్సీకి చెందిన రూ.1200కోట్ల విలువైన 41 ఆస్తులను ఈడీ జప్తు చేసింది. స్వాధీనం చేసుకున్న వాటిలో ముంబయిలోని 15 ఫ్లాట్లు, 17 కార్యాలయ ప్రాంతాలు ఉన్నాయి. కోల్‌కతాలో ఒక మాల్, అలీబాగ్‌లో నాలుగు ఎకరాల ఫామ్‌హౌస్, నాసి క్, నాగ్‌పూర్, పాన్‌వెల్, తమిళనాడులోని విల్లుపురం ప్రాంతాల్లో దాదాపు 231 ఎకరాల భూమిని ఈడీ జప్తు చేసింది. అలాగే తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో 170ఎకరాల పార్కును కూడా స్వాధీనం చేసుకుంది. దీని విలువ సుమారు రూ.500కోట్లు. ముంబయిలోని బొరివాలిలో నాలుగు ఫ్లాట్లు, శాంటా క్రూజ్‌లోని ఖేము టవర్స్‌లో మరో 9 ఫ్లాట్లు స్వాధీనం చేసుకుంది. ఈ ఆస్తులన్నింటి విలువ దాదాపు రూ.1217.2కోట్లు ఉంటుందని ఈడీ అంచనా వేస్తోంది.

సిరిసిల్లలో కరువుఛాయలు

- వేములవాడ, వీర్నపల్లిలో 25 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు
- అడుగంటుతున్న బోర్లు...ఆగమౌతున్న వరి..
- ఉత్తమాటగా ఎస్సారెస్పీ నీళ్ల హామీ

ఈ చిత్రం తంగళ్లపల్లి మండలం రామన్నపల్లెలోనిది. 24 గంటల విద్యుత్ ఇస్తున్నారన్న ఆశతో అదే గ్రామానికి చెందిన సోల ఎల్లయ్య తనకున్న ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. తీరా బోరుబావి అడుగంటుతుండటంతో చివరి మళ్లు ఎండుముఖం పడుతున్నాయి. వరిని కాపాడుకోవాలని రూ.2లక్షలకు పైగా అప్పు చేసి ఐదు బోర్లు వేయించినా ఫలితం లేకపోయింది. చేసేదేమీ లేక మూడెకరాలకుపైగా పొలాన్ని పశువుల మేతకు వదిలేశాడు. ఈ చిత్రం కోనరావుపేట మండలం వట్టిమల్ల కమ్మరిపేట తండాలోనిది. ఈ తండాలో 30 ఇండ్లు 120 మంది జనాభా ఉంది. వారి కోసం వేసిన నాలుగు బోరుబావులూ అడుగంటాయి. మినీవాటర్‌ట్యాంక్ నిరుపయోగంగా మారింది. మంచినీటి కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంటచేళ్లల్లోని బోరుబావుల వద్ద తెచ్చుకుంటున్నారు.



నవతెలంగాణ-సిరిసిల్ల

వేసవి రాకముందే రాజన్న సిరిసిల్ల జిల్లాలో కరువుఛాయలు అలుముకున్నాయి. తలాపునే మానేరు ఉన్నా.. ఇక్కడి ప్రజలకు నీరందని పరిస్థితి. జిల్లా మొత్తం మెట్ట ప్రాంతం కావడంతో సాగు, తాగునీటి అవసరాలకు బోరుబావులే దిక్కయ్యాయి. మూడేండ్లుగా ముంచుకొస్తున్న కరువుతో పాతాళగంగ అందకుండా పోతోంది. ఏడాదికేడాది 15 మీటర్లలోతుకు భూగర్భజలాలు పడిపోతుంటే వేములవాడ, వీర్నపల్లిలో ఈ సంవత్సరం ఏకంగా 25 మీటర్లలోతుకు పడిపోయాయి. 24 గంటల విద్యుత్ ఉన్నా.. బోరుబావుల్లో నీరందక చి'వరి'మళ్లన్నీ ఎండిపోతుండగా గుక్కెడు నీటి కోసం తండాలన్నీ విలవిలాడుతున్నాయి.

జిల్లాలో 13 మండలాలున్నాయి. ఒకటి మున్సిపల్, మరొకటి నగరపంచాయతీ సహా 211 గ్రామపంచాయతీలున్నాయి. జిల్లాను ఆనుకుని మానేరు నది ఉన్నా.. ఇక్కడి ప్రజలకు చుక్కనీరందడం లేదు. మానేరు ఇసుక క్వారీ కేంద్రంగా మారింది. దిగువమానేరు నుంచి సిరిసిల్ల, వేములవాడ పట్టణాలకు తాగునీరందిస్తున్నా.. అది అరకొరగానే సరిపోతోంది. రూరల్ ప్రాంతాలన్నీ బోరుబావులపైనే ఆధారపడి ఉన్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం 836.40 మిల్లీమీటర్ల కాగా గతేడాది 1068 మిల్లీమీటర్లు కురిసి 27 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది 643.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కంటే 23.5 శాతం తక్కువగా కురిసింది. భూగర్భ జలాలు అడుగంటడం వల్ల ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 66 వేలా 400 ఎకరాల వరిపైరుపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

దత్తత గ్రామాల్లోనూ తాగునీటి కష్టాలు

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే దత్తత గ్రామం రామన్నపల్లెనూ మంచినీటి కొరత వెంటాడుతోంది. నీటి కోసం రెండు వారాల క్రితం ఆ ఊరి మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. దిగొచ్చిన అధికారులు వారం క్రితం బోరుబావి తవ్వించి ఉపశమన చర్యలు చేపట్టారు. కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ దత్తత గ్రామం వీర్నపల్లి, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ దత్తతగ్రామం జిల్లెల, వేములవాడ ఎమ్మెల్యే రమేష్‌బాబు దత్తత గ్రామమైన కోనరావుపేట మండలం మామిడిపల్లిలోనూ నీటి ఎద్దడి నెలకొంది. సిరిసిల్ల పట్టణంలోని కార్మికవాడలు బివైనగర్, ఇందిరానగర్, తారకరామానగర్, వెంకంపేట, పద్మనగర్, సుందరయ్యనగర్‌లో నీటి ఎద్దడి మొదలైంది.

తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మకాలనీ, టెక్స్‌టైల్ పార్క్‌కాలనీ, జిల్లెల్ల, రామన్నపల్లె. వీర్నపల్లి మండలం వీర్నపల్లి, మద్దిమల్ల, గర్జనపెల్లి, వన్‌పెల్లి, సహా 20 గిరిజన తండాలు, కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల కమ్మరిపేట తండా, మరిమడ్ల, మామిడిపల్లి, వెంకట్రావుపేట గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఆయా గ్రామాలకు పొలాల్లోని బోరుబావులే దిక్కవుతున్నాయి. వేములవాడ పట్టణం, రుద్రండి మండలం మానాల గిరిజనతండాలు నీటి కొరతతో అల్లాడుతున్నాయి.

కొంపముంచిన ఎస్సారెస్పీ హామీ

వేములవాడ నియోజకవర్గ చెరువులను ఎస్సారెస్పీ నీటితో నింపుతామని స్థానిక ఎమ్మెల్యే సహా అధికారులు సమీక్షలు, సమావేశాలు, పర్యటనలతో హడావుడి చేశారు. ఫాజునగర్ చెరువు నింపి అక్కడి ఫీడల్‌చానల్ ద్వారా వట్టెంల, నమిలిగుండుపల్లి, నూకలమర్రి, మర్రిపల్లి మీదుగా చందుర్తి మండలంలోని పలు చెరువులు నింపుతామని చెప్పుకొచ్చారు. దీంతో ఆయా చెరువుల కిందున్న బోరుబావుల ఆధారంగా సాగుచేసుకుంటున్న రైతులు ఈసారి కొంత అధికంగా వరి వేశారు. యాసంగి మొదలైనా చుక్కనీరు రాకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. అందుకు వేములవాడ మండలం మర్రిపల్లి చెరువు కింద రమేష్ సాగు చేసిన పంటే ఉధాహరణగా చెప్పొచ్చు.

పూడిక తీయించినా ఊట లేదు : సిలివేరు జయసుధ, రామన్నపల్లె మహిళారైతు



రూ.40వేలు అప్పు చేసిన బావి లోపూడిక తీయించా. అయినా ఊట జాడలేదు. ఎకరన్నర పొలంలో వేసిన వరి ఎండిపోయింది. కరెంటున్నా.. బావిల నీళ్లు ఇంకిపోయాయి.

నీళ్లురావడం లేదు : జక్కుల నర్సయ్య, రామన్నపల్లె



నాకున్న రెండెకరాల 20 గుంట ల్లో నీళ్ల వసతి చూసి ఎకరన్నరలనే వరి వేశా. 24 గంటల కరెంటు ఉన్నా.. బోర్ల నీళ్లు చివరి మళ్లకు నీళ్లువస్తలేవు. గిప్పటికే 35 గుంటల్లో వరి ఎండిపోయింది. మిగిలింది అత్తదోరాదో తెలుస్తలేదు.

ఎక్స్‌లెన్స్ అవార్డు దరఖాస్తుల సమర్పణ గడువు 3

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఎక్స్‌లెన్స్ అవార్డు-2018 దరఖాస్తుల సమర్పణకు తుదిగడువు ఈనెల 3వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న పౌర అధికారులు (సివిల్ సర్వెంట్స్) విశిష్ట సేవలను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఎక్స్‌లెన్స్ అవార్డులను గతేడాది ఏర్పాటు చేసింది. దాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాదికి దరఖాస్తులను నాన్ యూనిఫాం అధికారుల నుంచి గతనెల 12వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపింది. దరఖాస్తుల సమర్పణ కోసం (http://texa.telangana.gov.in) ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించామని పేర్కొంది. జనరల్, ఇన్నోవేషన్, ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ అనే మూడు విభాగాల్లో వ్యక్తిగత, సమూహం, సంస్థ అనే మూడు గ్రూపులుగా అధికారులు దరఖాస్తు చేయొచ్చని సూచించింది. ఈ ఏడాదికి బాలికల విద్య, పోషణ, పాలనలో ఐటీ విని యోగం, కేసీఆర్ కిట్, భూ రికార్డుల ప్రక్షాళన, ఘన వ్యర్థాల తొలగింపు, గొర్రెల పంపిణీ వంటి ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను ఎంపిక చేశామని తెలిపింది.

గిరిజన ఉపాధ్యాయుడిది ప్రభుత్వ హత్య : టీఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భద్రాది కొత్తగూడెం జిల్లాలోని పార్కలగండి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వగ్గెల రాముది ప్రభుత్వం చేసిన హత్యని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్, మూడ్ శోభన్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ కావడం లేదనే మనస్థాపంతోనే రాము ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పడం వల్లే ఈ సంఘటన జరిగిందన్నారు. అన్ని అర్హతలుగల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సర్వీసులను ఖాళీ పోస్టులతో సంబంధం లేకుండా అందరినీ క్రమబద్ధీకరించి, గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యం అందని ద్రాక్షే!

- ఖర్చు చేసింది రూ.48.12 శాతం మాత్రమే
- కొత్త బడ్జెట్‌కు గతం కంటే రూ.3,100 కోట్లు అధికంగా ప్రతిపాదనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బడ్జెట్ సీజన్ మొదలైంది. గత బడ్జెట్లో కేటాయించిన నిధులు ఎంతవరకు ఖర్చు అయ్యాయని పరిశీలన చేసుకున్నాకే తర్వాత బడ్జెట్‌కు నిధుల కేటాయింపులు జరగాల్సి ఉంది. కానీ అవేమీ లేకుండానే మరోసారి కలల బడ్జెట్‌కు తయారు చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా, నిర్దేశించిన లక్ష్యాల కోసం ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో వైద్యఆరోగ్య రంగానికి కేటాయించిన నిధులు ఆశించిన స్థాయిలో ఖర్చుకాలేదు. 2017-18లో ప్రగతిపద్దు కింద ప్రభుత్వం రూ.2,666.08 కోట్లు కేటాయించింది. నూతన వార్షిక బడ్జెట్ సమీపిస్తున్నా ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.1,279 కోట్లేనని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగానికి ప్రగతి పద్దు 1,489.28 కోట్లు కేటాయించగా రూ.9.25 కోట్లు ఖర్చు చేశారు. అదేవిధంగా వైద్యవిద్యకు రూ.505.18 కోట్లకు గాను రూ.302 కోట్లు, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమానికి రూ.355.93 కోట్లకుగాను రూ.148 కోట్లు, వైద్య విధాన పరిషత్‌కు రూ.70.15 కోట్లకుగాను రూ.22 కోట్లు, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి రూ.13.50 కోట్లకుగాను రూ.7.42 కోట్లు, ఆయుష్‌కు రూ.34.61 కోట్లకుగాను రూ.26 కోట్లు, డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టరేట్‌కు రూ.43.84 కోట్లకుగాను రూ.26.23 కోట్లు, ఐపీఎంకు రూ.1.20 కోట్లకు గాను రూ.80 లక్షల చొప్పున అన్ని విభాగాలకు కలిపి రూ.1,279 కోట్లు ఖర్చు చేశారు. రాష్ట్రాన్ని పూర్తి ఆరోగ్య రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తామని చెబుతున్నది. ఉస్మానియా, గాంధీకి అదనంగా హైదరాబాద్ చుట్టూ మరో నాలుగు పెద్దాస్పత్రులను నిర్మిస్తామని తెలిపింది. ఇందుకుగాను ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తామని పేర్కొంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఒక్క రూపాయి కూడా విదిల్చలేదు. ఉస్మానియా ఆస్పత్రి ఖాళీ స్థలంలో ట్విన్‌టవర్స్ నిర్మించలేదు. అన్ని ఆస్పత్రుల్లో మందుల కొరత వేధిస్తున్నది. గాంధీలో మెరుగైన సేవలు, దశల వారీగా డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మఒడి కేసీఆర్ కిట్లు, ప్రసూతి శిశు ఆరోగ్యానికి కేటాయించిన రూ.659.56 కోట్లలో రూ.350 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు సమాచారం. గతంలో కంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. మరోవైపు, 2018-19 బడ్జెట్‌లో రూ.9,100 కోట్లు ఇవ్వాలని ఆ శాఖ ఆర్థికశాఖకు ప్రతిపాదనలు సమర్పించింది. గత బడ్జెట్ కంటే రూ.3100 కోట్లు ఎక్కువ. వైద్యవిద్యకు రూ.2,500 కోట్లు, హెల్త్‌అండ్‌ఫ్యామిలీ వెల్ఫేర్‌కు రూ.2,500, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు రూ.2 వేల కోట్లు, వైద్యవిధాన పరిషత్‌కు రూ.1,000 కోట్లు ప్రతిపాదనలు పంపారు. నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి, ఆయుష్, ఐపీఎంకు, డ్రగ్ కంట్రోల్ తదితర విభాగాలన్నింటికీ మరో రూ.1,100 కోట్ల కేటాయింపులు ప్రతిపాదించారు. వీటిలోనే మందులకు రూ.500 కోట్లు, ఆపరేషన్ సామాగ్రికి రూ.100 కోట్లు, భవన నిర్మాణాలు, మరమ్మతులకు రూ.500 కోట్లు చొప్పున ప్రతిపాదించినట్టు తెలిసింది.

2017-18లో కొన్ని విభాగాల ప్రగతిపద్దు (రూ.కోట్లలో)

విభాగం	2015-16	2016-17	2017-18
వైద్య, విద్య	798.95	84.87	505.18
హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్	1,218.19	1,137.69	1,489.28
డైరెక్టర్ ఆఫ్ హెల్త్	120.20	150.82	355.93
వైద్యవిధాన పరిషత్	100.00	128.98	70.15

మందులకూ నిధుల కరువు

2016-17లో మందుల కొనుగోలు కోసం ప్రభుత్వం రూ.120 కోట్లు కేటాయిస్తే... కేవలం రూ.57 కోట్లు మాత్రమే విదిల్చింది. అయితే, 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.240 కోట్లు కేటాయిస్తున్నట్టు చూపించింది. దాదాపు రెట్టింపు బడ్జెట్ కేటాయించినా గతంలో మాదిరే కాస్త అటుఇటుగా రూ.62 కోట్లు ఖర్చు చేయడం విశేషం. రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులకు 877 రకాల మందులు కొనుగోలు చేస్తుంటారు. కానీ వాటి కొనుగోలుకు సరైన స్థాయిలో నిదులు విడుదల లేకపోవడంతో ఆస్పత్రుల్లో మందుల కొరత ఏర్పడుతున్నది. ఇక సిరంజిలు, బ్యాండేజీలు వంటి వాటికి రూ.85 కోట్లు కేటాయిస్తే అందులో కేవలం రూ.11 కోట్లే విడుదల చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఉపయోగించే సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్‌రేలు, ఇతర వైద్య పరికరాల కోసం రూ.900 కోట్లు కేటాయించగా రూ.250 కోట్లు విడుదల చేశారు. మౌలిక వసతులు, భవనాల నిర్మాణాల కోసం రూ.500 కోట్లు కేటాయించగా రూ.150 కోట్లు ఖర్చు చేశారు.

మూడేండ్లలో కేటాయింపులు రూ.కోట్లలో...

సంవత్సరం	మొత్తం కేటాయింపులు	ప్రగతిపద్దు	నిర్వహణపద్దు
2014-15	4931.54	2459.27	2472.27
2016-17	5966.89	2462.84	3504.05
2017-18	5976.17	2666.08	3310.09



ఎండాకాలం వచ్చిందంటే భానుడి ఎండ తీవ్రత ఒకవైపు.. వాతావరణంలో వేడి పెరగడంతో దాడిచేసే అనారోగ్య సమస్యలు మరోవైపు బాధిస్తాయి. జ్వరాలు, వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలతో పాటు చిన్నారుల్లో చేయి, పాదం, నోటి వ్యాధి (హ్యాండ్, ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వ్యాధిని చికెన్‌ఫాక్స్ అనుకుని చాలామంది తమకు తోచిన వైద్యం చేస్తుంటారు. దాంతో పిల్లలు ఎక్కువగా అనారోగ్యం బారిన పడతారు. చేయి, పాదం, నోటి వ్యాధి (హెచ్ ఎఫ్ ఎం డి) గురించి సరైన అవగాహన ఉంటే ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవచ్చు. చిగురుటాకులా సున్నితమైన చిన్నారులను ఈ వ్యాధి బారిన పడకుండా ఎలా రక్షించుకోవచ్చో తెలుసుకుందాం..

చిన్నారులను బాధించే హ్యాండ్, ఫుట్ అండ్ మౌత్ డిసీజ్

చేయి, పాదం, నోటి వ్యాధి (హ్యాండ్, ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) అంటే ఏమిటి?

చేయి, పాదం, నోటి వ్యాధి పిల్లల్లో సర్వసాధారణంగా కనిపిస్తుంది. ఇది అంటు వ్యాధి అని చెప్పొచ్చు. దీని లక్షణాల్లో జ్వరం, నోటిలో నొప్పితో కూడిన పుండ్లు ఏర్పడతాయి. చేతుల మీద బొబ్బలు, దద్దుర్లు ఏర్పడతాయి. పిరుదుల మీద కూడా ఇవి కనబడతాయి. ఇవి అంటువ్యాధుల్లో ఎక్కువగా కనిపించే వ్యాధి. అదే జంతువుల్లో అయితే పాదం, నోటి వ్యాధితో పోలిస్తేతేడా కనిపిస్తుంది.

ఈ వ్యాధి రావడానికి కారణాలు?

ఈ వ్యాధి రావడానికి కాక్స్ సాకివైరస్ ఎ 16 అని చెప్పొచ్చు. సాధారణంగా కొన్ని అవలక్షణాలు కనిపిస్తాయి. అయినప్పటికీ హెచ్‌ఎఫ్‌ఎండి రావడానికి ఎంటరో వైరస్ లతో బాటు ఎంటరో వైరస్ 71 (ఈవీ 71) కారణంగా నిలిచింది. తీవ్ర దుష్పరిణామాలు కలగడమే కాకుండా ప్రాణాంతకం కూడా.

హెచ్‌ఎఫ్‌ఎండి ఎంతవరకు ప్రమాదకరం?

చాలామంది ఈ వ్యాధి వల్ల అనారోగ్యానికి గురయినప్పటికీ పూర్తిగా కోలుకోవచ్చు.

- హెచ్‌ఎఫ్‌ఎండి స్వల్పకాలికమైన వ్యాధి. దాదాపు అందరు రోగులు ఏడు నుంచి 10 రోజులలోపు ఎలాంటి వైద్య చికిత్స లేకుండానే కోలుకోవచ్చు. హెచ్‌ఎఫ్‌ఎండి ఇనొక్షన్ వల్ల డీ హైడ్రేషన్ ఎక్కువగా కనిపిస్తుంది. నోటిలో ఉండే పుళ్ల వల్ల ద్రవపదార్థాలను కూడా పరిమితంగానే తీసుకోవాల్సి వస్తుంది. ఎందుకంటే ఈ పదార్థాలను తీసుకునే సమయంలో బాగా ఇబ్బందిగా ఉంటుంది.
- హెచ్‌ఎఫ్‌ఎండి కారణం వల్ల ఈవీ 71 వల్ల మెనింజైటిస్ (మేథో మజ్జ వ్యాధి), ఎన్ సెఫలిటీస్ (మెదడువాపు వ్యాధి) వంటి అవలక్షణాలు వాటిల్లుతాయి. నరాలు, హృదయ సంబంధిత వ్యాధులు కూడా కలుగుతాయి. ఈవీ 71 ఎన్సెఫలిటీస్ ఒక్కోసారి ప్రాణాంతకం కావొచ్చు.

ఈ వ్యాధి వచ్చిన తర్వాత ఎటువంటి లక్షణాలు కనిపిస్తాయి?

- సాధారణంగా ఇన్ఫెక్షన్ వచ్చిన తర్వాత మూడు నుంచి ఏడు రోజులలోపు లక్షణాలు కనిపిస్తాయి.
- ఈ వ్యాధి ఆరంభంలో జ్వరం 24 గంటల నుంచి 48 గంటల వరకు ఉంటుంది.
- ఈ వ్యాధి వచ్చిన తర్వాత జ్వరం, ఆకలి మందగించడం, ఆయాసం, గొంతులో మంట ఉంటుంది.
- ఒకటి రెండు రోజులపాటు జ్వరం వచ్చిన తర్వాత నోటిలో నొప్పితో కూడుకున్న పుళ్లు ఎక్కువవుతాయి. ప్రారంభంలో ఎర్రని మచ్చలు కనిపిస్తాయి. అవి కూడా బొబ్బల మాదిరిగా కనిపిస్తాయి. తర్వాతి దశలో అల్సర్లుగా మారతాయి. అవి ఎక్కువగా నాలుక, చిగుళ్లు, దవడలోపలి భాగాల మీద కనిపిస్తాయి.
- దురద లేని చర్మ దద్దుర్లు మాత్రం ఒక రోజు నుంచి రెండు రోజుల వరకు పెరుగుతాయి. ఇవి ఎర్రగా ఉంటాయి. కొన్ని బొబ్బలు కడతాయి. అరచేతుల మీద ఈ దద్దుర్లు కనిపిస్తాయి. పిరుదులు, మర్మాంగాల మీద కూడా కనిపిస్తుంటాయి.
- హెచ్‌ఎఫ్‌ఎండి ఉన్న వ్యక్తికి పెద్దగా లక్షణాలు కనిపించవు. చర్మం మీద దద్దుర్లు ఏర్పడతాయి. నోటి పుండ్లు ఏర్పడతాయి.
- కొన్ని కేసుల్లో మాత్రం పిల్లలు కొద్దిగా అనారోగ్యానికి గురవుతారు. నరాల సంబంధిత వ్యాధులకు గురవుతుంటారు.
- మరికొంత మందిలో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారి శ్వాసకోశ సమస్యలు ఏర్పడతాయి.

హెచ్‌ఎఫ్‌ఎండి ఎలా సంక్రమిస్తుంది?





హెచ్‌ఎఫ్‌ఎండి అనేది ఒకరి నుంచి ఇంకొకరికి సంక్రమిస్తుంది. ముక్కు, గొంతు నుంచి స్రావాలు కారుతున్న వ్యక్తినితాకినప్పుడు లాలాజలం, బొబ్బల నుంచి వస్తున్న సొన (ద్రవాల) వల్ల ఇది వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన వ్యక్తి మలం ద్వారా కూడా వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధికి ప్రభావితం చెందిన వ్యక్తి మొదటి వారం అనారోగ్యానికి గురయినప్పుడు మాత్రం ఎక్కువగా వ్యాపిస్తుంది.

ఇది పెంపుడు జంతువుల నుంచి లేదా ఇతర జంతువుల నుంచి సంక్రమించదు.

హెచ్‌ఎఫ్‌ఎండి వల్ల ఎవరికి ముప్పు వాటిల్లుతుంది?

ఇంతకుమునుపు ఈ వ్యాధి సోకిన ప్రతీ ఒక్కరికి ఇన్ఫెక్షన్ ముప్పు పొంచి ఉండేది. అయితే ప్రస్తుతం వ్యాధి వచ్చిన ప్రతీ వ్యక్తికి ఇన్ఫెక్షన్ సోకుతుంది అని చెప్పలేం. పిల్లలు ఎక్కువగా ఈ ఇన్ఫెక్షన్ వల్ల అనారోగ్యానికి గురవుతారు. పెద్దల్లో తక్కువగా వస్తుంది. ఎందుకంటే పెద్దల్లో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. కౌమారదశలో, పెద్దల్లో ఈ వ్యాధి సోకే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

హెచ్ ఎఫ్ ఎండి ఒక వైరస్ కంటే ఎక్కువ వైరస్‌ల వల్ల కలుగుతుందా?

ఒక రకం ప్రత్యేక వైరస్ వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. తర్వాతి దశల్లో మాత్రం వేర్వేరు రకాల వైరస్‌లు శరీరంపై దాడి చేస్తుంటాయి.

గర్భిణీల విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు..

గర్భిణీలు హెచ్‌ఎఫ్‌ఎండి ఉన్న ఏ వ్యక్తితో దగ్గరి సంబంధాలు పెట్టుకోకూడదు. ఎంటరోవైరస్ ఇన్ఫెక్షన్స్ వల్ల గర్భిణీలు తరచుగా హెచ్ ఎఫ్‌ఎండికి గురయ్యే అవకాశం ఉంది. మెటర్నల్ ఎంటరోవైరస్ ఇన్ఫెక్షన్ వల్ల గర్భస్రావాలు, శిశువు పుట్టుకలో లోపాలు కలగవచ్చు. వ్యాధితీవ్రత ఎక్కువగా ఉండే గర్భంలోనే శిశువు మరణించవచ్చు. గర్భిణీగా ఉన్న సమయంలో ఈ వైరస్ సోకితే మాత్రం పుట్టబోయే బిడ్డకు కూడా ఈ వైరస్ సోకే ప్రమాదముంది. ఫలితంగా ప్రసవసమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి.

హెచ్‌ఎఫ్‌ఎండికి ఏ విధంగా చికిత్స చేయాలి?

ప్రస్తుతానికి హెచ్‌ఎఫ్‌ఎండికి ప్రత్యేక చికిత్స అందుబాటులో లేదు. రోగులు ఎక్కువమోతాదులో మంచినీటిని త్రాగాలి.

- జ్వరం, పుండ్లు తగ్గడానికి చికిత్స తీసుకోవాలి.

హెచ్‌ఎఫ్‌ఎండిని నిరోధించవచ్చా?

హెచ్‌ఎఫ్‌ఎండి రావడానికి నాన్ పోలియో ఎంటరో వైరస్లు కారణాలుగా నిలిచాయి. వీటిని నిరోధించడానికి వాక్సిన్లు అందుబాటులో లేవు. మంచి ఆహారపు అలవాట్ల వల్ల సరైన మందుల వాడకం వల్ల ఈ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చు.

తీసుకోవాల్సిన చర్యలు

- భోజనానికి ముందు, మలమూత్రవిసర్జనల తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఈ వ్యాధి ఈ పుండ్లు, బొబ్బలు తాకిన తర్వాత సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వంట చేసే ముందు భోజనం చేసే ముందు కూడా కడుక్కోవాలి. పిల్లలకు ఆహారం తినిపించే ముందు కూడా ఈ అలవాటు మంచిది. విసర్జన తర్వాత కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- పిల్లలు ఆడుకునే బొమ్మలు పరిశుభ్రంగా ఉండాలి. వీటిని సబ్బునీటితో శుభ్రంగా కడుక్కోవాలి. డైలూట్ సొల్యూషన్ అంటే క్లోరిన్ కంటేయినింగ్ బ్లీచ్ ద్వారా శుభ్రం చేయాలి.
- దగ్గరి సంబంధాలకు (చుంబనం, ఆలింగనం) దూరంగా ఉండాలి.
- ఆరుసంవత్సరాలలోపు పిల్లలు అనారోగ్యానికి గురైతే వారిని స్కూలుకు పంపించవద్దు. ఇతర చిన్నరులకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంటుంది. పూర్తిగా ఆరోగ్యం కుదుటపడిన తర్వాతే వారిని పాఠశాలకు పంపించాలి.
- అనారోగ్యానికి గురయిన పిల్లల ఆరోగ్యానికి వైద్య పరంగా జాగ్రత్తలు పాటించాలి. జ్వరం ఎక్కువగా ఉంటే మాత్రం చాలా జాగ్రత్త ఉండాలి.
- తుమ్ములు, దగ్గే సమయంలో ముక్కుకి, నోటికి అడ్డంగా చేతిరుమాలు పెట్టుకోవాలి.
- టిష్యూపేపర్లను వేస్ట్ బిన్లో వేసి మూసివేయాలి. దీనివల్ల ఈ వైరస్ ప్రబలదు.
- ఇళ్లు శుభ్రంగా పెట్టుకోవాలి. పిల్లల సంరక్షణా కేంద్రాలు, కిండర్ గార్డెన్ పాఠశాలలు కూడా శుభ్రంగా ఉంటేనే ఈ వ్యాధిని వ్యాప్తి చెందకుండా అరికట్టగలుగుతాం.

డాక్టర్ శ్రీకాంత్ కోనా
కన్సల్టెంట్ నియోనాటొలాజిస్ట్ అండ్
పీడియాట్రిషియన్
కాంటినెంటల్ హాస్పిటల్స్



* * * * * * * * * * * * * * * * * * * *



ఆహారాన్ని బాగా నమలాలి

ఆహారాన్ని నెమ్మదిగా, బాగా నమిలి తినాలని మన పెద్దవాళ్లు చెబుతుంటారు. ఇది మంచి ఫలితం ఇస్తు న్నట్టు శాస్త్రీయంగానూ రుజువైంది. ఆహారాన్ని బాగా నమిలి తినటం వల్ల దీనిలోని పోషకాలను శరీరం మరింత సమర్థవంతంగా గ్రహింస్తుందని వెల్లడైంది. తినేటప్పుడు ఆదరాబాదరాగా గబగబా నోట్లో ఆహారం కుక్కేసుకోకుండా కాస్త నిదానంగా నమిలి తినాలి. చిన్నా రులకు, వృద్ధులకు ఇచ్చే ఆహారం కాస్త మెత్తగా ఉంటే మంచిది. మెత్తగా ఉంటే ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. జీర్ణక్రియ సాఫీగా జరిగితే అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు రావు.

డిప్రెషన్ దరిచేరదు


కర్పూరం అనగానే... పూజ తో ఉపయో గించే పదార్థం అని చాలా మంది అనుకుం టారు. ఈ అపోహ నిజం కాదు.. కర్పూరాన్ని అనేక రకాల లోషన్స్, సబ్బులు, క్రీముల తయారీ లోనూ ఉపయోగిస్తారు.

ఇది ఒక చెట్టు (లారెల్‌ఉడ్)కాండం తయారుచేసే పదార్థం. ఇది శరీరానికి ఆరోగ్య పరంగానూ ఎంతో ఉపయోగ పడుతుంది. యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, అనాల్‌జెసిక్ వంటి గుణాలు కర్పూరానికి ఉన్నాయి. కండరాలు నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్ గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. పలు రకాల ఇన్‌ఫెక్షన్లు నయమవుతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.ఇది నేరుగా చర్మానికి తాకితే చర్మం ఇరిటేట్ అవుంది. దీన్ని ఉపయోగించడం తెలిస్తే.. ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు దీంతో పొందవచ్చు.



- చిన్నపాటి క్లాత్ బ్యాగ్‌లో కొన్ని కర్పూరం బిళ్లలను వేయాలి. ఆ తర్వాత బ్యాగ్‌ను మూట కట్టి దాన్ని నిద్రించే చోట ఉంచాలి. దీంతో నిద్ర బాగా పడుతుంది.
- రక్త సరఫరా మెరుగు పడుతుంది. గ్యాస్ సంబంధ సమస్యలు తొలగిపోతాయి.
- జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగుపడి.. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది.
- మలబద్ధకం, అసిడిటీ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు తొలుగుతాయి.
- శరీర జీవక్రియలు సక్రమంగా జరుగుతాయి.
- నరాల సంబంధ వ్యాధులతో బాధపడేవారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.
- ఎల్లప్పుడూ ఉత్తేజంగా ఉంటారు. డిప్రెషన్ దరి చేరదు.

పోషకాల 'విత్తనాలు'



ఎండాకాలంలో దప్పిక తీర్చి.. వేడి నుంచి రక్షించే ఖర్బూజా గురించి మనందరికీ తెలుసు. సేదతీర్చే ఈ పండులోని ఎర్రని గుజ్జును మాత్రం తిని నల్లని విత్తనాలను వృద్ధాగా పడేస్తారు. కానీ, ఈ విత్తనాల్లో అధిక స్థాయి లో అమినోయాసిడ్లు, ప్రొటీన్, బి విటమిన్లు, నియాసిన్, మెగ్నీషియం, జింక్, కాపర్, పొటా షియం, మాంగనీస్, ఐరన్, కాపర్ ఉంటాయి. అంతేకాదు ఇవి యాంటీ ఆక్సిడెంట్లుగా పని చేస్తాయి.

వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్ల ఉంటాయి. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ బేసిక్ అండ్ అప్లైడ్ సైన్సెస్‌లో వచ్చిన పరిశోధన ఫలితాలు ఈ విత్తనాలు టైప్ 2 డయాబెటిస్ ను నియంత్రిస్తాయన్న వెల్లడిస్తున్నాయి.

- ★ ఖర్బుజా విత్తనాలలో ఉండే మెగ్నీషియం గుండె ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఈ విత్తనాలను తింటే రక్తపోటు అదుపులో ఉంటుంది.
- ★ ఇందులోని ఐరన్, విటమిన్ బి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.
- ★ ఈ విత్తనాలు డయాబెటిస్‌ను అదుపులో ఉంచేందుకు ఎంతో ఉపకరి స్తాయి. శరీరంలో గ్లైకోజెన్ ను నిల్వలు పేరుకోనివ్వకుండా అడ్డుపడుతుంది.
- ★ ఖర్బూజా విత్తనాలలో ఉండే మెగ్నీషియం జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. కడుపులో యాసిడ్స్ ఏర్పడకుండా నివారించడంతో పాటు తీసుకున్న ఆహారంలోని పోషకాలను గ్రహించే ఎంజైములను ఆక్టివేట్ చేస్తుంది.
- ★ వీటిలో పాటు ఈ విత్తనాలలోని జింక్, మాంగనీస్ పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థను మెరుగుపరుస్తుంది. మగవారిలో వీర్యకణాల ఉత్పత్తిని, నాణ్యతను పెంచి సంతాన సాఫల్యతకు తోడ్పడుతాయి.
- ★ వీటిలో ఉండే మెగ్నీషియం హార్మోన్లను సమతుల్యం చేసి, శరీర కణాల పనితీరును మెరుగుపరుస్తుంది. చర్మముడతలు కూడా పడకుండా నివారించి, ఫ్రీ రాడికల్స్ నుంచి చర్మాన్ని కాపాడుతుంది. అంతేకాదు జ్ఞాపకశక్తిని, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, ఈ గింజలను తరచుగా తింటే అల్జీమర్స్ వ్యాధిని నయమవుతుందని ప్రముఖ అమెరికన్ అధ్యయనంలో స్పష్టమైంది.

* * * * * * * * * * * * * * * * * * * *



మసక వెలుతురులో చదివితే..!

పరీక్షల కాలం మొదలైంది. రాత్రిపగలు తేడా లేకుండా విద్యార్థులు పుస్తకాలతో.. కంప్యూటర్లతో కుస్తీ పడుతున్నారు. ఈ సమయంలో కంటికే ఎక్కువ శ్రమ కలుగుతుంది. మరి ఇలాంటి సమయంలో కంటి జాగ్రత్తల గురించి చాలామంది సలహాలు, సూచనలు ఇస్తుంటారు. మరి ఏ విధమైన జాగ్రత్తలు తీసుకుంటే కంటికి మంచిదో తెలుసుకుందాం..

- ❖ తక్కువ వెలుతురులో చదివితే చూపు తగ్గిపోతుందని పెద్దలు హెచ్చరిస్తుంటారు. ఇది కొంతవరకు నిజమే.. మసక వెలుతురులో చదివితే కండ్లు చాలా త్వరగా అలసిపోతాయి. ఎక్కువ సేపు చదవలేరు. కండ్లు త్వరగా అలసిపోకుండా ఉండాలంటే వెలుతురు నేరుగా పుస్తకం మీద పడేలా లైటును అమర్చుకోవాలి.
- ❖ ఎక్కువసేపు కంప్యూటర్ ముందు కూచోవాల్సి వస్తే మధ్య మధ్యలో కాసేపు విరామం తీసుకోవటం మంచిది. అలాగే తరచుగా కంటి రెప్పలను ఆడిస్తుండాలనే విషయాన్ని మరవరాదు. దీంతో కళ్లు పొడిబారకుండా చూసుకోవచ్చు.
- ❖ కళ్లద్దాలు లేదా కాంటాక్ట్ లెన్సులను రోజంతా పెట్టుకోవటం మంచిది కాదని, దీంతో కళ్లు వాటికి అలవాటు పడిపోతాయన్న అనుమానం చాలామందిలో ఉంటుంది. ఇది నిజం కాదు.. దూరదృష్టి, దగ్గరి ద ష్టిలో లోపాలు ఉన్నవారు డాక్టర్లు సిఫారసు చేసిన కళ్లద్దాలు లేదా లెన్సులు తప్పకుండా వాడుకోవాలి.
- ❖ పెరిగే పిల్లల్లో కంటి అద్దాల పవర్ మారుతుంటుంది. రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలి. డాక్టర్ సూచించిన కంటద్దాలు పెట్టుకోక పోతే కండ్లు ఒత్తిడికి లోనవుతాయి. కళ్లద్దాల పవర్‌లో తేడాలు వస్తే.. కండ్లపై ఒత్తిడి పెరిగి తలనొప్పి వస్తుంది. కండ్ల మంట, తలనొప్పి సమస్యలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. కళ్లద్దాల పవర్ చెక్ చేయించుకోవాలి.
- ❖ ఈ జాగ్రత్తలతో పాటు తీసుకునే ఆహారంలోనూ కొన్ని మార్పులు చేసుకోవాలి. కంటికి మేలు చేసే ఆహారాన్ని రోజువారి డైట్‌లో చేర్చు కోవాలి. క్యారెట్‌లోని విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి తోడ్పడుతుంది. క్యారెట్‌తో పాటు పాలు, ఛీజ్, గుడ్డులోని పచ్చసొన వంటి వాటిల్లోనూ విటమిన్ ఎ ఉంటుంది. తాజా పండ్లు, ఆకుకూరల్లో విటమిన్ సి, విటమిన్ ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు పెద్దమొత్తంలో ఉంటాయి. కంటి సమస్యల తీవ్రతను ఇవి తగ్గిస్తాయి.
- ❖ కంటికి మేలు చేసే ఆహారంతో పాటు కండ్లకు వ్యాయామం ఎంతో అవసరం. కంటి వ్యాయామాలతో కంటి కండరాలు బలోపేతం అవుతాయి. ప్రతి అరగంటకు ఒకసారి ఒక నిమిషం పాటు కండ్లు మూసుకుని విశ్రాంతి తీసుకోవాలి. ప్రతి గంటకు ఒకసారి కంటిలోని నల్లగుడ్డును అటుఇటూపదిసార్లు, పైకికిందికి పదిసార్లు తిప్పాలి. దీంతో కంటిపై ఒత్తిడి తగ్గుతుంది.
- ❖ కండ్లు అలసిపోయినట్టు అనిపిస్తే..అరచేతులను కాసేపు రుద్దుకొని ఆ తర్వాత చేతులతో కండ్లు మూసుకోవాలి. కండ్లపై అరచేతులను ఉంచి.. గట్టిగా శ్వాస తీసుకొని వదలాలి. ఇలా 5–10 నిమిషాల సేపు చేస్తే కళ్ల అలసట చాలావరకు తగ్గుతుంది.
- ❖ కండ్లు మంటగా ఉంటే ఫ్రిజ్‌లోని టమాట, కీరదోస చక్రాల్లా కట్‌చేసి వాటిని కంటిపై ఐదు నిమిషాల పాటు ఉంచుకోవాలి. గంటల తరబడి చదువుతున్నప్పుడు ప్రతి గంటకు ఒకసారి చల్లనీటిలో ముఖం కడుక్కోవాలి.
- ❖ చూపు మసకబారటం, కంటి నొప్పి, మిరుమిట్లు గొలిపే కాంతులు మెరవటం వంటి లక్షణాలు కనబడితే వెంటనే డాక్టరును సంప్రదించాలి.

ఇయర్ బడ్స్ వాడుతున్నారా ?

మనవ శరీరంలోని అత్యంత సున్నితమైన భాగాల్లో చెవి అంతర్గత భాగం ఒకటి. ఇక్కడ అత్యంత సున్నితమైన ఎన్నో రకాల నరాలు, నాడులు ఉంటాయి. వాటికి ఏవిధమైన దెబ్బ తగిలినా.. ఏదైనా తాకినా వినికిడి కోల్పోయే ప్రమాదం ఉంది. కొన్ని సార్లు వినికిడి సమస్య రాకపోయినా.. ఇన్ఫెక్షన్లు రావడమో, చెవి సంబంధ మైన అనారోగ్య సమ స్యలు రావడమో జరుగుతుంది. చెవి లోపలి భాగాలు శుభ్రం చేసే సమయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి. చాలామంది కాటన్ ఇయర్ బడ్స్‌తో చెవిని శుభ్రం చేస్తుంటారు. ఎలా పడితే అలా చెవిలో పుల్లలు, పినీసులు, కాటన్ ఇయర్ బడ్స్ పెట్టి చెవిలోని వ్యర్థాన్ని బయటకు తీసే ప్రయత్నం చేయడం చెవిని హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



చెవుల్లో కాటన్ ఇయర్ బడ్స్ పెట్టి అటు ఇటూ తిప్పడం వల్ల ఇంగ్లండ్‌లో ఏటా 7 వేల మందికి చెవి సంబంధ అనారోగ్యాలు కలుగుతున్నాయట. ఈ బడ్స్‌ను ఉపయోగించడం వల్ల చెవిలోని అంతర్గత భాగాలు డ్యామేజ్ అవుతాయని వైద్యులు చెబుతున్నారు. చెవిలో ఉండే గులిమిని తీయడం కోసం ఒకవేళ కాటన్ బడ్ పెడితే ఆ గులిమిని మరింత లోపలికి నెడుతుందట. దీని వల్ల ఇయర్ కెనాల్‌కు అడ్డంకి ఏర్పడుతుందట. దీంతో వినికిడి సమస్యలు వస్తాయని నిపుణులు అంటున్నారు.

చెవుల్లో గులిమి ఏర్పడడం సహజసిద్ధమైన ప్రక్రియ, చెవిలో అంతర్గతంగా ఉండే కొన్ని గ్రంథులు గులిమిని స్రవిస్తాయని నిపుణులు చెప్తున్నారు. ఇది సాధారణ స్థాయిలో ఉంటే చెవిలో ఎలాంటి అనారోగ్యం రాదట.. అంతేకాదు గులిమిలో ఉండే యాంటీ బాక్టీరియల్ గుణాలు శరీర రోగ నిరోధక వ్యవస్థకు సహకరిస్తాయని వారు వివరిస్తున్నారు. సహజసిద్ధమైన ప్రక్రియ ద్వారా చెవులను శుభ్రంగా ఉంచడంలో భాగంగానే గులిమి తయారవుతుందట. ఇది సహజంగా కొన్ని రోజులకు దానంతట అదే పోతుందట. అంతేకానీ దాన్ని తీయడం కోసం కాటన్ బడ్స్‌ను వాడకూడదని చెబుతున్నారు వైద్యులు.

ఆసియా అయోమయం!

ఈ ఏడాదిలో జరగాల్సిన రెండు ఆసియా క్రికెట్ టోర్నీలపై గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఆసియా ఎమర్జింగ్ నేషన్స్ కప్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. ఏప్రిల్‌లో జరిగే ఈ టోర్నీకి భారత జట్టును పంపబోమని బీసీసీఐ తెగేసి చెప్పింది. దీంతో ఆతిథ్య పాకిస్థాన్ ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉంది. ఇక సెప్టెంబర్‌లో భారత్‌లో జరగనున్న ఆసియా కప్‌కు పాక్ ఆటగాళ్లకు వీసా లభిస్తుందా లేదా అనే అనుమానాలు రోజు రోజుకూ ఎక్కువవుతున్నాయి. ఎందుకంటే ఏప్రిల్‌లో కోల్‌కతలో జరిగే ఐసీసీ వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు పీసీబీ అధ్యక్షుడు నజీం సేథీ వీసా విషయంలోనే పేచీ నడిచేటట్టు తెలుస్తోంది. ఒక వేళ వీసా దక్కకుంటే, ఇప్పించాల్సిన బాధ్యత ఐసీసీదేనని సేథి పేర్కొన్నాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు సైతం బాస్‌గా కొనసాగుతున్న నజీం సేథి త్వరలోనే కొలంబో సమావేశంలో ఆసియా టోర్నీలపై తుది నిర్ణయం తీసుకోనున్నాడు. ఎమర్జింగ్ నేషన్స్ కప్‌ను బంగ్లాదేశ్, శ్రీలంకలకు తరలించినా.. ఆసియా కప్‌పై ఏం నిర్ణయిస్తారో చూడాలి.





వినేశ్ వెండి మెరుపులు

● సంగీత, హర్‌ప్రీత్, రాజేంద్రలకు కాంస్యాలు ● ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్

న్యూఢిల్లీ : గ్లాస్గో కామన్‌వెల్త్ స్వర్ణ విజేత వినేశ్ ఫోగట్ ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో రజత పతకం సాధించింది. గురువారం జరిగిన 50 కిలోల విభాగపు టైటిల్ పోరులో 2–3తో చైనా రెజ్లర్ చున్‌లీ చేతిలో వినేశ్ ఓడింది. తొలి బౌట్‌ను 0–1తో ఆరంభించిన వినేశ్ ఆ తర్వాత పుంజుకుని రెండు పాయింట్లు సాధించి 2–1తో ఆధిక్యంలో నిలిచింది. అయితే మరో రెండు నిమిషాల్లో పోరు ముగుస్తుందనగా చున్‌లీ రెండు కీలక పాయింట్లు నెగ్గింది. ఉత్కంటపోరులో చివరివరకు వినేశ్ ప్రయత్నించినా మరో పాయింట్ దక్కకపోవటంతో రజతంతో సరిపెట్టుకున్నది. అంతకు ముందు జరిగిన సెమీ ఫైనల్స్‌లో వినేశ్.. యుకి ఇరీ (జపాన్)ను 5–4తో మట్టికరిపించింది. 4–4తో స్కోరు సమమైన వేళ ఆఖరు నిమిషంలో అద్భుత రీతిలో పాయింట్ కొల్లగొట్టింది. గతేడాది ఆసియా చాంపియన్‌షిప్స్‌లోనూ వెండి పతకం నెగ్గిన వినేశ్ ఫోగట్‌కు ఇది మూడో రజతం. 2015లో దోహాలో జరిగిన పోటీల్లోనూ ఆమె రజతం గెలుపొందింది.

ఇక ఆసియా బరిలో మరో మహిళా రెజ్లర్ సంగీత 59 కిలోల విభాగంలో కాంస్యం నెగ్గింది. కొరియా రెజ్లర్ జీయున్ ఉమ్‌పై కాంస్య పోరులో గెలుపొందింది. గ్రెకో–రోమన్ విభాగంలో పురుష రెజ్లర్లు హర్‌ప్రీత్ సింగ్, రాజేంద్ర కుమార్‌లు సైతం కాంస్య పతకాలు సాధించారు. 82 కిలోల విభాగంలో ఖాషింబెకోవ్ (ఉజ్బెకిస్థాన్)పై 11–3తో సునాయస విజయం సాధించాడు హర్‌ప్రీత్. రాజేంద్ర కుమార్ మరో ఉజ్బెకిస్థాన్ రెజ్లర్ మిరాక్‌మెదోవ్‌పై గెలుపొందాడు. 3–3తో స్కోరు సమమైనా, బిందు పాయింట్ల లెక్కన 55 కిలోల విభాగంలో కాంస్యం సొంతం చేసుకున్నాడు. భారత రెజ్లర్లు మనీశ్ (67 కిలోలు), కుల్దీప్ (72 కిలోలు) తమ విభాగపు కాంస్య పోరుల్లో ఓడి మెడల్స్ చేజార్చుకున్నారు.

● పారా స్విమ్మర్‌పై మూడేండ్లు వేటు



న్యూఢిల్లీ : సీనియర్ పారా స్విమ్మర్ ప్రశాంత్ కర్మాకర్‌పై భారత పారాలింపిక్ కమిటీ మూడేండ్ల నిషేధం విధించింది. గతేడాది జైపూర్‌లో జరిగిన జాతీయ చాంపియన్‌షిప్స్ పోటీల్లో సహచర మహిళా అథ్లెట్లు స్విమ్మింగ్ చేస్తుంటే ప్రశాంత్ వీడియోలు తీశాడు. విచారణలో ఇది నిర్ధారణ కావడంతో అతడి అసభ్య ప్రవర్తనకు శిక్షగా మూడేండ్ల వేటు పడింది. 2001లో అర్జున అవార్డు అందుకున్న ప్రశాంత్.. ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన ఏకైక భారత అథ్లెట్.

● పాండ్య.. బ్యాటింగ్‌పై దృష్టి పెట్టు

మాజీ భారత కెప్టెన్ కపిల్ దేవ్

న్యూఢిల్లీ : హార్దిక్ పాండ్య మెరుగైన ఆల్‌రౌండర్ అవ్వాలంటే బ్యాటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని మాజీ భారత కెప్టెన్ కపిల్ దేవ్ అన్నారు. సఫారీ పర్యటనలో తొలి టెస్టులో 93 పరుగులు చేయటం మినహా మిగతా అన్ని ఫార్మాట్ల మ్యాచుల్లోనూ పాండ్య విఫలమయ్యాడు. 'పాండ్య ఓ మెరుపు మెరిశాడు. ప్రతిభ గల ఆటగాడతను. ఇతరులతో పోల్చిచూడటం వల్ల, భారీ అంచనాలుండటంతో ఒత్తిడికి లోనవుతున్నాడు. ఆల్‌రౌండర్‌గా తన బాధ్యతను నిర్వర్తించాలంటే అతడు బ్యాటింగ్ సాధన చేయాలి. బౌలింగ్‌లో ఫర్వాలేదు. బ్యాటింగ్‌లో రాణిస్తే అతను ఉత్తమ ఆల్‌రౌండర్ కాగలడు' అని కపిల్ దేవ్ వివరించారు.

● భారీ స్కోరు దిశగా ఆస్ట్రేలియా

డర్బన్ : సారథి స్టీవ్ స్మిత్ (56), ఓపెనర్ డెవిడ్ వార్నర్ (51) అర్ధ శతకాలతో రాణించటంతో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో కంగారూలు భారీ స్కోరు దిశగా దూసుకెళ్తున్నారు. తొలి రోజు వెలుతురు లేమి కారణంగా 76 ఓవర్ల ఆట మాత్రమే సాగగా ఐదు వికెట్ల నష్టానికి ఆస్ట్రేలియా 225 పరుగులు చేసింది. షాన్ మార్ష్ (40) రాణించాడు. మిచెల్ స్టార్క్ (32 బ్యాటింగ్), టిమ్ పైనే (21 బ్యాటింగ్) క్రీజులో కొనసాగుతున్నారు. సఫారీ బౌలర్లలో కేశవ్ మహరాజ్, వెర్నన్ ఫిలాండర్ చెరో రెండు.. కగిసో రబాడా ఒక వికెట్ పడగొట్టారు.

గోల్డ్‌కోస్ట్‌లో గోల్డే గురిపెట్టండి

షూటర్లకు అంజలి భగవత్ సూచన



న్యూఢిల్లీ : గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ గేమ్స్ షూటింగ్‌లో భారత షూటర్లు స్వర్ణంపైనే గురి పెట్టాలని వెటరన్ షూటర్ అంజలి భగవత్ అన్నారు. అంతర్జాతీయ షూటింగ్‌లో తనదైన ముద్ర వేసిన భారత్ ప్రతిష్టను ప్రస్తుత షూటర్లు మరింత ఇనుమడింపజేయాలని అన్నారు. తాజా పోటీల్లో పాల్గొనబోయే షూటర్లు తమ నాణ్యతను పెంచుకోవాలని ఆమె సూచించారు. గతేడాది కామన్‌వెల్త్ పతక విజేతలు పూజ ఘట్కర్, అంజుమ్ మౌద్గిల్‌లను ఆమె ఉదహరించారు. 'విదేశీ షూటర్లు ఏటికేడాది మెరుగవుతున్నారు. మన షూటర్లు సైతం ఆ స్థాయి ప్రదర్శన చేయాలన్నదే నా ఆకాంక్ష. మనం నైపుణ్యత, ఏకాగ్రత మీద దృష్టి పెడితే పతకాలు అవే వస్తాయి. గత కామన్‌వెల్త్ క్రీడల్లో షూటింగ్‌లో భారత్‌దే ఆధిపత్యం. కానీ ప్రస్తుతం సింగపూర్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ తదితర దేశాల షూటర్లూ రాణిస్తున్నారు. గోల్డ్‌కోస్ట్‌లో మనోళ్ల అంచనాలు అందుకోవాలి. ప్రత్యేకించి భారత్ ఎప్పుడూ పతకాలు నెగ్గే ఎయిర్ గన్ ఈవెంట్లలో షూటర్లు తప్పక పతకం సాధించాలి. ప్రణాళిక బద్ధమైన సిద్ధపాటు షూటర్ల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.' అని అంజలి తెలిపారు.



మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ గురువారం పంజాబ్ పోలీస్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు



పతకాలు రావాలి కానీ, ప్రాక్టీస్ చేసేందుకు మైదానాన్ని ఇవ్వరు. అథ్లెట్ల కోసం పైసా ఖర్చు పెట్టరు కానీ, కాసులు తీసుకొని లీగ్‌లకు మైదానాలను అప్పగించేస్తారు. క్రీడా శాఖకు తొలిసారి ఓ క్రీడాకారుడు మంత్రిగా వచ్చాడనే ఆనందం.. అంతలోనే ఆవిరైంది. రోజువారీ సాధనకు అథ్లెట్లను సాయ్ మైదానాల్లోకి అడుగుపెట్టనీయకుండా.. రిలయన్స్ గ్రూప్ భాగస్వామ్యంలో నడుస్తోన్న ఫుట్‌బాల్ లీగ్ ఐఎస్‌ఎల్‌కు స్టేడియాలను అప్పగించారు. దీంతో ప్రాక్టీస్‌కు ఎక్కడికి వెళ్లాలో తెలియక అథ్లెట్స్ దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు.

ఆటలు కాదు కాసులే ముఖ్యం

- **స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వైఖరి ఇది**
- **స్టేడియాలను లీగ్‌లకు అప్పగిస్తున్న వైనం**
- **అథ్లెటిక్స్ పట్ల అంతులేని నిర్లక్ష్యం**

నవతెలంగాణ-క్రీడావిభాగం

బెంగళూర్‌లోని కఠీరవ స్టేడియం. భారత ట్రాక్ అండ్ ఫీల్డ్‌కు ఆణిముత్యాలను అందించిన సాయ్ స్టేడియం. భారత్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌కు అథ్లెట్లను అందించిన ఘనత దీని సొంతం. అనుభవజ్ఞులైన కోచ్‌లు, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడుతున్న అథ్లెట్లు అందరూ ఇక్కడే సాధన చేస్తుండటంతో సహజంగానే ఇది అథ్లెటిక్స్ హబ్‌గా మారింది!. దీంతో ఈ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అద్భుతమైన ట్రాక్‌లు సైతం సిద్ధమయ్యాయి. కానీ రిలయన్స్ సంస్థ భాగస్వామిగా ఉన్న ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) రాకతో ఫుట్‌బాల్‌కు ప్రాచుర్యం సంగతేమో కానీ అథ్లెట్లు సాధన చేసేందుకు స్టేడియాలు కరువయ్యాయి. ఐఎస్‌ఎల్ ఫ్రాంచైజీలకు స్టేడియాలను సీజన్ వారీగా లీజుకు ఇచ్చేస్తోన్న భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్)... అథ్లెట్లను స్టేడియం లోపలికి అడుగుపెట్టనీయటం లేదు. అథ్లెట్లు ప్రాక్టీస్‌కు రాకుండా చేసేందుకు ఏకంగా స్టేడియానికి తాళాలు వేసిన ఘనత సాయ్‌కే దక్కింది. మరికొన్ని మాసాల్లో కామన్‌వెల్త్, ఆసియా గేమ్స్ జరుగనున్న నేపథ్యంలో సాయ్ కాసుల కక్కుర్తిపై తీవ్ర విమర్శలు రేకెత్తుతున్నాయి. అయినా, సాయ్ మాత్రం పైసలొచ్చే మార్గంపైనే మమకారం పెంచుకున్నది కానీ పతకాలు తెచ్చే క్రీడాకారులను పట్టించుకునే పరిస్థితిలో లేకపోవటం దురదృష్టకరం.

కాసులు కుమ్మరిస్తున్నారు

సాయ్ స్టేడియాలు సహజంగా అంతర్జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం అవుతున్న వారికి నిలయాలు. కానీ ఇటీవల సాయ్ తన పద్ధతి మార్చుకున్నట్టు కనిపిస్తోంది. అథ్లెట్లను కాదని ఫుట్‌బాల్ లీగ్‌కు ప్రాధాన్యం ఇవ్వటం వెనుక కాసుల కక్కుర్తే ప్రధాన కారణంగా తెలుస్తోంది. స్టేడియాల నిర్వహణ కోసం కార్పోరేట్ కంపెనీలకు సాయ్ మైదానాలను అప్పగిస్తామని చెప్పిన మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోర్ ఆచరణలో భిన్నంగా కనిపిస్తున్నాడు. ఇండియన్ సూపర్ లీగ్ ప్రతినిధి చెప్పిన వివరాలు ప్రకారం ఐఎస్‌ఎల్ ఫ్రాంచైజీలు స్టేడియాల కోసం భారీ మొత్తంలో ఫీజు చెల్లిస్తున్నాయి. ఢిల్లీ డైనమోస్ రూ. 1.2 కోట్లు, చెన్నైయిన్ ఎఫ్‌సీ రూ. 1.7 కోట్లు, బెంగళూర్ ఎఫ్‌సీ రూ. 1.2 కోట్లు, అట్లెటికో డీ కోల్‌కత రూ. 1 కోటి చెల్లిస్తున్నాయి. అందుకే దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి పతకాలు తీసుకొచ్చే అథ్లెట్లను పక్కనపెట్టి, పైసలొచ్చే లీగ్ వైపు సాయ్ మొగ్గుచూపుతోంది. అథ్లెట్లకు స్టేడియాలను ఇస్తే అథ్లెటిక్స్ అసోసియేషన్ ఫీజు ఇవ్వదు కదా, అందుకే ఐఎస్‌ఎల్‌కు ఇస్తున్నామని సాయ్ అధికారులు బాహాటంగానే చెబుతున్నారు.

ఇలా అయితే కష్టమే

కేంద్రంలో మోడీ సర్కార్ కొలువుదీరిన తర్వాత క్రీడా రంగంలోనూ గొప్ప మార్పు తీసుకొచ్చామని గొప్పలు పోయారు. కానీ క్రీడలకు వారి చేసినదేమిటో రియో ఒలింపిక్స్‌లో అందరికీ కనిపించింది. షరా మామూలుగానే పథకాలు, ప్రణాళికలతో కాలయాపన చేస్తున్నారు. ఏప్రిల్‌లో కామన్‌వెల్త్ క్రీడలు, తర్వాత ఆసియా గేమ్స్ రాబోతున్నాయి. ఒలింపిక్ టాస్క్‌ఫోర్స్ కమిటీ చెప్పినవన్నీ అమలు చేస్తున్నామని చెప్పిన క్రీడా మంత్రి.. స్టేడియాలు క్రీడాకారుల కోసం ఇవ్వమని సిఫారసు చేయలేదు కనుక అనుమతించటం లేదని చెబితే ఆశ్చర్యపోవాల్సింది క్రీడా లోకమే మరి!. రియో ఒలింపిక్స్‌లో బొక్కాబోర్లా పడినా.. సాయ్ పాఠం నేర్చుకోలేదు. కామన్‌వెల్త్ గేమ్స్ కిట్లు, జెర్సీలు ఆవిష్కరిస్తూ పతకాలు తీసుకురావాలని చెబుతున్న మంత్రి రాజ్యవర్ధన్ సాధన చేసేందుకు స్టేడియం ఎక్కడా అంటే మాత్రం బదులివ్వటం లేదు. రానున్న 3–4 నెలల్లో కామన్వెల్త్, ఆసియా గేమ్స్ ఉన్న నేపథ్యంలో సాయ్ అధికారులు ఇప్పటికైనా మేల్కోవాలి. పతకం సాధించాలన్న అథ్లెట్ల స్వప్నం సాకారం అయ్యేందుకు సాధన చేసేందుకు స్టేడియాలు అప్పగించాల్సిన అవసరం ఉంది. లేదంటే కామన్వెల్త్, ఆసియా గేమ్స్‌లలోనూ రియో ఒలింపిక్స్ అనుభవమే వెక్కిరించే ప్రమాదం లేకపోలేదు.

అథ్లెట్లు ఎక్కడికి పోవాలి : అంజు



ప్రస్తుతం ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు అతి పెద్ద ముప్పును ఎదుర్కొంటున్నారు. బెంగళూర్ సహా ఢిల్లీ, చెన్నైలలో అథ్లెట్లకు మంచి ట్రాక్‌లు ఉన్నాయి. కాబట్టి ఇక్కడే సాధన చేయగలరు. కానీ ఫుట్‌బాల్ లీగ్ వచ్చాక స్టేడియాలను పూర్తిగా వారికి ఇచ్చేశారు. సాధనకు అవకాశం ఇవ్వటం లేదు. ఈ విషయమై సాయ్ ఉన్నతాధికారులతో పలుమార్లు మాట్లాడినా ప్రయోజనం లేదు. బెంగళూర్‌లో ఏకంగా ఫుట్‌బాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. ఫుట్‌బాల్ లీగ్‌లకు సొంత స్టేడియాలను కట్టుకోకుండా ఇక్కడ తిష్ట వేస్తే, అథ్లెట్ల పరిస్థితి ఏం కావాలి' అని అథ్లెటిక్స్ జాతీయ పరిశీలకురాలు, మాజీ ఒలింపిక్ లాంగ్ జంపర్ అంజు బాబీ జార్జ్ అన్నారు.

దక్షిణాఫ్రికా గడ్డపై మన బౌలర్లు మూడు టెస్టుల్లో ఏకంగా 60కి 60 వికెట్లు కూల్చారు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లోనూ ప్రత్యర్థిపై పైచేయి సాధించారు. పిచ్ పేసర్లుకు అనుకూలించినా, బ్యాట్స్‌మెన్‌కు సానుకూలంగా ఉన్నా.. అంతిమంగా మన ఖాతాలో వికెట్లు పడటం సాధారణమైంది. భారత బౌలర్ల నాణ్యమైన ప్రదర్శన వెనుక బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ శ్రమ దాగి ఉంది.

బలమైన బెంచ్‌ను సిద్ధం చేస్తా!



ప్రపంచకప్‌పై బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ

జాతీయ క్రికెట్ అకాడమీలో కోచ్‌గా పని చేసిన అనుభవం పని చేసిందేమో కాబోలు.. భారత బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్ అంచనాలకు మించి ఫలితాలు అందుకుంటున్నాడు!. భువనేశ్వర్ కుమార్, జశ్‌ప్రీత్ బుమ్రాలను పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ప్రమాదకర బౌలర్లుగా తీర్చిదిద్దటంలో అరుణ్ చేయి ఉంది. మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్‌లు టెస్టుల్లో మెరుగ్గా రాణిస్తున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనంత బలంగా భారత బౌలింగ్ పటిష్టంగా ఉంది. దీంతో 2019 వన్డే ప్రపంచకప్ మిషన్‌లో భాగంగా బలమైన బెంచ్ బౌలర్లను సైతం తయారు చేసే పనిలో నిమగ్నమయ్యాడు భరత్ అరుణ్. ప్రతిష్మాత్మక టోర్నీ కావటం, ఈ మధ్యలో గాయాలకు గురైనా రెండో ఆలోచనకు తావు లేకుండా ఉండేందుకు నైపుణ్యమున్న పేసర్లను సిద్ధం చేసే ప్రణాళిక ముందుంచుకున్నాడు. చీఫ్ కోచ్ రవిశాస్త్రి, కెప్టెన్ విరాట్ కోహ్లిలు సైతం బలమైన బెంచ్ బౌలర్ల విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భరత్ అరుణ్ ఈ విషయాలు వెల్లడించాడు.

శ్రీలంక సిరీస్‌లో పరీక్ష : శ్రీలంకలో ముక్కోణపు టీ20 సిరీస్ బెంచ్ బౌలర్లకు ఓ పరీక్ష. టీమ్ ఇండియా రిజర్వ్ బౌలర్ల సత్తా ఏంటో తెలిపే సిరీస్ ఇది. భువనేశ్వర్ కుమార్, జశ్‌ప్రీత్ బుమ్రా రూపంలో ఇద్దరు ప్రపంచ శ్రేణి పేసర్లు ఉన్నారు. శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, జైదేవ్ ఉనద్కత్‌లు శ్రీలంక సిరీస్‌లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఎదురుచూడాలి. టీమ్ ఇండియా ముందు సుదీర్ఘ షెడ్యూల్ ఉన్నందున.. గాయాలు, ఫిట్‌నెస్‌పై అవగాహనతో ఉండాలి. శార్దూల్ ఠాకూర్ దక్షిణాఫ్రికాలో మంచిగా రాణించాడు. మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్‌లు సైతం దేశవాళీ దేవ్‌ధర్ ట్రోఫీలో ఆడుతున్నారు. క్రికెట్‌లో మార్పులను వేగంగా అలవర్చుకోవటం కీలకం. జైదేవ్ ఉనద్కత్ టీ20లో మంచి ప్రతిభ కనబరుస్తున్నాడు. వన్డేల్లోనూ అతడు మెరుగైన పేసర్ కాగలడు. నేను సెలక్టర్ కాదు కనుక అతడి చోటుపై ఏం చెప్పలేను. కానీ కోచ్‌గా అతడి శక్తి, సామర్థ్యాలపై ఓ అంచనా ఉంది. బుమ్రా పరిమిత ఓవర్ల ఫార్మాట్ స్పెషలిస్ట్. కానీ ఇప్పుడతడు టెస్టుల్లోనూ అద్భుతంగా ఒదిగిపోయాడు. కొద్ది మార్పులు చేసుకుంటే, ఉనద్కత్ ఎందుకు వన్డేల్లో ఆడలేడు అని భరత్ అభిప్రాయపడ్డాడు.

మిషన్ 2019 ప్రపంచకప్ : 2019 ప్రపంచకప్‌ను టీమ్ ఇండియా మేనేజ్‌మెంట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. కెప్టెన్‌గా విరాట్ కోహ్లి ఐసీసీ కప్పు అందుకోలేదు. కోచ్‌గా రవిశాస్త్రి సైతం ఐసీసీ ఈవెంట్లలో తనేంటో నిరూపించుకోవాల్సి ఉన్నది. చాంపియన్స్ ట్రోఫీ తృటిలో చేజారగా, ప్రపంచకప్ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. భువనేశ్వర్, బుమ్రాలకు తోడు పేస్ ఆల్‌రౌండర్ పాండ్య సేవలు ఉంటాయి. ఇక మూడో పేసర్ సహా రిజర్వ్ బౌలర్లుగానూ అంతర్జాతీయ ప్రమాణాలకు అందు కోగలిగిన బౌలర్లు ఉండాలని భరత్ కోరుకుంటోంది. అందుకే ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమిలు అందుబాటులో ఉన్నప్పటికీ.. ముక్కోణపు టీ20 సిరీస్‌కు యువ పేసర్లనే ఎంచుకున్నది. శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, జైదేవ్ ఉనద్కత్‌లను రిజర్వ్ బౌలర్లుగా తీర్చిదిద్దేందుకు భరత్ అరుణ్ కృషి చేస్తున్నాడు. 'జట్టు విజయ రహస్యం అందరికీ తెలుసు. క్లిష్ట పరిస్థితుల్లో బౌలర్లు పరిష్కారం చూపు తున్నారు. కోచింగ్ బృందంగా.. బౌలర్లుకు చిట్కాలు, వ్యూహం మాత్రమే చెబుతాము. కానీ మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా వాటిని అన్వయించుకోవటం బౌలర్ల బాధ్యత. నేర్చుకుని ఎదిగే ప్రక్రియలో ఇది భాగం' అని భరత్ అరుణ్ తెలిపాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.